www.visalaandhra.com
స్థాపితం : 1952
విశాలాంధ్ర
VISALAANDHRA Regd No.VJ/042/2018-20
అక్షరాక్షరం అభ్యుదయం

సంపుటి : 68 సంచిక : 193 | శనివారం 05-01-2019 | Simultaneously published from Vijayawada, Hyderabad, Visakapatnam, Kurnool, Tirupathi, Karimnagar, Khammam | వెల: రూ.4.00 | పేజీలు: 12+ టాబ్లాయిడ్ | విజయవాడ ప్రచురణ



ఢిల్లీ జంతర్-మంతర్ వద్ద జరిగిన ధర్నాలో ప్రసంగిస్తున్న రామకృష్ణ. పక్కన నారాయణ, మధు, ముప్పాళ్ల, జగదీష్. హాజరైన సీపీఐ, సీపీఎం, జనసేన శ్రేణులు

రాజకీయ మార్పుతోనే..

ఏపీకి న్యాయం

- మోడీ సర్కార్‌ను గద్దె దింపాలి
- పదేళ్ల హోదా ఎక్కడకెళ్లింది?
- ఇచ్చిన హామీలన్నీ గాలికి వదిలేశారు
- ప్రత్యేక హోదా ధర్నాలో సీతారాం ఏచూరి
- హోదా ఏపీ ప్రజల సొత్తు : నారాయణ
- కేంద్ర ఆర్థిక మంత్రి అరుణ్ జైట్లీకి వినతి

విశాలాంధ్ర - న్యూఢిల్లీ

దేశంలో రాజకీయ మార్పుతోనే ఆంధ్రప్రదేశ్‌కు ఇచ్చిన హామీల అమలు సాధ్యమవుతుందని సీపీఐ. సీపీఎం జాతీయ నాయకులు స్పష్టం చేశారు. ఏపీకి ప్రత్యేక హోదా కోసం జరిగిన ఉద్యమానికి పార్లమెంట్ లోపల, వెలుపల మద్దతు తెలుపుతామని హామీ ఇచ్చారు. ఢిల్లీ జంతర్ మంతర్‌లో శుక్రవారం సీపీఐ. సీపీఎం, ప్రత్యేక హోదా సాధన సమితి, జనసేన ఆధ్వర్యంలో రెండో రోజూ ధర్నా కొనసాగింది. అనంతరం నేతలు కేంద్ర ఆర్థిక

- మిగతా 2 లో



కార్మిక హక్కులకు పాతర

మోడీ విధానాలపై పోరు

సార్వత్రిక సమ్మెకు సీపీఐ మద్దతు

హోదా అడిగితే లాఠీచార్జా ? : సురవరం

2లో



విశాఖ జీవీఎంసీ గాంధీ విగ్రహం వద్ద నిరసన తెలుపుతున్న జేవీఎస్ఎన్ మూర్తి, పైడిరాజు, సత్యాంజనేయ, మార్కండేయులు, రెహమాన్, కుమార్, కృష్ణ, మణి తదితరులు

నిరసన జ్వాల

వాడవాడలా మోడీ దిష్టిబొమ్మల దహనం

పలు జిల్లాల్లో సీపీఐ, సీపీఎం నేతల అరెస్టులు

ఏపీకి ప్రత్యేక హోదా, విభజన హామీలను అమలు చేయాలని ఢిల్లీలో ఆందోళన చేపట్టిన వామపక్షాలపై కేంద్రం దమనకాండ, నాయకుల అక్రమ అరెస్టులకు నిరసనగా.. రాష్ట్రంలో ఉభయ కమ్యూనిస్టులు ఆగ్రహం వ్యక్తం చేశారు. రాష్ట్రానికి దగా చేయటమే కాకుండా శాంతియుత ఆందోళనపై ఉక్కుపాదానికి ఉసిగొల్పిన ప్రధాని నరేంద్ర మోడీ దిష్టిబొమ్మలను దహనం చేయాలని సీపీఐ, సీపీఎం ఇచ్చిన పిలుపు మేరకు ఆంధ్రాలో 13 జిల్లాల్లోనూ పార్టీశ్రేణులు రోడ్డెక్కాయి. ప్రభుత్వ దమననీతిని ఎండగట్టాయి. బీజేపీ సర్కారు తీరును నిశితంగా విమర్శించాయి. ప్రధాని దిష్టిబొమ్మ దహనంతో నిరసన వ్యక్తం చేసిన సీపీఐ, సీపీఎం నేతలను పోలీసులు అరెస్టు చేయటంతో ఉద్రిక్త వాతావరణం నెలకొంది.

నిరసనాగ్రహం
ఫోటోలు టాబ్లాయిడ్‌లో

11లో



పంతాస్టిక్...

ఆసీస్‌తో జరుగుతున్న చివరి టెస్టు తొలి ఇన్నింగ్స్‌లో శతకం బాదిన పంత్ ఖాతాలో మరో రికార్డు చేరింది. ఉపఖండం ఆవల అత్యధిక పరుగులు చేసిన వికెట్ కీపర్‌గా రికార్డు సృష్టించాడు. తొలిసారిగా ఈ ఘనత పాకిస్థాన్ వికెట్ కీపర్ మొయిన్ ఖాన్‌కు దక్కింది. 2003లో హామిల్టన్‌లో జరిగిన టెస్టులో అతను అత్యధికంగా 137 పరుగులు చేశాడు. ఆ తర్వాత శ్రీలంక క్రికెటర్ దినేశ్ చండిమాల్ 2016లో చెస్టర్‌లీ స్ట్రీట్‌లో జరిగిన టెస్టులో 126 పరుగులు చేశాడు. బంగ్లాదేశ్ క్రికెటర్ ముష్ఫికర్ రహీమ్ 2017లో 159 పరుగులు చేసి తొలి స్థానంలో నిలిచాడు. ఇప్పుడు సిడ్నీ వేదికగా జరిగిన టెస్టులో పంత్ సైతం 159 పరుగులు చేసి నాటౌట్‌గా నిలిచాడు.

12లో

ఉపాధినివ్వని వృద్ధి

'ఒక దేశంలో జరిగే మెరుగైన ఉత్పత్తి, ఉపాధి, పురోభివృద్ధి సంతృప్తిని, ఆనందాన్ని కలుగుజేస్తాయి'
- డేనియల్ వెబర్

ప్రొఫెసర్ ఏవీవీయస్‌కే రావు, డాక్టర్ ఎమ్.రాములు

దేశంలో వృద్ధికి, నిరుద్యోగానికి మధ్య అంతరం పెరుగుతోంది. 2012 నుంచి ఆర్థికవృద్ధి భద్రమైన, క్రమమైన, గౌరవనీయమైన ఆదాయాలను పెంచడంలో ప్రభుత్వాలు విఫలమయ్యాయి. అత్యధిక మెజారిటీ ప్రజలు ప్రత్యేకించి అసంఘటిత, సంఘటిత రంగాలలో పనిచేస్తున్నవారి ఆదాయాలు పెరగడం లేదు. భారతదేశం తీవ్రమైన నిరుద్యోగం, జీవనభృతి, సంక్షోభాలను ఎదుర్కొంటున్నది. అధికార గణాంకాల ప్రకారం వృద్ధిరేటు 2012-2016 మధ్యకాలంలో మెరుగ్గా ఉంది. అయితే అకాలంలో అపసవ్యమైన ఆలోచనావిధానాలు ఆర్థికవ్యవస్థలో సంక్షోభాన్ని సృష్టించాయి. ప్రత్యేకించి పెద్దనోట్ల రద్దు, అనాలోచిత జీఎస్‌టీ విధానాన్ని ప్రధానమంత్రి నరేంద్రమోడీ నాయకత్వంలోని బీజేపీ ప్రభుత్వం సంస్కరణల పేరుతో అమలులోకి తీసుకొచ్చింది. ఈ రెండూ సంక్షోభాలను సృష్టించాయి. 2015-2018 ఆగస్టు మధ్యకాలంలో ఉద్యోగాలను సృష్టించడంలోనూ, ఉపాధి కల్పించడం లోనూ, ఉత్పత్తిని పెంచడంలోనూ ప్రభుత్వం విఫలమైంది. ప్రధానమైన రంగాలలో ఉత్పాదకత పడిపోవడంతో ఆదాయాలు పెరగలేదు. అంతేకాదు..నోట్లరద్దు విధానం 22.5 కోట్లమంది ప్రజలను గట్టిగా దెబ్బతీసింది. గ్రామీణ ప్రాంతాల్లో వ్యవసాయం, అసంఘటితరంగం బాగా నష్టపోయాయి. ఇవి రెండూ కోలుకోవడానికి కనీసం 3నెలలకుపైగా పడుతుంది. ఈ రెండు రంగాలకు పెట్టుబడులు సమయానికి



అందలేదు.

జీడీపీ-ఉపాధి

ఈ రెండు అంశాలపై అజీమ్‌ప్రేమ్‌జీ యూనివర్సిటీకి చెందిన సుస్థిర ఉపాధి కల్పనా కేంద్రం అధ్యయనం నిర్వహించింది. ఇటీవలికాలంలో వృద్ధికి, ఉపాధి కల్పనకు అంతరం ఎక్కువగా పెరిగింది. 1970-1980 మధ్య కాలంలో జీడీపీ వృద్ధిరేటు 3-4శాతం ఉన్నది. అదే సమయంలో ఉద్యోగ కల్పన వృద్ధిరేటు 2శాతం ఉంది. 2013 తరువాత జీడీపీ వృద్ధిలో ఉపాధి కల్పన వృద్ధి నిష్పత్తి 0.1శాతం మాత్రమే...ప్రత్యేకించి చదువుకున్న యువతలో ఎక్కువగా నిరుద్యోగం ఉంది. దీని అర్థం జీడీపీ 10శాతం పెరిగితే ఉపాధి కల్పన ఒక శాతం కంటే తక్కువగా జరిగింది. వాస్తవంగా ఉపాధి, ఉద్యోగాల కల్పన 2013-2016 మధ్య కాలంలో 70 లక్షలు తరిగిపోయింది. ఆ తరువాత కాలంలోనూ ఉపాధి

- మిగతా 2 లో

అయ్యప్ప ఆలయంలోకి...

సింహాళ మహిళ...!



తిరువనంతపురం:

శబరిమల అయ్యప్పను దర్శించుకుని 800 ఏళ్ల చరిత్రను ఇద్దరు మహిళలు తిరగరాయగా... మతోన్మాదులు, మనువాదులు అక్కసుతో కేరళలో యాగీ చేస్తున్న తరుణంలో.. శ్రీలంకకు చెందిన 46 ఏళ్ల మహిళ ఒకరు గురువారం రాత్రి స్వామి అయ్యప్పను దర్శించుకున్న ఘటన సంచలనం రేపింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం శ్రీలంకకు చెందిన శశికళ, తన భర్తతో కలిసి శబరిమలకు చేరుకున్నారు. పాస్‌పోర్టు ప్రకారం ఆమె 1972 డిసెంబరు 3న జన్మించినట్టు నిర్ధారించారు. కోజికోడ్‌కు చెందిన బిందు (42), కనకదుర్గ (44) బుధవారం అయ్యప్ప స్వామిని దర్శించుకున్నప్పటికీ పదునెట్టాంబడి మాత్రం ఎక్కలేదు. వీరిద్దరూ అయ్యప్ప మాల ధరించినప్పటికీ సాధారణ భక్తులు వెళ్లే మార్గంలో ఆలయంలోకి ప్రవేశించి దర్శించుకున్నారు. గురువారం సాయంత్రం పంబా బేస్ క్యాంప్‌కు చేరుకున్న శశికళకు డీఎస్పీ కేడర్ అధికారి ఆధ్వర్యంలో రెండు బృందాలు భద్రత కల్పించాయి. ఎలాంటి ఇబ్బందులు లేకుండా '18 పడి మెట్లు' ఎక్కిందనీ.. గర్భగుడిలో పూజలు చేసిందని పోలీసులు తెలిపారు. 'శశికళతో పాటు ఆమె బంధువులు వచ్చారు. సాయంత్రం 9.30కి దర్శనం పూర్తి చేసుకున్నారు. తిరిగి 11 గంటలకల్లా క్షేమంగా పంబకు చేరుకున్నారు...' అని పోలీసు వర్గాలు వెల్లడించాయి.

బీజేపీ - ఆర్ఎస్ఎస్ సర్జికల్ స్ట్రైక్

సంఘ్‌పరివార్‌ది అంటరానితనం, క్రూరత్వ అజెండా

సామాజిక కార్యకర్త అగ్నివేష్

9లో

ఆగని మనువాదుల

మారణహోమం

- ప్రతిఘటిస్తున్న కేరళ సర్కారు
- 801 కేసుల్లో 1369 మంది అరెస్టు

తిరువనంతపురం / న్యూఢిల్లీ :

సుప్రీం కోర్టు తీర్పును అమలు చేస్తూ శబరిమల ఆలయంలోకి మహిళలకు ప్రవేశం కల్పించిన కేరళ సర్కారుపై మతోన్మాదులు, మనువాదులు విషం కక్కుతున్నారు. ముఖ్యంగా బీజేపీ, ఆర్ఎస్ ఎస్, సంఘ్ పరివార్ శక్తులు అరాచకం సృష్టిస్తున్నాయి. కేరళ రాష్ట్రాన్ని యుద్ధ క్షేత్రంగా మార్చేందుకు కుట్ర పన్నాయి. శబరిమల వివాదాన్ని మరింత తీవ్రతరం చేస్తూ హింసకు పాల్పడుతున్నాయి. రాష్ట్రంలో శుక్రవారం కూడా హింసాత్మక ఘటనలు నమోదయ్యాయి. అనేకచోట్ల హిందోన్మాదులు రెచ్చిపోయారు. పెట్రో బాంబులు విసిరారు. రాళ్లురువ్వారు. గురువారం హిందూ సంఘాల బంద్ హింసాత్మకమైన నేపథ్యంలో 801 కేసులు నమోదు కాగా.. 1,369 మందిని అరెస్టు చేసినట్టు పోలీసులు వెల్లడించారు. శుక్రవారం తెల్లవారుజామున కోజికోడ్‌లోని పెరాంబ్రా వద్ద మలబార్ దేవస్వామ్ బోర్డు సభ్యులు కె.శశికుమార్ ఇంటిపైకి నిరసన కారులు పెట్రో బాంబులు విసిరారు. పతానంతిట్ట, అదూర్‌లోని ఓ మొబైల్ షాపుపైనా దాడి చేశారన్నారు. సీపీఎం, బీజేపీ కార్యకర్తల మధ్య తరచూ ఘర్షణలు చెలరేగే కన్నూర్‌లో నాలుగు చోట్ల పెట్రో బాంబులను విసిరారని, తాము కేసులు నమోదు చేసినట్టు పోలీసులు తెలిపారు. ఈ జిల్లాలో ఇప్పటివరకు 200 మందిని అదుపులోకి తీసుకున్నామన్నారు. ఆయా ఘటనల్లో ఎవ్వరూ గాయపడలేదని చెప్పారు. శబరిమల కర్మ సమితి నేతృత్వంలో జరిగిన హర్తాళ్‌లో హిందూత్వ సంఘాలు రెచ్చిపోయి పెట్రో బాంబులు, రాళ్లు విసిరి బీభత్సం సృష్టించాయి. పోలీసులు, రాజకీయ వర్గాలతో ఘర్షణకు దిగి అనేకమందిని గాయాల



పాల్జేశాయి. కోజికోడ్, కన్నూర్, మల్లప్పురం, పలక్కాడ్, తిరువనంతపురం తదితర ప్రాంతాలలో ఉద్రిక్త పరిస్థితులు నెలకొన్నాయి. ఆందోళనకారులపై బాష్పవాయువు, వాటర్ కెనాన్లను పోలీసులు ప్రయోగించారు.

పలక్కాడ్‌లో నిషేధాజ్ఞలు

పలక్కాడ్ పట్టణం, కాసర్‌గాడ్ జిల్లాలోని మంజేశ్వరం తాలుక్‌లో నిషేధాజ్ఞలు అమలయ్యాయి. జిల్లా పోలీస్ చీఫ్ సహా అనేకమంది అధికారులు దాఖలు చేసిన నివేదికల ఆధారంగా కలెక్టర్ డి.బాలమురళి ఈ మేరకు నిషేధాజ్ఞలను జారీచేశారు. అయితే అవి శుక్రవారం సాయంత్రం 6 గంటల వరకే అమల్లో ఉన్నాయి. సాయంత్రం 4 గంటలకు అఖిలపక్ష సమావేశాన్ని నిర్వహించి భవిష్యత్ కార్యాచరణను నిర్ణయించినట్టు కలెక్టర్ తెలిపారు. కాగా, కాసర్‌గాడ్ కలెక్టర్ డి.సతీష్‌బాబు కూడా మంజేశ్వరంలో 24

- మిగతా 2 లో

ఇదీ లోకం!



ప్రతి ఇంటికీ స్మార్ట్‌ఫోన్

- పేదల ఇంటి అభివృద్ధికి రూ.లక్షా 50 వేలు
- అన్ని నియోజకవర్గాల్లో ఎంఎస్ఎంఈ పార్కులు
- ఎస్ఈజెడ్‌కు రూ.2,300 కోట్ల పెట్టుబడులు
- జన్మభూమి సభలో చంద్రబాబు

విశాలాంధ్ర ప్రతినిధి - కాకినాడ :

రాష్ట్రవ్యాప్తంగా త్వరలో ప్రతి ఇంటికీ స్మార్ట్ ఫోన్ ఇస్తామని, ఆ ఫోన్‌లోనే రియల్ టైమ్ పర్యవేక్షణ చేపడతామని ముఖ్యమంత్రి చంద్రబాబు అన్నారు. 6వ విడత జన్మభూమి-మా ఊరు కార్యక్రమం శుక్రవారం తూర్పుగోదావరి జిల్లా కాకినాడ జేఎన్‌టీయూ గ్రౌండ్స్‌లో జరిగింది. ఈ సందర్భంగా నిర్వహించిన బహిరంగ సభలో



సీఎం ప్రసంగించారు. ప్రజలు లబ్ధి పొందిన సంక్షేమ పథకాలపై స్మార్ట్‌ఫోన్ ద్వారా సమీక్ష చేస్తానన్నారు. ఐవీఆర్ఎస్ ద్వారా ఆయా పథకాల లబ్ధిదారులకు ఫోన్ చేసి సంతృప్తి స్థాయి తెలుసుకుంటానన్నారు. నిరుపేదలందరికీ ఇళ్ల నిర్మాణంతోపాటు ఇప్పటికే నిర్మించుకున్న ఇళ్ల అభివృద్ధికి లక్షా 50 వేల రూపాయలు అందజేస్తామని, దీనికోసం ప్రాజెక్టు రిపోర్టు తయారు చేయమని అధికారులను ఆదేశించినట్టు చెప్పారు. రిపోర్టు వచ్చిన తర్వాత అమలు చేస్తామని హామీ ఇచ్చారు. ఆరోగ్య సంరక్షణ కోసం రూ.5 లక్షలు ఇవ్వాలని నిర్ణయం తీసుకున్నామన్నారు. ప్రతి నియోజకవర్గంలోనూ ఎంఎస్ఎంఈ పార్కులు ఏర్పాటు చేయబోతున్నామని, వీటిలో బ్రాండింగ్, మార్కెటింగ్ ద్వారా మహిళలను పారిశ్రామిక వేత్తలుగా తీర్చిదిద్దుతామని చంద్రబాబు అన్నారు. నిరుపేదలకు ఉచితంగా వంద యూనిట్ల విద్యుత్ పథకం అందరికీ తెలిసేలా అధికారులు చర్యలు తీసుకోవాలన్నారు. కాకినాడ ఎస్ఈజెడ్‌కు రూ.2,300 కోట్ల పెట్టుబడులతో పరిశ్రమలు రాబోతున్నాయని, దీనికోసం ఎంఓయూలు కుదుర్చుకున్నామని తెలిపారు. రూ.30 కోట్లతో హల్దియా పెట్రో కెమికల్ కారిడార్ కాకినాడకు రానుందని అన్నారు.

- మిగతా 2 లో

బీజేపీకి గుణపాఠం తప్పదు

లాఠీచార్జి, ఎంపీల సస్పెన్షన్‌ను ఖండించిన సీఎం చంద్రబాబు

2లో

జగన్‌పై దాడి కేసు

నియాకు అప్పగింత



అమరావతి :

ఏపీ ప్రతిపక్ష నేత వైఎస్ జగన్‌మోహన్ రెడ్డిపై విశాఖపట్నం విమానాశ్రయంలో జరిగిన దాడి కేసును ఏపీ హైకోర్టు ఎన్ఐఏకి అప్పగిస్తూ ఉత్తర్వులు జారీ చేసింది. ఈ కేసుపై శుక్రవారం ఏపీ హైకోర్టు విచారణ జరిపింది. ఎన్ఐఏ యాక్ట్ ప్రకారం కేసును ఎన్ఐఏకి బదిలీ చేయాలని వైఎస్ జగన్ తరపు న్యాయవాది గత విచారణలో కోర్టును కోరారు. కేసు దర్యాప్తు ఆలస్యమైతే సాక్ష్యాధారాలు తారుమారు అయ్యే అవకాశం ఉందని పిటిషనర్ తరుపు న్యాయవాది కోర్టు దృష్టికి తీసుకువచ్చారు. ఈ కేసును ఎన్ఐఏకి అప్పగించడంపై కేంద్ర, రాష్ట్రాలను హైకోర్టు గతంలోనే అడిగి తెలుసుకుంది. ఈ కేసును ఎన్ఐఏకి అప్పగించడంపై కేంద్రం నిర్ణయం తీసుకోకపోతే, తామే తీసుకుంటామని హైకోర్టు తేల్చిచెప్పడంతో కేంద్రం ఎన్ఐఏ విచారణకు అంగీకరించింది. జనవరి 1నే హైదరాబాద్‌లోని ఎన్ఐఏ పోలీసు స్టేషన్‌లో కేసు రిజిస్టర్ చేసింది. విశాఖపట్నం ఎయిర్‌పోర్ట్‌లోని వీవీఐపీ లాంజ్‌లో అక్టోబర్ 25న వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిపై ఫ్యూజన్‌ఫుడ్స్ రెస్టారెంట్‌లో పనిచేస్తున్న శ్రీనివాసరావు కత్తితో దాడి చేసిన సంగతి విధితమే. రక్షణశాఖకు చెందిన తూర్పు నావికాదళం పర్యవేక్షణలోని ఎయిర్‌పోర్ట్‌లో

- మిగతా 2 లో

చైనాకు వెళ్లొద్దు : అమెరికా హెచ్చరిక

వాషింగ్టన్ : చైనాకు వెళ్లినవారిపైన అక్కడి ప్రభుత్వం ఏకపక్షంగా చర్య తీసుకుంటున్నదని, అందువల్ల అమెరికా పౌరులు చైనాలో పర్యటించవద్దని అమెరికా విదేశాంగశాఖ సూచించింది. చైనాకు వెళ్లే అమెరికా ప్రజలు మరింత జాగ్రత్తగా ఉండాలని ఆశాఖ పేర్కొంది. చైనాలో పర్యటించవద్దని తాము నిరుత్సాహపరచడంలేదని యాత్రికులకు తెలియజేసింది. స్థానిక చట్టాలను నిరంకుశంగా చైనా అమలు చేస్తున్నదని అమెరికా విదేశాంగశాఖ గతంలో చేసిన ప్రకటనలాంటిదే ఇప్పుడు కూడా చేసింది. చైనాలోని వారసత్వ ప్రదేశాలను చూసే యాత్రికులను అక్కడి ప్రభుత్వం హింసిస్తున్నదని ఆరోపించింది. చైనా నుండి వెళ్లిపోయే వారిపైన నిషేధాజ్ఞలను విధిస్తున్న అంశం ఎక్కువమంది అమెరికా పౌరులకు తెలియదని విదేశాంగశాఖ తెలిపింది.

మాక్రాన్‌పై 75శాతం అసంతృప్తి

పారిస్: ఫ్రాన్స్ అధ్యక్షుడు ఇమ్మాన్యుయేల్ మాక్రాన్ ప్రభుత్వంపైన 75శాతం ప్రజలు అసంతృప్తి ప్రకటిస్తున్నారు. కుటుంబాల ఆదాయాన్ని పెంచేందుకు మరిన్ని చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నట్లుగా గురువారం విడుదలైన సర్వే ఒకటి తెలియజేసింది. గత రెండు నెలలుగా 'యెల్లో వెస్ట్' (పచ్చచొక్కాల ఉద్యమం) ఉద్యమకారులు వీధుల్లోకి వచ్చి ప్రభుత్వ విధానాలపైన తీవ్ర నిరసన వ్యక్తంచేసారు. ఈ ఉద్యమానికి లొంగిన ప్రభుత్వం ఎట్టకేలకు పెంచిన ఇంధన ధరలను తగ్గిస్తామని హామీ ఇచ్చింది. దీనితో కొంతమేరకు ఆందోళన తగ్గిపోయింది. మాక్రాన్ 20నెలల క్రితం అధికారాన్ని చేపట్టారు. వివిధరకాల సంస్కరణలను చేపడతామని ఆయన చేసిన వాగ్దానాలను వేటినీ నెరవేర్చలేదు. నిరుద్యోగులకు ఉపాధికల్పిస్తానని, సివిల్ సర్వీసులను ప్రక్షాళన చేస్తానని తదితర హామీలు ఇచ్చి విఫలమయ్యారు. ఒడోక్సా అండ్ డెంటూ కన్సల్టింగ్ సంస్థ ఫిగరో వార్తా పత్రికతో కలిసి సర్వే నిర్వహించింది. మాక్రాన్ ప్రభుత్వంపై 25శాతంప్రజలే సంతృప్తిగా ఉన్నారు. బుధ, గురువారాల్లో తాజా సర్వే చేశారు. గత ఏప్రిల్‌లో జరిగిన సర్వేలో 59శాతం ప్రజలు అసంతృప్తి వ్యక్తం చేయగా, తాజా సర్వేలో 75శాతం మంది అసంతృప్తి ప్రకటించారు. ప్రజల కొనుగోలు శక్తిని పెంచాలని 55శాతం మంది కోరుతున్నారు.

విశాలాంధ్ర ప్రపంచం

అమెరికా ప్రతినిధుల సభ స్పీకర్ పెలోసి



వాషింగ్టన్ : అమెరికా ప్రతినిధుల సభ స్పీకర్‌గా నాన్సీపెలోసీని గురువారం సభ్యులు ఎన్నుకున్నారు. పెలోసి కాలిఫోర్నియానుండి డెమోక్రటిక్ పార్టీ అభ్యర్థిగా సభకు ఎన్నికయ్యారు. పెలోసి వయస్సు 78 సంవత్సరాలు. స్పీకర్‌గా ఎన్నికకావడం ఇది రెండవసారి. కొత్త సంవత్సరం సెలవుల అనంతరం సభ ప్రారంభమైన మొదటిరోజే స్పీకర్ ఎన్నిక జరిగింది. కాంగ్రెస్ దిగువ సభలో డెమోక్రటిక్ పార్టీ ఆధిక్యత కలిగివున్న 2007-2011 మధ్యకాలంలో కూడా పెలోసి స్పీకర్‌గా పనిచేశారు. పెలోసిపై పోటీచేసిన రిపబ్లికన్ పార్టీ అభ్యర్థి కెవిన్‌మెకర్థి ఓటమి పాలయ్యారు. సభలో 430 మంది సభ్యులువుండగా 220 మంది సభ్యుల ఓట్ల మెజార్టీతో పెలోసి స్పీకర్‌గా ఎన్నికయినట్టు సిఎన్ఎన్ వార్తాసంస్థ తెలిపింది. ఎన్నికయిన తరువాత ఆమె మాట్లాడుతూ, సభ అమెరికా ప్రజల టౌన్‌హాలులోనే జరుగుతుందని అక్కడ ప్రజల సమస్యలను వింటామని చెప్పారు. తమ పార్టీ దీర్ఘకాలంలో అమలుచేయనున్న ప్రాధాన్యతా అంశాలను ఆమె సమీక్షించారు. వాతావరణ మార్పులపైన, ఆరోగ్య ఖర్చుల తగ్గింపు, పచ్చదనం పెంచే మౌలిక సదుపాయాల కల్పన ప్రభుత్వ గౌరవాన్ని పునరుద్ధరించడం తదితర అంశాలను వెల్లడించారు. ట్రంప్ ప్రభుత్వం పాక్షికంగా మూతపడి గురువారానికి 13 రోజులవుతుంది. శుక్రవారం నుండి ప్రభుత్వం మూతపడిన సమస్య పూర్తిగా పరిష్కారంగాకపోయినప్పటికీ తిరిగి ప్రభుత్వం పనిచేయడం ప్రారంభించింది. మెక్సికో సరిహద్దుల్లో గోడ నిర్మాణానికి అనేక మిలియన్ డాలర్లను ట్రంప్ ప్రతిపాదించగ ప్రతినిధుల సభ తిరస్కరించడంతో ప్రభుత్వానికి ప్రతినిధుల సభకు మధ్య ప్రతిష్టంభన ఏర్పడింది. అనంతరం ప్రభుత్వం పాక్షికంగా మూతపడింది. కొన్ని శాఖలు మాత్రమే పనిచేశాయి. 8 లక్షలమందికి పైగా సిబ్బందికి సకాలంలో వేతనాలు సైతం అందలేదు. ఇకపైన ట్రంప్ ప్రభుత్వం చేసే ప్రతిపాదనలన్నింటిపైన ప్రతినిధుల సభ కఠినంగా వ్యవహరించే అవకాశం లేకపోలేదు. స్పీకర్ ఎన్నికలో డెమోక్రాట్లకు 235 సభ్యులున్నారు.

థాయ్‌లాండ్‌లో తుపాను హెచ్చరికలు



బ్యాంకాక్: థాయ్‌లాండ్ గల్ఫ్ ప్రాంతంలో తీవ్రమైన తుఫాను 'పబక్' ఎప్పుడైనా విరుచుకుపడే అవకాశం ఉన్నదని, ఇప్పటికే వర్షం ప్రారంభమయిందని అధికారులు వెల్లడించారు. ప్రజలు అప్రమత్తంగా ఉండాలని హెచ్చరించారు. సముద్రం అల్లకల్లోలంగా ఉన్నదని శుక్రవారం సాయంకాలానికే భారీ వర్షాలు కురిసే అవకాశాలున్నాయని అధికారులు ప్రకటించారు. సముద్రంలో ఫెర్రీ సేవలను నిలిపివేశారు. స్థానిక ప్రజలను సురక్షిత ప్రాంతాలకు తరలించారు. తుఫాను సంభవించనున్నందున దక్షిణ ప్రాంతంలోని బీచ్‌రిసార్ట్‌లను యాత్రికులు ఖాళీచేసి వెళ్లిపోవలసిందిగా ప్రభుత్వం కోరింది. 1989లోనూ థాయ్‌లాండ్‌లో పెనుతుఫాను సంభవించి 400కి పైగా చనిపోయారు. ఇప్పుడు కూడా అంత భారీస్థాయిలో తుఫాను అల్లకల్లోలాన్ని సృష్టించే అవకాశంవుందని అధికారులు వెల్లడించారు. థాయ్‌లాండ్ దక్షిణ ప్రాంతంలో 1962లో భీకరమయిన తుఫాను సంభవించి 900ల మందికిపైగా మరణించారు. తుఫాను హెచ్చరికలు చేసినందున యాత్రికులు జాగరూకులై తిరిగి తమతమ ప్రాంతాలకు బయలుదేరి వెళుతున్నారు. తుఫాను ప్రభావం ఇప్పటికే ఒక యాత్రికుడిపైన చూపింది. రష్యా యాత్రికుడు కోహ్ సముయ్‌పైన రాళ్లు పడిపోయి చనిపోయారు. తన కుమార్తెను రక్షించబోయి ఆయనే భారీ రాళ్లదెబ్బలు తగిలి మరణించారు. శనివారానికి థాయ్‌లాండ్ తూర్పుతీరంలో తుఫాను బీభత్సం సృష్టించే అవకాశంవుందని వాతావరణ పరిశోధనా శాఖ హెచ్చరించింది. ముఖ్యంగా సూరత్‌థాని, నఖాన్‌సితమ్రత్ రాష్ట్రాలలో తుఫాను కల్లోలాన్ని సృష్టించే అవకాశంవుందని వాతావరణశాఖ తెలియజేసింది. సూరత్‌థాని ప్రాంతం యాత్రా కేంద్రం. సైనిక ట్రక్కులు యాత్రికులు, స్థానిక ప్రజలను సురక్షిత ప్రాంతాలకు తరలిస్తున్నాయి. నిర్వాసితులకు ఆశ్రయం కల్పించేందుకు మూడు తాత్కాలిక షెల్టర్లను ఏర్పాటు చేశామని, వీటిలో 1000 మంది ఆశ్రయం పొందవచ్చునని స్థానిక అధికారులు తెలిపారు. థాయ్‌లాండ్ దక్షిణ ప్రాంతం టూరిజం కేంద్రమేగాక మత్స్యపరిశ్రమకు కూడా పేరుపొందింది. చిన్నచిన్న బోట్లు సముద్రంలోకి వెళ్లరాదని అధికారులు హెచ్చరించారు. తుఫాను సందర్భంగా బలమైన గాలులు వీస్తాయని, సముద్రంలో అలలు 3 నుండి 5 మీటర్లవరకు ఎత్తు ఎగిసిపడతాయని ప్రభుత్వం హెచ్చరించింది. 80 కి.మీ. వేగంతో గాలులువీచే అవకాశం ఉన్నందున ఈ ప్రాంత ప్రజలు తగిన జాగ్రత్తలు తీసుకోవాలని ప్రభుత్వం కోరింది. తుఫాను నుండి ప్రజలను రక్షించేందుకు అన్ని జాగ్రత్త చర్యలు తీసుకున్నామని ప్రధానమంత్రి ప్రేయుత్‌ఛాన్‌ఒచ తెలిపారు.

ట్రంప్-ఇమ్రాన్‌ఖాన్ భేటీ?



ఇస్లామాబాద్ : అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్, పాకిస్థాన్ ప్రధానమంత్రి ఇమ్రాన్‌ఖాన్ భేటీ అయ్యే అవకాశంవుంది. ఈ అంశాన్ని ట్రంప్ స్వయంగా తెలియజేశారు. పాకిస్థాన్ నూతన నాయకత్వంతో మంచి సంబంధాలు ఏర్పాటు చేసుకోవాలని తాను కోరుకుంటున్నట్టు ఆయన తెలిపారు. ఈ ప్రతిపాదనపైన ఇప్పటికే అధికారస్థాయి చర్చలు జరిగాయి. అయితే ఆఫ్ఘనిస్తాన్‌లో శాశ్వత శాంతి కోసం జరిగే కృషి ఫలించి ఒప్పందం కుదిరినట్లయితే వీరువురు భేటీకి సానుకూలమైన వాతావరణం ఏర్పడుతుంది. ఎక్స్‌ప్రెస్ ట్రిబ్యూన్ అందించిన వార్త ఆధారంగా పాకిస్థాన్ అధికారి ఒకరు ఈ విషయాన్ని తెలియజేశారు. గత ఆగస్టులో పాకిస్థాన్ ప్రధానమంత్రిగా ఇమ్రాన్‌ఖాన్ బాధ్యతలు స్వీకరించారు. పరిస్థితులన్నీ అనుకూలిస్తే ఇమ్రాన్‌ఖాన్ అమెరికాకు వెళ్లే అవకాశం ఉంటుందని పేరు చెప్పడానికి ఇష్టపడని అధికారి ఒకరు తెలియజేశారు. అమెరికాపట్ల పాకిస్థాన్ సక్రమంగా వ్యవహరించడంలేదని ట్రంప్ తన మంత్రివర్గ సభ్యులతో రెండురోజుల క్రితం వ్యాఖ్యానించారు.

పాకిస్థాన్‌తో గొప్ప సంబంధం ఏర్పరచుకోవాలని కోరుకుంటున్నామని, వారు మాత్రం మన శత్రువుకు ఆశ్రయం ఇస్తున్నారని ట్రంప్ తెలిపారు. మన శత్రువును రక్షిస్తున్నప్పుడు సంబంధాలు ఎలా ఏర్పాటు చేసుకుంటాము? అని ట్రంప్ ప్రశ్నించారు. అయినప్పటికీ పాకిస్థాన్ నూతన నాయకత్వంతో సమావేశం కావాలని తాను ఎదురుచూస్తున్నట్టు ట్రంప్ వెల్లడించారు. సమావేశం కావడం అతి త్వరలోనే జరగవచ్చునని చెప్పారు. పాకిస్థాన్‌కి 1.3 బిలియన్ డాలర్ల సహాయాన్ని అందించకుండా నిలిపివేసిన విషయాన్ని కూడా ఆయన ప్రస్తావించారు. మనం చేసే సహాయమంతా నీళ్లలో కలిసిపోతోంది.

అందువల్లనే సహాయాన్ని నిలిపివేశాము అని ట్రంప్ పేర్కొన్నారు. 2018 జనవరి 1న ట్రంప్ పాకిస్థాన్‌పై చేసిన వ్యాఖ్యానాలకు తాజాగా వెల్లడించిన అంశానికి ఎలాంటి సంబంధం లేకుండా ఉన్నది. 2018లో తన మొదటి ట్వీట్‌లో పాకిస్థాన్‌ను ఆయన తీవ్రంగా విమర్శించారు. పాకిస్థాన్ నాయకులు అమెరికాకు ఏమీ సహాయపడటంలేదని, అబద్ధాలు చెబుతూ మోసగిస్తున్నారని ఆగ్రహం ప్రకటించారు. గత 15 ఏళ్లుగా అమెరికా తెలివితక్కువగా పాకిస్థాన్‌కి 33 బిలియన్ డాలర్లకుపైగా సహాయాన్ని అందించిందని, దానికి బదులుగా పాకిస్థాన్ అబద్ధాలు చెబుతూ మోసగిస్తున్నదని విరుచుకుపడ్డారు. టెర్రరిస్టులకు ఆశ్రయం కల్పిస్తున్నారని కూడా ఆయన విమర్శించారు.

సౌదీ మహిళలకు విడాకుల మెసేజ్‌లు

బీరుట్: సౌదీ అరేబియాలో మహిళలకు భర్తలు మెసేజ్‌లద్వారా విడాకుల అంశాన్ని తెలియజేయాలని న్యాయమంత్రిత్వశాఖ నిబంధన పెట్టింది. కేవలం మెసేజ్‌ల ద్వారా విడాకులను పంపించే స్థితి ఏర్పడింది. కోర్టుల ద్వారా భర్తలు విడాకులు వచ్చిన తర్వాత భార్యలకు ఆ అంశాన్ని మెసేజ్‌లద్వారా పంపాలని న్యాయమంత్రిత్వశాఖ ఒక నియమాన్ని ఈ నెల 6వతేదీ నుండి అమలుచేయనుంది. ప్రస్తుతం కోర్టులనుండి విడాకుల డిక్రీలు పొందిన భర్తలు ఆ అంశాన్ని భార్యలకు తెలియజేయడంలేదు. విడాకుల విషయం తమకు తెలియకుండానే పోతోందని జెడ్డానుండి ఫోన్‌లో మాట్లాడిన ఘండీ అనే మహిళ తెలిపింది. మెసేజ్‌లద్వారా వచ్చే సందేశం వల్ల కనీసం విడాకుల అంశాన్ని తెలుసుకునే హక్కు కలిగిందని ఆమె పేర్కొన్నారు.

ఏపీకి న్యాయం

(మొదటిపేజీ తరువాయి)

మంత్రి అరుణ్ జైట్లీని కలిసి వినతి పత్రం సమర్పించారు. ఈ ధర్నాకు సీపీఐ జాతీయ కార్యదర్శి కె.నారాయణ, సీపీఐ ఎంపీ వినయ్ విశ్వం, సీపీఎం ప్రధాన కార్యదర్శి సీతారాం ఏచూరి, పొలిట్ బ్యూరో సభ్యులు బీవీ రాఘవులు సంఘీభావం తెలిపారు. ఈ సందర్భంగా సీపీఐ రాజ్యసభ ఎంపీ బినయ్ విశ్వం మాట్లాడుతూ, ప్రత్యేక హోదా ఏపీ ప్రజల హక్కని, దానికోసం కోసం జరిగే ఉద్యమానికి తమ మద్దతు ఉంటుందన్నారు. ఆంధ్రప్రదేశ్‌ను రెండుగా విభజించారని, అప్పుడు ఏపికి యూనివర్శిటీలు, రైల్వే జోన్, స్టీల్‌ప్లాంట్, పారిశ్రామిక ప్రోత్సహకాల హామీలు ఇచ్చారని తెలిపారు. కేంద్ర ప్రభుత్వం నూతనంగా ఏర్పాడిన ఏపీకి అన్ని వసతులు కల్పిస్తామని తెలిపిన విషయాన్ని విశ్వం గుర్తు చేశారు. కానీ ఇచ్చిన హామీలను ఉల్లంఘించారని విమర్శించారు. మోడీ సర్కార్‌కు ఏపీ ప్రజలు వార్నింగ్ నోటీసులు ఇచ్చిందని, హామీలను అమలు చేసే వరకు ఉద్యమం జరుగుతుందని హెచ్చరించారు. శాంతి యుతంగా ఉద్యమించేవారిపై పోలీసులతో దాడి చేయించడమేంటనీ మండిపడ్డారు. సీపీఐ జాతీయ కార్యదర్శి నారాయణ మాట్లాడుతూ ప్రత్యేక హోదాపై కొన్ని పార్టీలకు చిత్తశుద్ధి లేదని, హోదా కోసం దెబ్బలు తిన్న ఈ పోరాటం అసలైన పోరాటమని, కొంతమంది నకిలీ పోరాటం చేస్తున్నారని విమర్శించారు. ఏపీ ప్రజలపై ఎందుకు దాడి చేస్తున్నారని విమర్శించారు. ప్రత్యేక హోదా చంద్రబాబు అబ్బసొత్తుకాదు, మోడీ తాత సొత్తు కాదని ఎద్దేవా చేశారు. ప్రత్యేక హోదా ఏపీ ప్రజల సొత్తని పేర్కొన్నారు. ఏపిలో బీజేపీ పేరుతో పోటీ చేస్తే డిపాజిట్లు కూడా రావని అన్నారు. సీతారాం ఏచూరి మాట్లాడుతూ ఏపికి ప్రత్యేక హోదా ఇవ్వాల్సిందేనని డిమాండ్ చేశారు. హోదాతోనే రాష్ట్రానికి న్యాయం జరుగుతుందని ఆయన ఉద్ఘాటించారు. ఏపి విభజన బిల్లు పార్లమెంట్‌లో చర్చ జరిగిన సందర్భంగా తాను రాజ్యసభలో ఏపికి జరిగిన అన్యాయంపై లేవనెత్తానని ఏచూరి గుర్తు చేశారు. ఏపికి ప్రత్యేక హోదా ఇవ్వాలని అడిగితే, అందుకు అప్పటి ప్రధాని మన్మోహన్ సింగ్ ఐదేళ్ల పాటు ప్రత్యేక హోదా ఇస్తామని హామీనిచ్చినట్టు తెలిపారు. అయితే, అందుకు బదులుగా అప్పటి బిజెపి ఎంపి వెంకయ్య నాయుడు తమ ప్రభుత్వం రాబోతుందని, రాష్ట్రానికి పదేళ్లు పాటు హోదా ఇస్తామని వెల్లడించారని గుర్తు చేశారు. ఏపీ విభజన హామీలపై తాను కేంద్ర ఆర్థిక మంత్రి అరుణ్ జైట్లీతో చాలా సార్లు సంప్రదించానని, ఆయనెప్పుడూ అబద్ధాలే చెప్పారని విమర్శించారు.

పోరాటం ఆగదు...!

సీపీఐ, సీపీఎం రాష్ట్ర కార్యదర్శులు కె. రామకృష్ణ పి.మధు మాట్లాడుతూ రాష్ట్రంలో మోడీ సర్కార్‌కు వ్యతిరేకంగా నిరసన పోరాటం కొనసాగుతుందన్నారు. రైల్వే జోన్, స్టీల్‌ప్లాంట్, గిరిజన, సెంట్రల్ యూనివర్శిటీలు తదితర సమస్యలను గ్రామ స్థాయికి తీసుకెళ్తామన్నారు. . ప్రత్యేక హోదా సాధన సమితి నేత చలసాని శ్రీనివాస్ మాట్లాడుతూ ప్యాకేజీలు తమ రాష్ట్రానికి న్యాయం చేయవని, హోదానే ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఈ మేరకు తాము పోరాటం చేస్తామన్నారు. ఈ సమావేశంలో సీపీఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి ముప్పాళ్ల నాగేశ్వరావు, ఏఐఎస్ఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు సుబ్బారావు, ఏఐవైఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు నక్కి లెనిన్ బాబు, సీపీఎం కేంద్ర కమిటీ సభ్యురాలు పుణ్యవతి, సీఐటీయూ నేత ఆర్.లక్ష్మయ్య, ఆర్థిక విశ్లేషకులు పెంటపాటి పుల్లారావు, హోదా సాధన సమితి నాయకులు ప్రొఫెసర్ జార్జి విక్టర్, ప్రొఫెసర్ సదాశివ రెడ్డి, ప్రొఫెసర్ అప్పలనాయుడు, జీవీ సత్యన్నారాయణ రాజు, కర్ణాటక తెలుగు సంఘం నేత బందు రామస్వామి, డీవైఎఫ్ఐ రాష్ట్ర అధ్యక్ష, కార్యదర్శులు రామన్న, సూర్యరావు, ఎస్ఎఫ్ఐ నేతలు ప్రసన్న కుమార్, పవన్ కుమార్ పాల్గన్నారు.



ఉపాధినివ్వని వృద్ధి

(మొదటిపేజీ తరువాయి)

కల్పన రేటు ఏడాదికేడాదికి తరిగిపోతూనే ఉంది. 2016 తరువాత ఉపాధి కల్పన 5శాతం పెరుగుతుందని అంచనా వేశారు.

ఉత్తరాది రాష్ట్రాలలో ఉపాధి పెరుగుదల చాలా దారుణంగా ఉంది. ముఖ్యంగా ఉన్నతవిద్యను అభ్యసించిన యువతకు ఉద్యోగాల కల్పన గణనీయంగా పడిపోయింది. కొన్ని రంగాలలో ఆదాయాలు పెరిగినప్పటికీ, గ్రామీణప్రాంతాల్లో శ్రమజీవుల వేతనాల వృద్ధి 2014 తరువాత పూర్తిగా పడిపోయింది. అప్పటి నుంచి మళ్లీ కోలుకోలేదు. సంఘటిత రంగం ఉత్పత్తి విభాగంలో ఉద్యోగాలు పెరిగాయి. అయితే వీటిలో తక్కువ వేతనం, ఉద్యోగ భద్రతలేని కాంట్రాక్టు ఉద్యోగాలే ఎక్కువగా ఉన్నాయి. 2015 నాటికి కార్మికుల ఉత్పాదకత 30ఏళ్ల క్రితంనాటికంటే 6రెట్లు అధికంగా పెరిగింది. ఈ రంగంలో మేనేజర్లు, సూపర్‌వైజర్ల స్థాయి సిబ్బంది వేతనాలు మూడురెట్లు పెరగగా తక్కువ నైపుణ్యం, ఓ మాదిరి నైపుణ్యం కల కార్మికుల వేతనాలు దాదాపు ఒకటిన్నర రెట్లు మాత్రమే పెరిగాయి. వేతనాలు పొందుతున్న కార్మికులు, సిబ్బందిలో మహిళల శాతం ఇంకా చాలా తక్కువగానే ఉంది. మహిళల ఉపాధికి సంబంధించి రాష్ట్రానికి, రాష్ట్రానికి మధ్య చాలా తేడా ఉంది. ఉత్తరప్రదేశ్‌లో 100మంది పురుషులకు ఉపాధి ఉండగా, 20మంది మహిళలకు మాత్రమే ఉపాధి ఉంది. ఇదే తమిళనాడులో మహిళలకు ఉపాధి 50శాతం, మిజోరం, నాగాలాండ్‌లలో 70శాతం నమోదయ్యాయి. హిందీ రాష్ట్రాలలో దిగువకులాల కుటుంబాలలో ఆదాయం అత్యంత తక్కువగా ఉంది. స్త్రీ, పురుషుల మధ్య ఉన్న అంతరం కంటే కులాల మధ్య అంతరం ఎక్కువగా ఉంది. అతి తక్కువ వేతనాలు గల ఉద్యోగాలలో దళితులు, ఆదివాసీలు ఎక్కువగా ఉన్నారు. అగ్రవర్ణాలకు చెందిన వారు పొందే ఆదాయంలో వీరికి గొప్పగా అయితే 50-55శాతం మాత్రమే ఆదాయం లభిస్తుంది. కేంద్ర కార్మికమంత్రిత్వ, ఉపాధి శాఖ గణాంకాల ప్రకారం 2012లో నిరుద్యోగుల సంఖ్య దాదాపు 1.71కోట్లు ఉంది. 2016 నాటికి ఈ సంఖ్య 2.33కోట్లకు పెరిగింది. అంటే ఐదేళ్ల కాలంలో నిరుద్యోగుల సంఖ్య రెట్టింపు అయింది. 2014లో నిరుద్యోగం 3.8శాతం ఉండగా, 2016నాటికి అది 5శాతానికి పెరిగింది. నోట్లరద్దు కాలంలో తక్కువ వేతనాలు పొందే కార్మికులు, సిబ్బంది లక్షలాదిమంది ఉద్యోగాలు కోల్పోయారు. వీరి జీవనోపాధి కోసం అటు కేంద్రం, ఇటు ఉత్తరాది రాష్ట్రాలు ఎలాంటి చర్యలూ చేపట్టలేదు.

ప్రపంచబ్యాంకు నివేదిక

దక్షిణాసియాలో వృద్ధి, ఉపాధి కల్పనా స్థితిపై ప్రపంచబ్యాంకు 2018లో నివేదికను విడుదల చేసింది. ఇందులో ప్రత్యేకించి భారతదేశంలో ఉపాధికల్పనాస్థితిని వివరించింది. దేశంలో ఉపాధికల్పన రేటును స్థిరంగా పెంపొందించాలంటే ఏడాదికి 80 లక్షల మందికి ఉద్యోగాలు కల్పించాలి. ప్రపంచ ఆకలి సూచీలో భారతదేశస్థాయి 2016లో 97 ఉండగా, 2018నాటికి 108కి చేరింది. 119దేశాలలో ఈ రెండు అంశాలపై సర్వే జరిగింది. దేశంలోని అత్యధిక రాష్ట్రాలలో అటు ప్రభుత్వ, ఇటు ప్రైవేటురంగంలో ఉద్యోగాల కల్పన ఆశించిన మేరకు పెరగలేదు. అనుత్పాదక, ప్రజాకర్షణీయమైన పథకాల కోసం అధికంగా వ్యయం చేయడంతో 40శాతం ఉద్యోగపోస్టులను అసలు భర్తీ చేయలేదు. ప్రైవేటురంగంలోనూ ఉద్యోగాల కల్పన అత్యంత నిరాశాజనకంగా ఉంది. ప్రభుత్వ విధానాల కారణంగా ఆర్థికవృద్ధి మందగించిందని అసోచామ్ ఇటీవల ప్రకటించింది. 2014-16 మధ్య కాలంలో క్యాంపస్ ఎంపికలు 45శాతం తగ్గిపోయాయి. ఈ నేపథ్యంలో ముందుగా నిర్ణయించుకున్న భావజాలాన్ని వదిలిపెట్టి ప్రజాస్వామ్య సంక్షేమ రాజ్యాన్ని నిర్మించాలి. ప్రతి ఒక్కరూ భద్రమైన, గౌరవనీయమైన, సహేతుకమైన జీవనాన్ని కొనసాగించేందుకు ప్రభుత్వాలు చర్యలు తీసుకోవాలి.

(రచయితలు: హైదరాబాద్ జేఎన్‌యూలో ప్రొఫెసర్‌గా, ఉస్మానియా యూనివర్సిటీ ఆర్ట్స్ అండ్ సోషల్ సైన్సెస్ ఆర్థిక విభాగంలో అసిస్టెంట్ ప్రొఫెసర్‌గా పనిచేస్తున్నారు.)

నియాకు అప్పగింత

(మొదటిపేజీ తరువాయి)

జరిగిన ఈ ఘటన వెనుక భారీ కుట్ర దాగి ఉందని వైసీపీ అనుమానిస్తోంది. ఎయిర్‌పోర్ట్ భద్రతను పర్యవేక్షిస్తున్న కేంద్ర పారిశ్రామిక భద్రతాదళం (సీఐఎస్ఎఫ్) ఉన్నతాధికారులు కూడా ప్రాథమిక విచారణలో ఇదే నిర్ధారణకు వచ్చారు. కేంద్ర దర్యాప్తు సంస్థలతో నిష్పక్షపాతంగా విచారణ నిర్వహించాలని వైసీపీ న్యాయస్థానాన్ని కోరింది. డిసెంబర్ 31న ఈకేసును ఎన్ఐఏకి బదిలీ చేసినట్టు ఏపీ హైకోర్టుకు కేంద్రం తెలిపింది. హోం శాఖ ఆదేశాలతో హైదరాబాద్ ఎన్ఐఏ విభాగం ఐపీసీ సెక్షన్ 307 ప్రకారం నిందితుడు శ్రీనివాసరావుపై నమోదు చేసింది. ప్రధాన విచారణ అధికారిగా మహ్మద్ సాజిద్ ఖాన్‌ను నియమించారు.

మారణహోమం

(మొదటిపేజీ తరువాయి)

గంటల పాటు 144 సెక్షన్‌ను అమలు చేశారు.

కాంగ్రెస్ ఎంపీల ఆందోళన : కేరళలోని ఉద్రిక్త పరిస్థితులపై కాంగ్రెస్ ఎంపీ కేకే వేణుగోపాల్ శుక్రవారం లోక్‌సభలో ఆందోళన వ్యక్తంచేశారు. చేతికి నల్లబ్యాండు ధరించి సభకు వచ్చిన ఆయన జిరో అవర్‌లో మాట్లాడుతూ బీజేపీ బంద్ హింసాత్మకమైందని, రాష్ట్రంలో శాంతిని నెలకొల్పేలా తగిన చర్యలు తీసుకోవాలన్నారు. శబరిమల వ్యవహారంలో రాష్ట్ర ప్రభుత్వం వ్యవహరిస్తున్న తీరును సీపీఐ ఎంపీ పి.కరుణాకరన్ ప్రశంసించారు. ఆలయాలను సందర్శించుకునే హక్కును దేశంలోని ప్రతి ఒక్కరికి భారత రాజ్యాంగం కల్పించిందని తెలిపారు. శబరిమల ఆలయంలోకి మహిళలు ప్రవేశించేలా సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పును బీజేపీ ఎంపీలు కొందరు స్వాగతించారని చెప్పారు. దీనిపై బీజేపీ ఎంపీ మీనాక్షి లేఖి ఘాటుగా స్పందించారు. 'హిందూయిజం అంటే ఏమిటో తెలియని వారు తప్పుడు వర్ణణ చేస్తున్నారు. వీరు అయ్యప్ప భక్తులు కాదు.. మతవ్యతిరేకులు' అని ఆరోపించారు.

కార్మిక హక్కులకు పాతర

సార్వత్రిక సమ్మెకు సీపీఐ మద్దతు : సురవరం



విశాలాంధ్ర బ్యూరో-హైదరాబాద్ : కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కార్మిక హక్కులను కాలరాస్తున్నాయని సీపీఐ ప్రధాన కార్యదర్శి సురవరం సుధాకరరెడ్డి విమర్శించారు. కార్మిక వ్యతిరేక విధానాలను ప్రతిఘటించాలని పిలుపు నిచ్చారు. జాతీయ కార్మిక సంఘాలు ఈ నెల 8, 9 తేదీల్లో నిర్వహిస్తున్న సార్వత్రిక సమ్మెకు సీపీఐ సంపూర్ణ మద్ధతు ఇస్తుందని తెలిపారు. ప్రజలు, విద్యార్థులు, యువజనులు, మహిళలు, రైతులు, వ్యవసాయ కార్మికులు సకల వర్గాలు సమ్మెలో పాల్గొని కార్మికవర్గానికి బాసటగా నిలవాలని కోరారు. సీపీఐ రాష్ట్ర కార్యాలయం మఖ్దూంభవన్‌లో శుక్రవారం జరిగిన విలేకరుల సమావేశంలో పార్టీ రాష్ట్ర కార్యదర్శి చాడ వెంకటరెడ్డి, కార్యదర్శివర్గ సభ్యులు ఎన్.బాలమల్లేష్‌తో కలిసి సురవరం విలేకరులతో మాట్లాడారు. ఆర్ఎస్ఎస్, సంఘ్‌పరివార్ శక్తుల దాడులపై ప్రధానమంత్రిగానీ, కేంద్ర ప్రభుత్వంగానీ స్పందించకపోవడం దారుణమని సురవరం వ్యాఖ్యానించారు. మత ఛాందసవాద శక్తులు, మనువాదుల దాడులకు వ్యతిరేకంగా కేరళలో మహిళలు నిర్వహించిన ఆందోళన చరిత్రాత్మకమని చెప్పారు. 1952లో నిర్వహించిన విముక్తి పోరాటానికి కేరళలో మహిళల మానవహారం ప్రతీకగా నిలుస్తుందని చెప్పారు. మనుధర్మం అమలుకు బీజేపీ, ఆర్ఎస్ఎస్ కుయుక్తులు, కుట్రలు పన్నుతున్నాయని, మహిళా హక్కులను కాలరాసేందుకు పూనుకుంటున్నాయన్నారు. ప్రధానిస్థాయిలో మోడీ పచ్చిఅబద్ధాలు మాట్లాడుతున్నారన్నారు. నాలుగున్నరేళ్ల కాలంలో ఒక్కసారీ ప్రెస్‌మీట్ నిర్వహించని మోడీకి ప్రజా సమస్యలు ఎలా తెలుస్తాయని ప్రశ్నించారు. మన్‌కి బాత్ పేరుతో ఆయన ప్రసంగిస్తున్నారే తప్ప ప్రజా సమస్యలను తెలుసుకోవడం లేదని ఆరోపించారు. కేసీఆర్ ఫెడరల్ ఫ్రంట్ గురించి తనకు తెలియదని ప్రధాని వ్యాఖ్యానించడం ఎవరిని నమ్మించడానికని సురవరం నిలదీశారు. ఫ్రంట్ గురించి తెలియదని చెప్పడం పెద్ద అబద్ధమన్నారు. నోట్ల రద్దు వల్ల 2 శాతం డబ్బులే బ్యాంకులకు వచ్చాయని, నల్లధనం తెల్లధనంగా మారిందని విమర్శించారు. చాడ వెంకటరెడ్డి మాట్లాడుతూ ముఖ్యమంత్రి కేసీఆర్ బీసీలకు అన్యాయం చేశారని ఆరోపించారు. రిజర్వేషన్లను 34 శాతం నుంచి 23 శాతానికి కుదించి బీసీలను అణగదొక్కేందుకు కుట్రలు చేశారన్నారు. బీసీల రిజర్వేషన్లు సరిచేయాలని ఆయన డిమాండు చేశారు.

హోదా అడిగితే లాఠీచార్జి చేస్తారా

ఆంధ్రప్రదేశ్‌కు ప్రత్యేక హోదా కోసం ఢిల్లీలో శాంతియుతంగా, ప్రజాస్వామ్యబద్ధంగా ఆందోళన నిర్వహించిన వామపక్ష, ఇతర నాయకులపై పోలీసులు అమానుషంగా లాఠీచార్జీ చేయడాన్ని సీపీఐ ప్రధాన కార్యదర్శి సురవరం సుధాకరరెడ్డి తీవ్రంగా గర్హించారు. మోడీ సర్కార్ తాత్సారం చేయకుండా ఆంధ్రప్రదేశ్‌కు ప్రత్యేక హోదా ఇవ్వాలని డిమాండు చేశారు. ప్రత్యేక హోదా, విభజన చట్టంలో పేర్కొన్న హామీలు అమలు చేయాలని డిమాండు చేస్తూ సీపీఐ, సీపీఎం, జనసేన, విద్యార్థి, యువజన సంఘాలు దేశ రాజధాని ఢిల్లీలోని జంతర్‌మంతర్ వద్ద ధర్నా చేశారు. పార్లమెంటు ముట్టడికి ప్రదర్శనగా వెళుతున్న వారిని పోలీసులు అడ్డుకొని అమానుషంగా లాఠీచార్జి చేశారు. ఈ చర్యను సురవరం తీవ్రంగా ఖండించారు. లాఠీచార్జి చేసిన పోలీసు అధికారులు, పోలీసులపై కేసు నమోదు చేసి కఠినంగా శిక్షించాలని డిమాండు చేశారు. ఇప్పటికైనా ప్రధాని నరేంద్ర మోడీ ఆంధ్రప్రదేశ్‌కు ప్రత్యేక హోదా ఇవ్వడంతో పాటు విభజన చట్టంలో పేర్కొన్న అన్ని అంశాలను అమలు చేయాలని సురవరం డిమాండు చేశారు.

ప్రతి ఇంటికీ స్మార్ట్‌ఫోన్

(మొదటిపేజీ తరువాయి)

రాష్ట్రంలోని నాలుగు అగ్ర నగరాల్లో కాకినాడను సుందర నగరంగా తీర్చిదిద్దుతామని హామీ ఇచ్చారు. విశాఖ రైల్వే జోన్‌కు కేంద్రం మోకాలడ్డుతోందన్నారు. పార్లమెంటులో న్యాయం చేయమని కోరితే ఎంపీలను సస్పెండ్ చేశారని, ఢిల్లీలో సీపీఐ, సీపీఎం నాయకులు ఆందోళన చేస్తే అరెస్టులు చేయడం అన్యాయమన్నారు. టీడీపీని దెబ్బకొట్టాలని బీజేపీ జగన్ జపం చేస్తోందని ఆక్షేపించారు. తెలంగాణాలో వినియోగించిన ఈవీఎంలను ఇక్కడికి పంపి నన్ను ఓడించాలని చూస్తున్నారని పేర్కొన్నారు. అంతకు ముందు మైనార్టీ, క్రైస్తవ, ఎస్సీ, బీసీ కార్పొరేషన్ల లబ్ధిదారులతో ఆయన మాట్లాడించారు. కార్యక్రమంలో ఉప ముఖ్యమంత్రి నిమ్మకాయల చినరాజప్ప, ఆర్థిక శాఖ మంత్రి యనమల రామకృష్ణుడు, శాసన మండలి డిప్యూటీ చైర్మన్ రెడ్డి సుబ్రహ్మణ్యం, నగర మేయర్ సుంకర పావని, నగర ఎమ్మెల్యే వనమాడి వెంకటేశ్వరరావు, రూరల్ ఎమ్మెల్యే పిల్లి అనంతలక్ష్మి, ఎమ్మెల్సీ చిక్కాల రామచంద్రరావు, డీసీసీబీ చైర్మన్ వరుపుల రాజా, నామన రాంబాబు, జిల్లా కలెక్టర్ కార్తికేయ మిశ్రా, రాష్ట్ర, జిల్లా స్థాయి ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

బీజేపీకి గుణపాఠం తప్పదు : సీఎం

విశాలాంధ్ర బ్యూరో- అమరావతి: కేంద్రం నిరంకుశ పోకడలకు పాల్పడుతోందని, గత రెండు రోజుల్లో 45 మంది ఎంపీలను సస్పెండ్ చేయడమే దీనికి నిదర్శనమని సీఎం చంద్రబాబు పేర్కొన్నారు. ఆయన శుక్రవారం టీడీపీ ఎంపీలతో టెలికాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈసందర్భంగా ప్రత్యేక హోదా, విభజన హామీల అమలు కోసం ఆందోళన చేస్తున్నవారిపై జరిగిన లాఠీచార్జీతోపాటు ఎంపీల సస్పెన్షన్‌ను తీవ్రంగా ఖండించారు. రెండు రోజుల్లో 45 మంది ఎంపీలను సస్పెండ్ చేయడమంటే ప్రజాస్వామ్యాన్ని అపహాస్యం చేయడం కాదా ? అని ప్రశ్నించారు. బీజేపీ నేతలకు ప్రజాస్వామ్యం పట్ల విశ్వాసం లేదని దుయ్యబట్టారు. దేశం మొత్తం బీజేపీకి రానున్న ఎన్నికల్లో గుణపాఠం చెప్పేందుకు సిద్ధంగా ఉందని హెచ్చరించారు. ఢిల్లీలో లాఠీఛార్జి బాధితులను ముఖ్యమంత్రి ఈసందర్భంగా ఫోన్లో పరామర్శించారు. రాష్ట్రానికి ఇంత తీవ్రంగా అన్యాయం చేస్తున్న బీజేపీతో కుమ్మక్కైన రాష్ట్ర ప్రతిపక్ష పార్టీలకు గుణపాఠం తప్పదని హెచ్చరించారు. అనంతరం జన్మభూమిపై అధికారులు, ప్రజాప్రతినిధులతో టెలికాన్ఫరెన్స్ నిర్వహించారు. వినూత్న ఆలోచనలు, నూతన ఆవిష్కరణలకు జన్మభూమి కేంద్రం కావాలని సీఎం ఆకాంక్షించారు. మీ ఊరికి ఏం కావాలి..? మీ వార్డులో ఇంకా ఏం చేయాలి..? అని గ్రామసభల్లో ప్రజలనుంచే అభిప్రాయ సేకరణ చేయాలని, దానికనుగుణంగా అభివృద్ధి ప్రణాళికలను ఖరారు చేయాలని ఆదేశించారు. జన్మభూమిపై ఓవరాల్ శాటిస్ ఫాక్షన్ 79శాతం ప్రజల్లో ఉందని తెలిపారు. పేదల సంక్షేమానికి పెద్దఎత్తున కృషి చేశాం. ఏయే వర్గాలకు ఎంతమేర సంక్షేమం చేశామో ప్రజలకు వివరించాలని సూచించారు. టెలికాన్ఫరెన్స్‌లో సీఎం ర్యాండమ్ సర్వే చేయించారు. జన్మభూమిలో ఆనందంగా పనిచేస్తున్నారా అని అధికారులను ప్రశ్నించగా, 98శాతం ఆనందంగా వున్నట్లు తెలిపారు. అదే సంతోషం, సంతృప్తి ప్రజల్లో కూడా రావాలన్న ముఖ్యమంత్రి అన్నారు.

'ఢిల్లీ' లాఠీచార్జి దారుణం : డొక్కా



విశాలాంధ్ర బ్యూరో-అమరావతి: ఢిల్లీలో ధర్నా చేస్తున్న ప్రజాసంఘాలు, స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులపై లాఠీచార్జి చేయడం దారుణమని టీడీపీ రాష్ట్ర అధికార ప్రతినిధి డొక్కా మాణిక్య వరప్రసాద్ ఆగ్రహం వ్యక్తం చేశారు. విజయవాడ టీడీపీ కార్యాలయంలో శుక్రవారం విలేకర్లతో మాట్లాడారు. మోడీ నియంతలా, నిర్బంధ విధానాలతో పాలన సాగిస్తూ రాజ్యాంగ వ్యవస్థలను కూలదోస్తున్నారని ధ్వజమెత్తారు. నిన్నటి వరకు కులాలు, మతాల మధ్య చిచ్చుపెట్టిన మోడీ ఇప్పుడు రాష్ట్రాల మధ్య చిచ్చుపెడుతున్నారని విమర్శించారు. రాష్ట్ర ప్రజల హక్కుల కోసం పోరాడు తున్న టీడీపీ ఎంపీలను సస్పెండ్ చేయడం హేయ మైన చర్యఅన్నారు. ముఖ్యమంత్రి చంద్రబాబు దావోస్ పర్యటనకు వెళ్లాలనుకుంటే దానిపై కూడా ఆంక్షలు విధించడం మోడీ దురహంకారంకు నిదర్శనమ న్నారు. సీఎంతోపాటు ఎంతమంది వెళ్లాలి, ఎప్పుడు వెళ్లాలి వంటివి నిర్ణయించే అధికారం మోడీకి ఎక్కడుందన్నారు. దావోస్‌లో ప్రపంచ వాణిజ్య సదస్సుకు అనేక దేశాల ప్రతినిధులు వెళుతుంటే సీఎంపై ఆంక్షలు పెట్టడం తగదన్నారు. భారతీ యులు ఏం తినాలో, ఎవరిని పూజించాలో వంటివి కూడా మోడీ నిర్ణయించే దుస్థితి నెలకొందన్నారు. రాష్ట్రంలో ప్రతిపక్ష పాత్రకు తిలోదకాలిచ్చిన వైసీపీ మోడీ అడుగుజాడల్లోనే నడుస్తున్నారని విమర్శించారు.

7నుంచి హైకోర్టుకు సెలవులు

విశాలాంధ్ర బ్యూరో- అమరావతి:
ఆంధ్రప్రదేశ్ హైకోర్టుకు జనవరి 7వ తేదీ నుంచి 18 వ తేదీ వరకు సంక్రాంతి సెలవులు ఇస్తున్నట్లు రిజిస్ట్రార్ జనరల్ మానవేంద్రనాధ్ రాయ్ తెలిపారు. సంక్రాంతి సెలవుల్లో డివిజన్ బెంచ్ జడ్జిలుగా జస్టిస్ ఏవీ శేషసాయి, జస్టిస్ ఎమ్. గంగా రావులు, సింగిల్ బెంచ్ జడ్జిగా జస్టిస్ ఎమ్. సత్యనారాయణ మూర్తి వ్యవహరిస్తారని తెలిపారు. సంక్రాంతి సెలవు రోజుల్లో డివిజన్ బెంచికి సంబంధించిన కోర్ట్ వ్యాజ్యాలను, ఫైలింగ్ ను జనవరి 9వ తేదీన, 11 వ తేదీన విచారణ చేపట్టుటకు పైన పేర్కొన్న న్యాయమూర్తులు హైకోర్టులో అందుబాటులో ఉంటారని తెలిపారు.

డీఎస్సీలో పీఈటీలకు ఫిజికల్ టెస్ట్

విశాలాంధ్ర బ్యూరో-అమరావతి: డీఎస్సీ-ఫిజికల్ ఎడ్యుకేషన్ టీచర్స్(పీఈటీ) పోస్టులకు హాజరయ్యే అభ్యర్థులకు శారీరక సామర్థ్య పరీక్షలు శుక్రవారం నుంచి ప్రారంభించారు. ఈ నెల 4వ తేదీ నుంచి 13వరకూ మొత్తంగా 13,847మందికి నిర్వహిస్తారు. పురుషులకు 11వరకు, మహిళ లకు 12, 13 ప్రతిరోజూ ఉదయం సెషన్‌లో 7గంటల నుంచి 8గంటల వరకు, మధ్యాహ్నం సెషన్‌లో 1.30 గంటల నుంచి 2.30గంటల వరకు శారీరక పరీక్షలను ఏర్పాటు చేస్తారు. పీఈటీ అభ్యర్థులకు సంబంధిత సబ్జెక్టు పరీక్షలతోపాటు శారీరక సామర్థ్య పరీక్షలను ఈ ఏడాది నుంచి కొత్తగా ప్రవేశ పెట్టారు. రాష్ట్రంలోని 13జిల్లాల వారీగా పరీక్షా కేంద్రాలను ఏర్పాటు చేశారు.

రైల్వేలో 13,487 పోస్టులు

విశాలాంధ్ర బ్యూరో - అమరావతి: రైల్వేలో 13,487 ఉద్యోగాల భర్తీకి సంబంధించి రైల్వేమంత్రిత్వశాఖ శుక్రవారం ప్రకటన చేసింది. జూనియర్ ఇంజనీర్లు (జేఈ), డిపో మెటీరియన్ సూపరింటెండెంట్ (డీఎంఎస్), కెమికల్ అండ్ మెటలర్జికల్ అసిస్టెంట్ (సీఎంఏ) పోస్టులు ఇందులో ఉన్నాయి. తొలిదశలో కంప్యూటర్ ఆధారిత పరీక్ష (సీబీటీ), రెండో దశలో అభ్యర్థన పత్రాల పరిశీలన ద్వారా జరిగే ఈ నియామకాలకు దరఖాస్తులు చేసుకోవ డానికి జనవరి 31 చివరి తేదీగా రైల్వేశాఖ పేర్కొంది. ఏడో వేతన సవరణ ప్రకారం పోస్టుల స్కేలు రూ. 35,400లు, లెవెల్-6కు రూ. 1,12,400లుగా నిర్ణయించినట్లు తెలిపింది. ఆర్ఆర్‌బీ వెబ్‌సైట్ ద్వారా ఈమేరకు నోటిఫికేషన్ జారీ చేసినట్లు దక్షిణ మధ్య రైల్వే ముఖ్య ప్రజా సంబంధాల అధికారి సి.హెచ్.రాకేష్ ప్రకటన విడుదల చేశారు. విద్యార్హతలు, వయోపరిమితి తదితర వివరాలకు ఆర్ఆర్‌బీ వెబ్‌సైట్‌ను సందర్శించాలని ఆయన కోరారు.

ద్రోహం చేసి..దబాయింపా..? : తులసిరెడ్డి

విశాలాంధ్ర బ్యూరో-అమరావతి: రాష్ట్ర విభజన చట్టం ఆధారంగా రాష్ట్రానికి ఇచ్చిన హామీలను కేంద్ర ప్రభుత్వం అమలు చేయకుండా, ద్రోహా నికి పాల్పడి పైపెచ్చు దబాయిస్తోందని పీసీసీ ఉపాధ్యక్షుడు డాక్టర్ ఎన్.తులసి రెడ్డి మండిపడ్డారు. శుక్రవారం ఆయన విజయవాడ ఆంధ్రరత్న భవన్‌లో విలేకరులతో మాట్లాడారు. కేంద్రం ప్రభుత్వం అధికారంలోకి వచ్చి నాలుగు సంవత్సరాల 8నెలలు పూర్తయిందన్నారు. బీజేపీ మోసగారితనం, టీడీపీ చేత గానితనం, వైసీపీ అవకాశవాదంతో కొన్ని అంశాలు అమలుకు నోచుకోలేదని పేర్కొన్నారు. రాయలసీమ, ఉత్తరాంధ్రకు ప్రత్యేక అభివృద్ధి ప్యాకేజీ కింద రూ.24,350కోట్లు విడుదల చేయాల్సి వుండగా, అందులో రూ.1050 కోట్లు(4శాతం) నిధులు విడుదల చేయడం దారుణమని దుయ్యబట్టారు. పోలవరం ప్రాజెక్టు పూర్తి చేసేందుకుగాను రూ.54వేల కోట్లకుగాను, కేవలం రూ.7వేలకోట్లనే కేంద్రం విడుదల చేసిందని వివరించారు. సవరించిన అంచనాలను, డిజైన్లను ఆమోదించలేదని తెలిపారు. .

భారతీయ జోకర్స్ పార్టీ బీజేపీ : లోకేష్

విశాలాంధ్ర బ్యూరో-అమరావతి: బీజేపీ భారతీయ జోకర్స్ పార్టీగా మారిందని మంత్రి నారా లోకేష్ ఎద్దేవా చేశారు. ఆంధ్రప్రదేశ్‌కు నీరు, మట్టి ఇచ్చి చేతులు దులుపుకొన్న ప్రధాని నరేంద్ర మోడీ ఇంటి ముందు ధర్నా చేసే దమ్మూ, ధైర్యం లేని ఏపీ బీజేపీ నేతలు సీఎం చంద్రబాబు కాన్వాయ్‌ను అడ్డుకొనేందుకు ప్రయత్నించడం సిగ్గుచేటన్నారు. ఆంధ్రప్రదేశ్‌లో బీజేపీని ప్రజలు మట్టిలో కలిపేసే రోజులు దగ్గర పడ్డాయని శుక్రవారం ట్విటర్‌లో పేర్కొన్నారు. ఆంధ్రా మోడీని కాపాడేందుకు ఢిల్లీ మోడీ సీబీఐని బీజేపీ బ్యూరో ఆఫ్ ఇన్వెస్టిగేషన్‌గా మార్చేశారని విమర్శించారు. ప్రజాధనాన్ని నిలువునా దోచుకున్న జగన్‌కు కేసుల నుంచి విముక్తి కల్పించి ఏపీని దెబ్బతీయాలని కేంద్ర ప్రభుత్వం మరో కుట్రకు తెరలేపిందని మండిపడ్డారు. ఉత్తమ ప్రతిభ కనబర్చిన రాష్ట్రాలకు ఉపాధి హామీ పథకం ద్వారా అధిక నిధులు రావడం చట్టం ద్వారా వచ్చిన హక్కు అన్నారు. ఇందులో చంద్రబాబు కష్టం తప్ప బీజేపీ భిక్ష ఏమీ లేదన్నారు. ఉపాధి హామీలో ఎక్కువ నిధులు కేటాయించామని అర్థం పర్థంలేని చర్చలు చేస్తున్న రాష్ట్ర బీజేపీ నేతలు ఆ పార్టీ అధికారంలో ఉన్న రాష్ట్రాలు ఉపాధి హామీ పథకంలో ఎందుకు వెనుకబడి ఉన్నాయో చెప్పగలరా? అని ప్రశ్నించారు.

జగన్ డిశ్చార్జ్ పిటిషన్లపై
విచారణ మొదటికి...



విశాలాంధ్ర బ్యూరో-హైదరాబాద్: ఆస్తుల కేసులో వైఎస్ జగన్ దాఖలు చేసిన డిశ్చార్జ్ పిటిషన్లపై సీబీఐ కోర్టు మళ్లీ విచారణ చేపట్టనుంది. రెండున్నరేళ్లుగా వీటిపై విచారణ కొనసాగుతుండగా న్యాయమూర్తి బదిలీతో వాదనలు మళ్లీ మొదటి కొచ్చాయి. సీబీఐ, ఈడీ కోర్టులో జగన్ ఆస్తుల కేసు శుక్రవారం విచారణకు రాగా, తదుపరి విచారణ ఈ నెల 25కి వాయిదా పడింది. జగన్ ఆస్తుల కేసులో మొత్తం 11 అభియోగపత్రాలను సీబీఐ నమోదు చేసింది. విచారణ ప్రక్రియలో భాగంగా నిందితు లుగా ఉన్న జగన్మోహన్‌రెడ్డి, విజయసాయిరెడ్డి, ఇతర నిందితులు డిశ్చార్జ్ పిటిషన్లు దాఖలు చేశారు. నేరానికి ఎలాంటి సంబంధం లేకుండానే తమపై అక్రమంగా కేసులు బనాయించారని, అందువల్ల ఎఫ్ఐఆర్, ఛార్జిషీట్ల నుంచి తమను తప్పించాలని పిటిషన్లు వేశారు. వీటిపై కొంతకాలంగా వాదనలు కొనసాగుతున్నాయి. మొత్తం 11 కేసులకుగాను 4 కేసుల్లో వాదనలు పూర్తయ్యాయి. రెండున్నరేళ్లుగా ఇది కొనసాగు తోంది. ఈ నేపథ్యంలో సీబీఐ కోర్టు న్యాయమూర్తి వెంకట రమణను ఆంధ్రప్రదేశ్‌కు కేటాయించడంతో అక్కడికి బదిలీ అయ్యారు. జడ్జి వెంకటరమణ రెండేళ్ల పాటు మూడు ఛార్జిషీట్లపై 100 గంటల పాటు వాదప్రతివాదనలు విన్నారు. కొత్తగా వచ్చే న్యాయమూర్తి డిశ్చార్జ్ పిటిషన్లపై మళ్లీ వాదనలు వినాల్సి ఉంటుంది. ఒక్కో ఛార్జిషీట్లో తీర్పు వెల్లడించి నట్లయితే ఇతర కేసులపై ప్రభావం పడుతుందని భావించి, అన్ని కేసుల్లో ఒకేసారి తీర్పు ఇవ్వాలని గతంలో సీబీఐ కోర్టు నిర్ణయించింది. ఈ నేపథ్యంలో డిశ్చార్జ్ పిటిషన్లపై మళ్లీ వాదనలు జరగనున్నాయి. అందుకు మరికొన్నేళ్లు పట్టే అవకాశం ఉన్నట్లు తెలుస్తోంది. జనవరి 7 నుంచి సంక్రాంతి సెలవులు కావడంతో తర్వాత వాదనలు ప్రారంభమవుతాయి.

దురంతో.. మేలెంతో!

- ఏపీలో నాన్‌స్టాప్ రైళ్లకు కొత్త స్టాపేజీలు
- రాజధాని విజయవాడలో మూడు రైళ్ల నిలుపుదల
- దూర ప్రాంత ప్రయాణాలకు ఉపయుక్తం



విశాలాంధ్ర బ్యూరో - అమరావతి:
రైల్వేశాఖ దురంతో వంటి సూపర్‌ఫాస్ట్ రైళ్లను మార్గ మధ్యలోని పలు స్టేషన్లలో నిలుపుదల చేస్తూ తీసుకున్న నిర్ణయం ప్రయాణికులకు ఎంతో ఉపయుక్తంగా ఉంటోంది. ఆంధ్రప్రదేశ్‌లో ఈ ఆర్థిక సంవత్సరం కొత్త రైళ్లను ప్రవేశపెట్టడమే కాకుండా పలు రైళ్లను పొడిగించింది. అలాగే మరికొన్ని రైళ్లకు కొత్త స్టాపేజీలు కేటాయిం చింది. ప్రధానంగా రైళ్ల పొడిగింపు, కొత్త స్టాపేజీలపై ప్రయాణికులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. ఆధ్యాత్మిక యాత్రలు చేసేవారు సైతం మధ్యలో మరో రైలు మారేందుకు అవకాశం లేకుండా నేరుగా ప్రయా ణించే సదుపాయం కలిగిందని రైల్వేశాఖను అభినంది స్తున్నారు. నాన్‌స్టాప్ రైళ్లుగా 2009 సంవత్సరంలో ప్రారంభమైన 'దురంతో' సూపర్‌ఫాస్ట్ రైళ్లు ప్రస్తుతం దేశవ్యాప్తంగా 26 జతలు నడుస్తున్నాయి. ఎంతో ప్రాధాన్యం కలిగిన ఈ రైళ్లకు కొత్త స్టాపేజీలను కలుగచేసింది. నెంబరు 22204/22203 సికింద్ర బాద్ - విశాఖపట్నం - సికింద్రాబాద్ దురంతో ఎక్స్ ప్రెస్‌ను నవ్యాంధ్ర రాజధాని విజయవాడలో నిలుపు దల చేస్తున్నారు. నెంబరు 12269/12270 చెన్నై - హజరత్ నిజాముద్దీన్ - చెన్నై దురంతో ఎక్స్‌ప్రెస్‌కు విజయవాడలో, నెంబరు 12214/12213 ఢిల్లీ సరై రోహిల్లా - యశ్వంతపూర్- ఢిల్లీ సరై రోహిల్లా దురంతో ఎక్స్‌ప్రెస్‌కు గుంతకల్‌లో, నెంబరు 12245/12246 హౌరా - యశ్వంతపూర్ - హౌరా దురంతో ఎక్స్‌ప్రెస్‌ను రేణిగుంట, విజయవాడ, విజ యనగరం జంక్షన్లలో ఆపుతున్నారు. దీంతో ఆయా ప్రాంతాల నుంచి న్యూఢిల్లీ, హౌరా, చెన్నై, బెంగళూరు వంటి దూర ప్రాంతాలకు మరిన్ని రైళ్లు అందు బాటులోకి వచ్చినట్లయింది. నాన్‌స్టాప్ రైళ్లుగా నడిచే దురంతో సూపర్‌ఫాస్ట్ రైళ్లలో బయలుదేరే స్టేషన్ నుంచి గమ్యం వరకూ మార్గ మధ్యలో నిర్వహణ పరమైన స్టాపేజీలు తప్ప టికెట్ల జారీ లేకపోవడంతో ప్రయాణికులు ఎక్కడం, దిగడానికి అవకాశం లేదు. కొన్ని సందర్భాల్లో అనేక రైళ్లలో బెర్తులు ఖాళీగా ఉండడంతో మార్గ మధ్యలోని ప్రధాన స్టేషన్లలో కూడా ఈ రైళ్లను నిలుపుదల చేయాలని రైల్వేశాఖ నిర్ణయించింది. నవ్యాంధ్ర రాజధాని విజయవాడలో మూడు దురంతో సూపర్‌ఫాస్ట్ ఎక్స్‌ప్రెస్‌లు ఆగుతు న్నాయి. కోరమండల్ సూపర్‌ఫాస్ట్ ఎక్స్‌ప్రెస్‌కు ఏలూ రులో, విజయవాడ-ధర్మవరం ఎక్స్‌ప్రెస్‌కు కోయిల కుంట్ల, లింగంపల్లి-విజయవాడ ఇంటర్‌సిటీ ఎక్స్ ప్రెస్‌కు మంగళగిరి కొత్తగా స్టాపేజీలు కల్పించడం పట్ల సర్వత్రా హర్షాతిరేకం వ్యక్తమవుతోంది.

రాయలసీమతోనూ అనుసంధానం

రాజధాని అమరావతిని రాయలసీమకు అనుసంధానం చేస్తూ పలు రైళ్లను దక్షిణ మధ్య రైల్వే చర్యలు చేపట్టింది. రాయచూర్, కర్నూలు ప్రాంతా లను విజయవాడతో కలుపుతూ కాకినాడ- రాయ చూర్ ట్రైవీక్లీ ఎక్స్‌ప్రెస్, కాకినాడ- కర్నూలు టౌన్ ట్రై వీక్లీ ఎక్స్‌ప్రెస్‌లను ప్రారంభించింది. ఇప్పటికే మచిలీ పట్నం-యశ్వంతపూర్ ట్రైవీక్లీ కొండవీడు ఎక్స్‌ప్రెస్, విజయవాడ-ధర్మవరం మధ్య ట్రైవీక్లీ సూపర్‌ఫాస్ట్ రైలు రాయలసీమ మీదుగా నడుస్తున్న విషయం తెలి సిందే. మచిలీపట్నం/ నరసాపూర్- తిరుపతి మధ్య నడిచే లింక్ ఎక్స్‌ప్రెస్‌ను ధర్మవరం వరకూ పొడిగిం చారు. విజయవాడ, తెనాలి, ఒంగోలు, నెల్లూరు, గూ డూరు, తిరుపతికి చెందిన వారు నేరుగా ధర్మవరం వెళ్లేందుకు అవకాశం కలిగినట్లు అధికారులు చెబు తున్నారు. ఆధ్యాత్మికంగా తిరుపతి వెంకన్నను దర్శిం చుకున్న వారు నేరుగా జమ్మూ సమీపంలోని కాట్రాలో కొలువైయున్న శ్రీవైష్ణోదేవిని దర్శిం చుకునేందుకు నేరుగా తిరుపతి-కాట్రా మధ్య హమ్‌సఫర్ ఎక్స్‌ప్రెస్‌ను ఏర్పాటు చేసినట్లు తెలిపారు.

సంపాదకీయం

ఎవరికీ పట్టని కూలీల ప్రాణాలు!

మేఘాలయ తూర్పు జాంతియా కొండల్లో బొగ్గుగని ప్రమాదం మన ప్రభుత్వాల అసమర్థతకూ, పేరుకుపోయిన అవినీతికీ, విధాన రాహిత్యానికి అద్దం పడుతోంది. అక్రమంగా తవ్వుతున్న బొగ్గుగని బొయ్యారంలో ఇరవైరోజులకు పైగా దాదాపు పదిహేనుమంది పేదకూలీలు చిక్కుకుపోయారు. ఆ అక్రమగనిలో ప్రమాదం సంభవించే సమయానికి ఎందరున్నారో, వారిలో ఎందరు ప్రాణాలు కాపాడుకున్నారో ఎవరికీ తెలియదు. గని నిర్వాహకుడు చెబుతున్న ప్రకారం 90మంది సురక్షితంగా బయటపడ్డారు. 15మంది చిక్కుకు పోయారు. ఇన్నిరోజులుగా వారిని కాపాడేందుకు ప్రయత్నాలు సాగుతున్నాయి. ఈ ఘటనపై దాఖలైన పిల్‌ను విచారణకు స్వీకరించిన సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి రంజన్ గొగోయ్ కేంద్రప్రభుత్వ నిర్లక్ష్యంపై తీవ్ర ఆగ్రహం వ్యక్తంచేశారు. చావుబతుకుల ప్రశ్నగా ఉన్న ఈ తీవ్రమైన సమస్య పరిష్కారంలో సైన్యాన్ని ఎందుకు వినియోగించలేదని కేంద్రాన్ని నిలదీసింది. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు తక్షణమే బాధితులను కాపాడే అన్నిరకాల చర్యలు చేపట్టాలని ఆదేశించింది. జాతీయ విపత్తు ప్రతిస్పందన బృందం చేసిన ప్రయత్నాలు ఫలించకపోవడంతో నావికాదళం కూడా రంగంలోకి దిగింది. కానీ వారి వద్ద వారిని కాపాడేందుకు కావాల్సిన పరికరాలు లేవు. కూలీలు దాదాపు 70 అడుగుల లోతులో ఉన్నారు. మరోవైపు గని సమీపంలో ప్రవహించే లీతీన్ నది ఉప్పొంగి ఆ నీరంతా గనిలోకి చేరిందని చెబుతున్నారు. ఆ నీటిని తోడివేయడానికి శక్తిమంతమైన పంపులు ఇప్పుడిప్పుడే అమరుస్తున్నారు. అసలు ఆ గనిలో చిక్కుకుపోయిన వారెందరు? వారిలో పిల్లలున్నారా? అనే ప్రశ్న కూడా తలెత్తుతోంది. ఇది అక్రమ గని కాబట్టి సరైన రికార్డుల్లేవు. ఈ సన్నని ఇరుకైన ర్యాట్ హెూల్ గని తవ్వకాలకు పిల్లలనే వాడతారన్న అనుమానాలున్నాయి. ఇంతమంది గని కార్మికులు ఇన్ని రోజుల(డిసెంబరు 13న ఘటన జరిగింది)పాటు చిక్కుబడిపోయిన దుర్ఘటన జాతీయస్థాయిలో పెద్ద వార్త కాకపోవడమే ఆశ్చర్యం. అసలు వీరంతా ప్రాణాలతో ఉన్నారా లేరా అనేదీ అనుమానమే. గత ఏడాది జూలైలో థాయ్‌లాండ్‌లోని ఒక గుహలో 12మంది పిల్లలు, వారి కోచ్ చిక్కుకుపోయినప్పుడు మన నిపుణులు వారికి సూచనలిచ్చారు. నీరు తోడడానికి అవసరమైన పంపులను, సామగ్రిని పంపారు. రెండు వారాల తర్వాత ఆ పిల్లలను క్షేమంగా బయటకు తీసుకువచ్చారు. థాయ్‌లాండ్ మనకు ధన్యవాదాలు తెలిపింది. ఇది అంతర్జాతీయ వార్తగా మారింది. ఇప్పుడు ఆ నిపుణులంతా ఏమయ్యారు? సహాయక చర్యలకు అవసరమైన సామగ్రిలేదంటుంటే వీరేం చేస్తున్నారు. దుర్ఘటన జరిగి పక్షం రోజులు దాటిన తర్వాత కిర్లోస్కర్ పంపులను పంపారు. ఈ పని మొదటి 24గంటల్లో ఎందుకు చేయలేదు? థాయ్‌లాండ్ అడిగిన వెంటనే పంపగలిగి నప్పుడు, మేఘాలయకు ఎందుకు ఆలస్యమైంది? ప్రతి దానికి ఒక వెల ఉంటుందనీ, దాని ముందు మానవత్వానికి విలువ ఉండదని రుజువైంది. ప్రత్యక్షంగా కాకపోతే, ప్రచారం వల్ల కలిగే వ్యాపార ప్రయోజనాలు అక్కడ పనిచేశాయి. మేఘాలయ నిరుపేద కూలీల కోసం తక్షణమే స్పందించడం వల్ల ఎటువంటి ప్రయోజనం కనిపించడం లేదు కాబట్టే ఈ నిరాసక్తత ప్రదర్శించారనేది స్పష్టమవుతోంది. గనిలో కార్మికులు చిక్కుకుపోయి చావుబతుకుల్లో ఉంటే వారిని ఎలా రక్షించాలన్న చర్చ కన్నా మేఘాలయలో అక్రమ గనులను నిషేధించడం ఎలా అనే చర్చ సభలో చోటుచేసుకుంది. ఇదీ అవసరమే కానీ సమస్య కన్నా ప్రాణాలను కాపాడడం ముఖ్యమైనది కదా?

మేఘాలయలో 64కోట్ల టన్నుల బొగ్గు నిక్షేపాల పరిమాణం ఉందని చెబుతారు. జాతీయ బొగ్గు ఉత్పత్తిలో ఆ రాష్ట్రం వాటా పదిశాతం. ఆ రాష్ట్ర ప్రధాన ఆదాయ వనరు కూడా అదే. ఇక్కడ బొగ్గు వెలికితీత అశాస్త్రీయ రీతిలో జరుగుతున్నది. దాదాపు 70వేల మంది బాలలు ఈ గనుల్లో పనిచేస్తున్నారని ఒక స్వచ్ఛంద సంస్థ ఆరోపించింది. ఈ తవ్వకాల వల్ల పర్యావరణం దెబ్బతింటున్నది. తాగు నీరు కలుషితమవుతున్నది. కాబట్టి శాస్త్రీయ పద్ధతిలో మైనింగ్ ప్రక్రియ జరిగే వరకూ తవ్వకాలను నిలిపివేయాలనీ జాతీయ హరిత ట్రిబ్యునల్(ఎన్‌జీటీ)లో ఒక సంస్థ పిటిషన్ వేసింది. దీంతో హరిత న్యాయస్థానం 2014ఏప్రిల్‌లో గనుల తవ్వకంపై నిషేధం విధించింది. అయినా యథావిధిగా తవ్వకాలు సాగుతూనే ఉన్నాయి. ఇవి కూడా ప్రమాదకరరీతిలో సాగుతున్నాయి. కొండపాదం వద్ద అడ్డంగా బొయ్యారాలు తవ్వుతారు. బొగ్గు లభించిన చోట పక్కలకు సొరంగాలు తవ్వుతూ బొగ్గును బయటకు తెస్తారు. ఈ బొయ్యారాలు చాలా సన్నగా ఉంటాయి. మనిషి వెళ్లడానికి కూడా కష్టమే. అందుకే చిన్న పిల్లలను ఉపయోగిస్తున్నారు. ఈ కలుగులన్నీ నదీ తీరానికి సమీపంలో ఉండడం వల్ల వరదలొచ్చినప్పుడు వాటిలోకి నీరు చేరి ప్రమాదాలకు కారణమవు తున్నది. 2007-14మధ్య వీటిలో దాదాపు 15వేల మంది మరణించి ఉంటారని ఇంపల్స్ అనే స్వచ్ఛంధ సంస్థ విడుదల చేసిన గణాంకాలు వెల్లడించాయి. ఎన్‌జీటీ నిషేధ ఉత్తర్వుల వల్ల తమకు నష్టం జరుగుతున్నదనీ, వాటిని వెనక్కి తీసుకోవాలని మైనింగ్ యజమానులు డిమాండుచేశారు. ఈ నిషేధం ఎత్తివేయలేకపోయిన కారణంగానే గత ఫిబ్రవరిలో జరిగిన ఎన్నికల్లో కాంగ్రెస్ ఓటమి పాలైందనే ప్రచారం ఉంది. తాము అధికారంలోకి వస్తే ఎనిమిది నెలల్లో పరిష్కరిస్తామని బీజేపీ ఎన్నికల మేనిఫెస్టోలో హామీ ఇచ్చింది. గత శాసనసభ ఎన్నికల్లో పోటీచేసినవారిలో 30శాతం మంది గనుల యజమానులే ఉన్నారు. ప్రస్తుతం అధికారంలో ఉన్న ఎన్‌పీపీ-బీజేపీ కూటమి కూడా అక్రమ గనులను చూసీచూడనట్లు వ్యవహరిస్తోంది. ఈ అక్రమ మైనింగ్ వల్ల అనేక సంఘవ్యతిరేక కార్యకలాపాలు సాగుతున్నాయి. మైనింగ్ మాఫియాకు అన్ని రాజకీయ పార్టీల మద్దతు కొనసాగుతోంది. దీంతో ఆ వైపు కన్నెత్తి చూడడానికి అధికారులు భయపడుతున్నారు. చట్టవిరుద్ధంగా 32 లారీల్లో బొగ్గు తరలింపును అడ్డుకున్న ఎస్‌ఐ మర్బనియాంగ్‌ను 2015లో మాఫియా అతి దారుణంగా కొట్టి చంపింది. ఆ కేసు ఈనాటికీ అతీగతీ లేదు. కాబట్టి దుర్మార్గంలో పార్టీలూ, ప్రభుత్వాలూ భాగస్వాములే. అక్రమ మైనింగ్‌ను అరికట్టలేకపోవడమే కాదు, గనిలో చిక్కుకుపోయిన వారి ప్రాణాలు కాపాడేందుకు కూడా ప్రభుత్వాలు సకాలంలో స్పందించకపోవడం క్షమార్హం కాదు. ఇప్పటికైనా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కలిసి అక్రమ మైనింగ్‌పై ఉక్కుపాదం మోపాలి. మృత్యుకుహరాలను శాశ్వతంగా మూసివేసేందుకు కఠిన చర్యలు తీసుకోవాలి.

చురక

ప్రత్యేక హోదా కొరకు
ప్రతిధ్వనించే ఆంధ్ర గళం
అణచివేసే ఢిల్లీలో
అధికారపు రాజ్య దళం

హామీల అమలు అడిగే
ఆందోళనపైన లాఠి
ప్రజాస్వామ్య హక్కులను
ప్రభుత్వం చేసే లూటీ

- వేల్పుల నారాయణ

'ప్రత్యేక హోదా వీరులెవరో ఇప్పుడు చెప్పండి బాబు ?


వి. శంకరయ్య

ప్రధాని మోడీ నిరంకుశ దురహంకార వైఖరికి వ్యతిరేకంగా ప్రత్యేక హోదా సాధనకుఢిల్లీ వీధుల్లో నిరసన ప్రదర్శన చేసి పోలీసు లాఠీ దెబ్బలు తిని రక్తసిక్తంగా ఆసుపత్రి పాలైన నేతలు ప్రత్యేక హెూదా సాధన వీరులా? లేక ఏసిలు, ఎయిర్ కూలర్ లు పెట్టుకొని ధర్మ పోరాట దీక్ష సభలు నిర్వహించే వారు ప్రత్యేక హోదా వీరులా? ముఖ్యమంత్రి సమాధానం చెప్పాలి.

దేశ రాజధాని ఢిల్లీ వీధుల్లో ప్రత్యేక హోదా సాధనకు ఉపక్రమించిన ఉద్యమకారులు గాయ పడితే కనీసం ముఖ్యమంత్రి చంద్రబాబు ఖండన ప్రకటన జారీచేసి తెరదించారు. అంతే కాదు గతంలో కూడా ముఖ్యమంత్రి ప్రధాని మోడీని భుజాన మోసిన రోజుల్లో కూడా ప్రత్యేక హోదా సాధనకు రాష్ట్రంలో వామ పక్ష ప్రజా తంత్ర శక్తులు, హోదా సాధన నేతలు నిరసన ప్రదర్శనలు చేసి రాష్ట్ర ప్రభుత్వ పోలీసు దమన కాండను ఎదుర్కొని లాఠీ దెబ్బలు తిన్న రోజులు కూడా ఉన్నాయి. ఆ రోజు ముఖ్యమంత్రి ఉసిగొల్పిన పోలీసు లాఠీలు ఈ రోజు ప్రధాని మోడీ ప్రయోగించిన పోలీసు లాఠీలు రెండూ ఒక కోవకు చెందినవే. ప్రత్యేకహోదా ఉద్యమ కారులపై టీడీపీ ప్రభుత్వం బనాయించిన కేసులు ఇంకా సజీవంగానే వున్నాయి. ఇప్పుడు తేల్చుకొందాం. నిజమైన హోదా వీరులెవరో? యుద్ధంలో పోరాడే వారిని వీరులంటారని మహాకవి శ్రీశ్రీ మాత్రం రైతులను కూడా కర్షక వీరులారా అని సంభోదించినట్లు ఈ మధ్య ఎక్కడో చదివాను. కానీ నేడు ప్రధాని మోడీకి వ్యతిరేకంగా ఢిల్లీ వీధుల్లో సాగుతున్న ఈ మహా పోరాటంలోనూ, ఒకనాడు తెలుగు దేశం ప్రభుత్వ దమన కాండలోనూ లాఠీ దెబ్బలు తిన్న వారంతా కూడా నిజమైన హోదా వీరులుగా చరిత్ర పుటల్లో మిగిలిపోనున్నారు. ఒక్కో జిల్లాలో ఐదారు కోట్లు ఖర్చు చేసి ముఖ్యమంత్రి ధర్మ పోరాట కపట దీక్షలు సాగిస్తున్నారు తప్ప కేంద్రంలోని బిజెపి ప్రభుత్వాన్ని ప్రధాని మోడీని సూత్రబద్ధంగా వ్యతిరేకించడం లేదు. ముఖ్యమంత్రి దృష్టిలో ప్రధాని మోడీని వ్యతిరేకించడమంటే కాంగ్రెస్ తో జట్టు కట్టడమే.

భారత దేశంలోనే కాదు. ప్రపంచంలో ఎక్కడైనా సరే ప్రధాని మోడీ లాంటి నేతల మెడలు వంచాలంటే క్షేత్ర స్థాయిలో ఊపిరి పోసుకొని ప్రజలను వీధుల్లోనికి తీసుకువచ్చి తుదకు విజయమో, అపజయమో సాధించాలి - కానీ నేడు ఏపిలో ముఖ్యమంత్రి నిర్వహిస్తున్న ధర్మ పోరాట దీక్షల సభలు లాంటివి నిర్వహించి మాత్రం కాదు. ఇవన్నీ ప్రచారార్భాటాలు తప్ప వేరు కాదు. ప్రజాభిప్రాయం ప్రతిబింబించదు. ముఖ్యమంత్రి తరచూ వల్లించే కుట్ర రాజకీయాలు అంతిమంగా ఏపి ప్రజలకు చెంది వంచనకే పాల్పడుతున్నారు. వాస్తవంలో ముఖ్యమంత్రికి ప్రధాని మోడీ మెడలు వంచడం కాదు కావల్సింది. గత నాలుగేళ్ళుగా ప్రధాని మోడీతో కలిసి కాపురం చేసి అంటించు కొన్న విద్రోహపు బురదను కడుగుకొనేందుకు ఇన్ని తంటాలు పడుతున్నారు. ముఖ్యమంత్రి ప్రసంగాలు వింటుంటే విస్తు పోవల్సి వస్తోంది.ప్రధాని మోడీని నమ్మి మోసపోయానని ఒకవైపు చెబుతూ మరో వైపు ప్రధాని మోడీ తన కన్నా జూనియర్ అని వ్యాఖ్యానించడంపై ఏపీ ప్రజలు నవ్వుకొంటు న్నారనే సమాచారం పార్టీ నేతలు కాకున్నా ఇంటెలిజెన్స్ అధికారులైనా ముఖ్యమంత్రికి చేరవేస్తున్నారో లేదో? ప్రధాని మోడీ కన్నా తను సీనియర్ రాజకీయవేత్తగా వుండి నాలుగేళ్ళకు గానీ కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వ దుర్బుద్ధి తెలుసుకోలేక పోయారంటే నలభై యేళ్ళ రాజకీయ సీనియారిటీ ఏమైనట్లు? అంతే కాదు కేంద్రంలో బీజేపీ ప్రభుత్వం ఏర్పడినప్పటి నుండి కూడా రాష్ట్రంలోని వామపక్ష ప్రజా తంత్ర శక్తులు, ప్రత్యేకహోదా సాధన నేతలు ప్రధాని మోడీ వద్దకు అఖిల పక్షాన్ని తీసుకెళ్ళి తాడో పేడో తేల్చుకొందామని పలుమార్లు ముఖ్యమంత్రిని కోరారు. ఏనాడు ఆ దిశగా ముఖ్యమంత్రి ఆలోచించలేదు. ముఖ్యమంత్రి ఈ ప్రయత్నం చేసి వుంటే రాష్ట్రంలోని వివిధ రాజకీయ పార్టీల నిజాయితి ఏమిటో ఆనాడే తేలిపోయి వుండేది. ఆ సమయంలోనే రాష్ట్రంలోని అన్ని రాజకీయ పార్టీలు, ప్రజలు ప్రత్యేక హోదా కోరుతున్నారనే సందేశం ప్రధాని మోడీకి చేరి వుండేది. కానీ ముఖ్యమంత్రి ఆలోచనలు వేరు. ప్రధాని మోడీ కి కోపం రాకూడదు. ఏపీ ప్రజల ప్రయోజనాలకన్నా తన పార్టీ తన వ్యక్తిగత రాజకీయ ప్రయోజనాలు సాధించుకొనేందుకు ప్రధానిని ప్రసన్నం చేసుకొనేందుకే నాలుగేళ్ళ కాలం గడిపేశారు. తుదకు అంతా భ్రాంతిగా మిగిలి పోగా ప్రస్తుతం ఎంతో అమాయకంగా ప్రధాని మోడీని నమ్మి మోసపోయానని చెబుతున్నారు. కానీ ఏపీ ప్రజలు ముఖ్యమంత్రిని విశ్వసించే స్థితిలో లేరు. అందుకే ఓటమి భయం పట్టుకొని తనను దూషించిన వారితో కూడా స్నేహం చేసేందుకు తాపత్రయ పడుతున్నారు. నాలుగేళ్ళ కాలం బీజేపీతో అంటకాగిన ఫలితంగా అంటుకొన్న పాప పంకిలం కడుగుకొనేందుకు ధర్మ పోరాట దీక్షలు సాగిస్తూ ప్రజా ధనాన్ని మంచి నీళ్ళ ప్రాయంగా ఖర్చు చేస్తున్నారు.

ప్రత్యేక హోదా పై ఈ నాలుగేళ్ళ కాలంలో ముఖ్యమంత్రి ఎన్ని మాటలు మార్చారో అవన్నీ పేర్కొనడం పునశ్చరణే అవుతుంది.ఇవన్నీ పరిశీలిస్తే ముఖ్యమంత్రి ఈ నాడు కూడా కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వానికి, ప్రధాని మోడీకి వ్యతిరేకంగా సూత్రబద్ధమైన పోరాటం చేసేందుకు సిద్ధంగా లేరు. ఎప్పుడూ ఏ పార్టీతోనైనా కొన్ని మినహాయింపులు పెట్టుకొనే ముఖ్యమంత్రి వ్యవహరిస్తుంటారు. లేకుంటే తను పవన్ కళ్యాణ్ తో జట్టు కడితే జగన్ కు వచ్చిన బాధేమి అని అసంబద్ధమైన వ్యాఖ్యలు చేస్తారా? ముఖ్యమంత్రి స్వవచన విఘాతాలు ఎలా వుంటాయంటే ఆయన బీజేపీతో చెలిమి చేసిన రోజుల్లో ఏపిలో సభలు, నిరసన ప్రదర్శనలు సాగినపుడు ఢిల్లీ వెళ్ళి ఆందోళనా కార్యక్రమాలు సాగించమని సలహా ఇచ్చిన రోజులున్నాయి. అయితే ఆ పని ఇంత వరకు ముఖ్యమంత్రి ఎందుకు చేయ లేదో జవాబు లేదు. వాస్తవంలో ప్రధాని మోడీకి కనీస షాక్ ఇవ్వాలని వుంటే ఢిల్లీలోని జంతర్ మంతర్ వద్ద ఒక ధర్మ పోరాట దీక్ష సాగించే వారు. లేదా నేడు వామపక్ష ప్రజా తంత్ర శక్తులు ఢిల్లీ వీధుల్లో ప్రదర్శించిన నిరసన లాంటివి తన ఎం.పీ ల చేత చేయించేవారు. నేడు ఢిల్లీ వీధుల్లో వామపక్ష ప్రజాతంత్ర శక్తులు సాగించిన పోరాటానికి ముఖ్యమంత్రి మోడీకి వ్యతిరేకంగా చేపడుతున్న ధర్మ పోరాట దీక్షలకు మధ్య గల సరళ రేఖ అతి స్పష్టంగా వుంది. ఇది రెండూ వేర్వేరు. అంతే కాదు రాజకీయాల్లో ఏదీ అనూహ్యం కాదు. రేపు 2019 ఎన్నికల్లో అయితే గియితే కేంద్రంలో బీజేపీ ప్రభుత్వం ఏర్పడితే నరేంద్ర మోడీ కాకుండా నితిన్ గడ్కరీ లాంటి నేత ప్రధాని మంత్రి అయితే తిరిగి బీజేపీ తో చెలిమిని రిజర్వులో వుంచుకొనేందుకే ముఖ్యమంత్రి తన పోరాటం బీజేపీ ప్రభుత్వానికి వ్యతిరేకంగా కాకుండా ప్రధాని మోడీ పైననే సాగిస్తూ వ్యక్తిగత పోరాటంగా మార్చి వేయడం గమనార్హం. ఈ సందర్భంలో విపక్ష నేత జగన్ వైఖరి కూడా సరిగా లేదు. జన సేన నేత పవన్ కళ్యాణ్ స్పందించినట్లు కనీసం పరామర్శ ప్రకటన కూడా విపక్ష నేత జగన్ చేయ లేదు. ఈ అంశంలో ముఖ్యమంత్రి, ప్రతిపక్ష నేత ఇద్దరూ ఒక గూటి పక్షులుగానే వున్నారు. రాష్ట్రంలో రాజకీయ పక్షాల రాజకీయం వేరు. ఏపీ ప్రజలు ఆకాంక్షించే ప్రత్యేకహోదా సాధనకు ఢిల్లీ వీధుల్లో నిరసన తెలుపుతూ పలువురు గాయ పడితే విపక్ష నేతే కాదు తుదకు ఏపి లోని పాపులర్ మీడియా కూడా సరిగా స్పందించలేదు. మహా రాష్ట్ర రైతులు బొంబాయిలోను ఇటీవల దేశం మొత్తం మీద నుండి వచ్చిన రైతులు ఢిల్లీ వీధుల్లోను రోజుల తరబడి నిరసన తెలిపి పాక్షికంగా నైనా సాధించిన విజయాలను ఏపిలోని వివిధ రాజకీయ పక్షాలు గమనంలోనికి తీసుకొంటే ఇప్పటికైనా ప్రధాని మోడీ మెడలు వంచి ప్రత్యేక హోదా సాధించడం పెద్ద కష్టమేమీ కాదు. ఏపీ యెడల ప్రధాని మోడీ మొండివైఖరి ఫలితమే తుదకు ప్రకటించిన పర్యటనను కూడా రద్దు చేసుకోవల్సి వచ్చింది. పైగా తాజాగా వెలువడుతున్న సర్వేల ప్రకారం ఏపిలో మోడీ ప్రభావం అంతరించిపోతోంది.

వ్యాసరచయిత విశ్రాంత పాత్రికేయుడు,
సెల్ : 9848394013

మతవిశ్వాసాలు ఎంత ఘాటో !

శిరందాసు నాగార్జున

మత విశ్వాసాలు చాలా బలీయమైనవి. మత విశ్వాసాలను నమ్మేవారు హక్కులను వదులు కొని బానిసలుగా బతకడానికి సిద్ధపడ తారు. "మతం మత్తు మందు" వంటిది. అని కమ్యూనిస్టు సిద్ధాంత కర్త కార్ల్‌మార్క్స్అన్నారు. "మతం ఒక భ్రమ, అశాస్త్రీయమైనది" అని ఏంగెల్స్ అన్నారు. వారు అధ్యయనం చేసింది క్రైస్తవ, ఇస్లాం, యూదు మతాలనైనప్పటికీ మత విశ్వాసాలన్నీ అశాస్త్రీయమే నవే. ప్రపంచంలో ఏ మతం మనుషులను మను షులుగా చూడ లేదు. మతాల పెద్దలు ప్రజాస్వామ్య, సామ్యవాద ఉద్యమాలను తొక్కేశారు. విజ్ఞాన పరిశోధనలను వెలుగులోనికి రానివ్వలేదు. కొన్ని మతాలు మనుషులను జాతులుగా విడగొట్టి హీనంగా చూస్తే, హిందూ మతం కులాల పేరుతో అంటరానితనం పాటించి అత్యంత దారుణంగా హింసించింది. ఇక్కడ చాలా కాలం మనువాద సిద్ధాంతం రాజ్యమేలింది. ప్రపంచంలోని దాదాపు అన్ని మతాలు మహిళలను తక్కువగానే చూశాయి. చూస్తున్నాయి. ప్రపంచ ప్రఖ్యాత శాస్త్రవేత్తలు కోపర్నికస్, గెలీలియో, జాన్ కెప్లర్, బ్రూనో వంటి వారు క్రైస్తవులైనప్పటికీ ఆ మత పెద్దలే వారిని చిత్రహింసలకు గురిచేసి ప్రాణాలు తీశారు. వారి పరిశోధనా పత్రాలు, గ్రంథాలపై నిషేధం విధించారు. వాటిని తగులబెట్టారు. మత విశ్వాసాలు ప్రపంచ అభివృద్ధిని వందల ఏళ్లు వెనక్కి నెట్టేశాయి. మన దేశం ఇప్పుడు రెండు మతాలకు సంబంధించి రెండు ప్రధాన సమస్య లను ఎదుర్కొంటోంది. ఆ సమస్యలు రెండూ మహిళల సమానత్వానికి సంబంధించినవే. 21వ శతాబ్దంలో భారత్ వంటి అతి పెద్ద ప్రజాస్వామ్య దేశం ఇటువంటి సమస్యలను ఎదుర్కోవడం అత్యంత దారుణం. ఈ మత విశ్వాసాలు రాజకీ యాలను కూడా ప్రభావితం చేసే స్థాయికి ఎదగడం బాధాకరం. దేశంలో న్యాయంపై మతం, రాజకీయాలు పై చేయి సాధించడానికి ప్రయత్నించడం దురదృష్టకరం.

కేరళ రాష్ట్రంలోని శబరిమల అయ్యప్ప ఆలయంలోకి మహిళలకు ప్రవేశం కల్పిస్తూ 2018 సెప్టెంబర్ 28న ఐదుగురు జడ్జిలతో కూడిన సుప్రీం కోర్టు ధర్మాసనం కీలక తీర్పు ఇచ్చింది. చీఫ్ జస్టిస్ దీపక్ మిశ్రా తీర్పును చదివారు. "చట్టాలు,సమాజం అందరినీ గౌరవించాలి. దైవత్వం లింగ విభేదాలు చూపించదు. అన్ని వయస్సుల మహిళలు శబరిమల ఆల యంలోకి వెళ్లవచ్చు. భారత దేశంలో మహిళలను దేవతలతో కొలుస్తారు. అలాంటప్పుడు లింగ భేదం చూపలేం. మహిళను తక్కువగా చేసి చూడలేం. మతం అనేది ప్రాథమిక జీవన విధానంలో భాగం. మతం విషయంలో మహిళలకు సమాన హక్కులు ఉండాల్సిందే. శారీరకమైన మార్పులను సాకుగా చూపి మహిళలపై వివక్ష చూపించడం సరికాదు. మహిళలను శబరిమల ఆలయంలోకి ప్రవేశించడాన్ని నిరాకరించడం అంటే రాజ్యాంగంలోని ఆర్టికల్ 14, 25లను ఉల్లంఘించినట్లే" అని ఆ తీర్పులో పేర్కొన్నారు. ఐదుగురు సభ్యుల ధర్మాసనంలో నలుగురు ఈ తీర్పుతో అంగీకరించగా, ఏకైక మహిళా జడ్జి జస్టిస్ ఇందూ మల్హోత్రా భిన్నమైన అభిప్రాయాన్ని వెల్లడించడం విశేషం. సతీసహగమనం లాంటి సామాజిక రుగ్మతలు మినహా మతపరమైన విధానాలను తొలగించే దానిపై నిర్ణయం తీసుకునే అంశం కోర్టుకు సంబంధించినది కాదన్నారు. దేశంలో లౌకిక వాతావరణాన్ని కల్పించేందుకు బలంగా నాటుకుపోయిన మతపరమైన ఆచారాల్లో మార్పు చేయవద్దన్నారు. సుప్రీం కోర్టు తీర్పుని దేవస్థానం బోర్డు స్వాగతించింది. తీర్పుపై బోర్డు రివ్యూ పిటిషన్ కూడా చేయదలుచుకోలేదు.

అయితే అయ్యప్ప భక్తులు ఈ తీర్పుని వ్యతిరేకించారు. కేరళ రాష్ట్రంలో నిరసన ప్రదర్శనలు చేశారు. మహిళల చేత కూడా చేయించారు. ఆందోళనలు చేశారు. ఉద్రిక్త పరిస్థితులు నెలకొన్నాయి. ఆలయంలో ప్రవేశించడానికి ప్రయత్నించిన మహిళలను అడ్డుకున్నారు. వారిపై దాడులు కూడా చేశారు. దాంతో వారు వెనుదిరిగి వెళ్లిపోయారు. ఎవరి హక్కులనైతే కాపాడటానికి అత్యున్నత న్యాయస్థానం ప్రయత్నిస్తోందో వారు కూడా ఆ హక్కులు వద్దనడం మత మౌఢ్యానికి నిదర్శనం. ఈ నేపథ్యంలో స్త్రీ-పురుష సమానత్వం, సామాజిక సంస్కరణలపై ప్రభుత్వ చిత్తశుద్ధిని చాటుకునేందుకు కేరళ ముఖ్యమంత్రి పినరయి విజయన్ "వనితా మతిల్" పేరుతో భారీ మానవహారాన్ని ఏర్పాటు చేశారు. 2019 జనవరి 1వ తేదీ సాయంత్రం సముద్ర తీరం వెంబడి రహదారులపై ఉత్తరాన కాసర్‌గాడ్ నుంచి దక్షిణాన తిరువనంతపురం వరకు 620 కిలోమీటర్ల పొడవున దాదాపు 40 లక్షల మందికి పైగా మహిళలు భారీ మానవహారంలో పాల్గొ న్నారు. మహిళా శక్తి ప్రదర్శనలో కేరళ ప్రభుత్వం చూపిన చొరవ అభినందనీయం. చివరకు జనవరి 2వ తేదీ తెల్లవారుజామున 3.45 గంటలకు కొందరి రక్షణతో 50 ఏళ్ల లోపు వయసున్న ఇద్దరు మహిళలు బిందు అమ్మిని(40) కనకదుర్గ(39) తొలిసారిగా ఆలయం లోపలకు ప్రవేశించారు. దీంతో రెచ్చిపోయిన హిందూ మత సంస్థలు, అయ్యప్ప భక్తులు ఆందోళనకు దిగారు. ఈ నెల 3వ తేదీ కేరళ బంద్ కు పిలుపు ఇచ్చారు. ఆ రాష్ట్రంలో ప్రస్తుతం ఉద్రిక్త పరిస్థితులు నెలకొన్నాయి. ఈ సంఘటనలకు రాజకీయ రంగు పులుముకున్నది.

ఇక రెండవది ముస్లింలకు చెందిన ట్రిపుల్ తలాక్ అంశం. ఇది కూడా స్త్రీ-పురుష సమానత్వానికి చెందినదే. ముస్లింలలో భర్తలు భార్యలకు విడాకులు ఇవ్వడం అత్యంత సులభమైన పని. ఏకపక్షమైనది. న్యాయస్థానంతో సంబంధం లేకుండా ఎలాంటి కారణం చెప్పకుండా ఏకపక్షంగా భర్త మూడు సార్లు తలాక్ చెప్పి విడాకులు యివ్వవచ్చు. మరో మూడు రకాలుగా కూడా భార్యాభర్తలు విడిపోతారు. అయితే ఈ తలాక్ పద్ధతే అత్యంత దారుణమైనది. భార్యను నిరాశ్రయురాలిని చేస్తుంది. భర్తకు భార్య తలాక్ పద్ధతిలో విడాకులు ఇచ్చే అవకాశం లేదు. ట్రిపుల్ తలాక్‌ను సుప్రీంకోర్టు 2017లో రాజ్యాంగ విరుద్ధమని ప్రకటించింది. అయినా ఈ సంప్రదాయం ఇంకా కొనసాగుతోంది. ఈ తీర్పు వెలువడిన తరువాత కూడా దేశవ్యాప్తంగా దాదాపు 45 మంది భర్తలు తమ భార్యలకు తలాక్ చెప్పారు. సుప్రీంకోర్టు తీర్పు వారికి అండగా నిలవలేకపోయింది. తలాక్ చెప్పిన భర్త మరో పెళ్లి చేసుకుంటున్నాడు. సరైన చట్టాల రూపకల్పన ద్వారా స్త్రీ-పురుషులిద్దరికీ సమాన న్యాయం అందించవలసిన బాధ్యత పార్లమెంటుపై ఉంది. ముస్లిం పర్సనల్ లా తప్ప అన్నివర్గాల పర్సనల్ లాలను పార్లమెంటు సంస్కరించింది. ముస్లిం పర్సనల్ లా సంస్కరణ కోసం ముస్లిం మహిళలే దశాబ్ద కాలంగా ప్రయత్నాలు చేశారు. వారు సంఘటితమై సమాన న్యాయం కోసం ఖురాన్ బోధనలు, రాజ్యాంగ నిబంధనలపై అవగాహనను పెంచేందుకు ప్రయత్నించారు. ప్రభుత్వానికి వినతి పత్రాలు కూడా అందజేశారు. సంప్రదాయ ముస్లిం మతపెద్దలు ముస్లిం మహిళల డిమాండ్లను అసలు పట్టించుకోలేదు. హిందూ, క్రైస్తవ, జైన్ మహిళలతో సమానంగా ముస్లిం మహిళలకు కూడా న్యాయం అందించాలన్న అంశంపై దేశంలోని రాజకీయ పార్టీలలో ఏకాభిప్రాయంలేదు. ఈ నేపథ్యంలో ముస్లిం మహిళలకు న్యాయం చేసే తలాక్ బిల్లు (ముస్లిం మహిళల వివాహ హక్కుల పరిరక్షణ బిల్లు) 2018 డిసెంబర్ 27న లోక్‌సభలో 245 ఓట్లతో ఆమోదం పొందింది. అయితే పలు విపక్షాలు సభ నుంచి వాకౌట్ చేశాయి. ఈ బిల్లుని డిసెంబర్ 31న కేంద్ర ప్రభుత్వం రాజ్యసభలో ప్రవేశ పెట్టింది. విపక్ష పార్టీల సభ్యులు బిల్లును అడ్డుకున్నారు. రాజ్యసభలో ఈ బిల్లు భవితవ్యం అనిశ్చితిలో పడింది. ఈ బిల్లుకు యథాతథంగా మద్దతు ఇవ్వం అని కాంగ్రెస్ ప్రకటించింది. బిల్లుని జాయింట్ సెలక్ట్ కమిటీకి పంపాలని డిమాండ్ చేస్తోంది. వివిధ కారణాల రీత్యా విపక్షాలు ఈ బిల్లుకు మద్దతు తెలుపడంలేదు. పూర్తిగా వ్యతిరేకించడంలేదు. బిల్లులో మార్పులు చేయాలని డిమాండ్ చేస్తున్నాయి. కొందరు ముస్లిం మహిళలు కూడా దీనిని వ్యతిరేకించి నిరసన ప్రదర్శనలు చేశారు. ఈ బిల్లుపై తలెత్తిన వివాదం రాజకీయ రంగు పులుము కుంటోంది. ఆ కారణంగా ముస్లిం బాధిత మహిళలు నష్టపోతారు. మత విశ్వాసాలు ఎంత బలీయంగా ఉంటాయో, ప్రభుత్వాలను కూడా ఎలా ఇరుకున పెడతాయో, రాజకీయాలను కూడా ఎలా శాసిస్తాయో ఈ సంఘటనల ద్వారా స్పష్టమవు తోంది.

వ్యాసరచయిత సీనియర్ జర్నలిస్టు
9440222914

సొహ్రాబుద్దీన్ కేసులో

నిందితుల విముక్తి దిగ్భ్రాంతికరం

ఆయోమీ శర్మ

దేశవ్యాప్తంగా సంచలనం సృష్టించిన సొహ్రాబుద్దీన్ అన్వర్‌హుస్సేన్ షేక్ ఎన్‌కౌంటర్ జరిగి 13ఏళ్లు అయింది. అతనిని గుజరాత్ పోలీసులు బూటకపు ఎన్‌కౌంటర్‌లో చంపేశారన్న ఆరోపణలు ఉన్నాయి. 2005, నవంబరు 26న సొహ్రాబుద్దీన్ చనిపోయాడు. అప్పటినుంచి అతని సోదరుడు రుబాబుద్దీన్ న్యాయపోరాటం చేస్తున్నారు. ఈ క్రమంలో ఆయన సుప్రీంకోర్టులో రిట్ పిటిషన్ దాఖలు చేయడం సొహ్రాబుద్దీన్ ఎన్‌కౌంటర్‌పై దర్యాప్తునకు దారితీసింది.

సొహ్రాబుద్దీన్‌కు ఉగ్రవాద సంస్థ లష్కరే తోయిబాతో పాటు పాకిస్థాన్ ఇంటెలిజెన్స్ సంస్థలతో సంబంధాలు ఉన్నాయన్న వదంతులు వినవచ్చాయి. ఈ సంబంధాల కారణంగానే అతను ఓ ముఖ్య నాయకుడి హత్యకు కుట్ర చేశాడన్న ఊహాగానాలు ఉన్నాయి. సొహ్రాబుద్దీన్‌పై ఎక్స్‌టార్షన్ కేసు ఉంది. అతను గుజరాత్, రాజస్థాన్‌లోని మార్బుల్ ఫ్యాక్టరీల నుంచి డబ్బును బలవంతంగా వసూలు చేసినట్లు ఆరోపణలు ఉన్నాయి. మధ్యప్రదేశ్‌లోని అతని నివాసంలో 40 ఏకే -47 రైఫిళ్లు లభ్యమైనట్లు కూడా పోలీసులు అప్పట్లో తెలిపారు. సొహ్రాబుద్దీన్ మరణించినప్పుడు అతనిపై హత్య, దోపిడీ, ఆయుధాల స్మగ్లింగ్ వంటి 60 కేసులు పెండింగ్‌లో ఉన్నాయి.

పరారీలో ఉన్న సొహ్రాబుద్దీన్ ఓ ప్రైవేటు బస్సులో మహారాష్ట్రలోని సంగ్లీ వైపు వెళుతున్న క్రమంలో గుజరాత్ రాష్ట్ర యాంటీ-టెర్రరిజం స్క్వాడ్ (ఏటీఎస్)కు చిక్కాడు. ఆ సమయంలో సొహ్రాబుద్దీన్ వెంట అతని భార్య కౌసర్‌బీ, స్నేహితుడు తులసీరామ్ ప్రజాపతి ఉన్నారు. పోలీసులు ఆ ముగ్గురిని అదుపులోకి తీసుకొని అహ్మదాబాద్ నగర శివార్లలోని ఫామ్‌హౌస్‌కు తరలించారు. ఇది జరిగిన నాలుగు రోజుల తర్వాత ఎన్‌కౌంటర్‌లో సొహ్రాబుద్దీన్ చనిపోయినట్టు పోలీసులు ప్రకటించారు. అప్పట్లో గుజరాత్ ముఖ్యమంత్రిగా ఉన్న ప్రస్తుత ప్రధానమంత్రి నరేంద్రమోడీ హత్యకు సొహ్రాబుద్దీన్ కుట్ర చేశాడన్నది గుజరాత్ పోలీసుల వాదన. అయితే, వారి వాదనకు బలం చేకూర్చే ఎలాంటి సాక్ష్యాధారాలను వారు సమర్పించలేక పోయారు.

సొహ్రాబుద్దీన్ ఎన్‌కౌంటర్ తర్వాత నవంబరు 29 వరకు కౌసర్‌బీ జాడ లేదు. ఆమెను వేరొక ప్రాంతానికి తీసుకెళ్లి, అత్యాచారం చేసి చంపేశారని సీబీఐ పేర్కొంది. గుజరాత్ పోలీసులే ఆమెపై అత్యాచారానికి పాల్పడినట్లు తాజా ఆధారాల ద్వారా తెలుస్తోంది. ఇది జరిగిన ఏడాది తర్వాత అంటే 2006, డిసెంబరు 27న సొహ్రాబుద్దీన్ స్నేహితుడైన తులసీరామ్ ఎన్‌కౌంటర్‌లో మరణించాడు. ఈ ఎన్‌కౌంటర్‌ను గుజరాత్, రాజస్థాన్ పోలీసులు సంయుక్తంగా నిర్వహించారు. సొహ్రాబుద్దీన్ హత్యకు తులసీరామ్ ఒక్కడే సాక్షి. తులసీరామ్ తప్పించుకునేందుకు ప్రయత్నించినందునే అతనిని కాల్చిచంపినట్టు పోలీసులు తెలిపారు.

మొదటి నుంచి సొహ్రాబుద్దీన్ విచారణకు సంబంధించి భయానకమైన సంఘటనలు చోటు చేసుకుంటుండటం దేశ సర్వోన్నత న్యాయస్థానాన్ని సైతం ఆశ్చర్యపర్చింది. కేసులో విచారణ మొదలైనప్పుడు అప్పట్లో గుజరాత్ హెూంమంత్రి, మోడీకి సన్నిహితుడైన అమిత్‌షా సహా పలువురు రాజకీయ ప్రముఖుల పేర్లు వినిపించాయి. నిందితుల్లో ఐపీఎస్ అధికారి అభయ్ చుదాసమా, రాజస్థాన్ మాజీ హెూంమంత్రి గులాబ్‌చంద్ కటారియా, గుజరాత్ పోలీస్ మాజీ చీఫ్ పీసీ పాండే, డీజీ వన్జారా, పోలీసు సీనియర్ అధికారి గీతా జోహ్రి ఉన్నారు. అయితే వారంతా నిర్దోషులుగా బయటకొచ్చేశారు. గుజరాత్ సీఐడీ వద్దవున్న ఈ కేసును 2012, సెప్టెంబరులో సీబీఐకి సుప్రీంకోర్టు అప్పగించింది.

సొహ్రాబుద్దీన్‌కి రుబాబుద్దీన్ షేక్, నయాముద్దీన్ షేక్, షానవాజుద్దీన్ షేక్ ముగ్గురు సోదరులు ఉన్నారు. వీరంతా ప్రాసిక్యూషన్ సాక్షుల జాబితాలో ఉన్నారు. గుజరాత్ ఇన్వెస్టిగేటర్ రజనీష్ రాయ్, గుజరాత్ బిల్డర్లు రమణ్‌భాయ్, దశరథ్ భాయ్ పటేల్ వంటి ముఖ్యమైన సాక్షులను అసలు సాక్షులుగానే పరిగణించలేదని రుబాబుద్దీన్ అన్నారు. ఈ కేసులో మొత్తం 38 మంది నిందితులు ఉండగా 2014లో 16 మందికి విముక్తి లభించింది.

ఈ కేసుకు సంబంధించి 2014లో ఓ దురదృష్టకర సంఘటన చోటుచేసుకుంది. ఈ కేసును జస్టిస్ బ్రిజ్‌గోపాల్ హరికిషన్ లోయాకు అప్పగించారు. ఇది జరిగినప్పుడు అమిత్‌షా నిందితుడిగానే ఉన్నారు. కేసును విచారణకు తీసుకున్న కొద్దిరోజుల్లోనే జస్టిస్ లోయా చనిపోయారు. నవంబరు 30న అత్యంత అనుమానాస్పద పరిస్థితుల్లో ఆయన మరణించడం అనేక అనుమానాలకు తావిచ్చింది. ఆ తర్వాత ఈ కేసు మరో ఇద్దరి వద్దకు వెళ్లింది. చివరగా మూడో జడ్జి జస్టిస్ ఎంబీ గోసావి వద్దకు చేరింది. ఆయన 2014, డిసెంబరు 30న అమిత్‌షాపై ఆరోపణలను కొట్టివేశారు.

అనుమానాస్పద పరిస్థితిలో జస్టిస్ లోయా మరణించడంపై ప్రశ్నలు నేటికీ సుప్రీంకోర్టు ఆవరణలో ప్రతిధ్వనిస్తూనే ఉన్నాయి. మునుపెన్నడూ జరగని విధంగా న్యాయమూర్తుల్లో విభేదాలకు తావిచ్చాయి. 2017, నవంబరులోనూ అనుకోని సంఘటన ఒకటి జరిగింది. సొహ్రాబుద్దీన్ కేసులో మీడియా రిపోర్టింగ్‌పై 'గ్యాగ్ ఆర్డర్' (అంటే కేసు వివరాలను బహిరంగపర్చరాదన్న ఆదేశాలు)ను సీబీఐ కోర్టు జారీచేసింది. ఆ తర్వాత కేసు విచారణ చేపట్టిన బాంబే హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ రేవతి మోహితె-డెరే ఆ ఆదేశాలను రద్దుచేశారు.

ఈ కేసులో సాక్షుల వాంగ్మూలాలను సేకరించేందుకు 12ఏళ్ల సమయం పట్టింది. మొత్తం 210 మంది సాక్షుల వాంగ్మూలాలు సేకరించగా వారిలో 92 మంది మాటమార్చారు. వారు ఎందుకని వ్యతిరేకంగా మాట్లాడుతున్నారని ఎవ్వరూ ఆరాతీయలేదు. సీబీఐ ప్రత్యేక కోర్టు కూడా ఈ విషయాన్ని పక్కనబెట్టి.. సరైన సాక్ష్యాధారాలు లేకపోవడంతో నిందితులను సొహ్రాబుద్దీన్, కౌసర్‌బీ, తులసీరామ్‌ల హంతకులుగా నిర్ధారించలేమని పేర్కొంది. ఈ కేసులో మొత్తం 22 మంది నిందితులను నిర్దోషులుగా పేర్కొంటూ సీబీఐ ప్రత్యేక జడ్జి ఎస్‌జే శర్మ డిసెంబరు 21న తీర్పును వెలువరించారు. ఎన్‌కౌంటర్‌లో చనిపోయిన వారి కుటుంబాలకు సానుభూతి తెలుపుతూ, సాక్ష్యాధారాలు లేకుండా కోర్టు ఏమీ చేయలేదని జస్టిస్ శర్మ పేర్కొన్నారు. నిందితులను దోషులుగా రుజువు చేసేందుకు అవసరమైన సాక్ష్యాధారాలు ప్రాసిక్యూషన్ వద్ద లేనందున 22 మందిని నిర్దోషులుగా విడుదల చేస్తున్నట్టు న్యాయమూర్తి తెలిపారు. ఈ తీర్పును బట్టి వాస్తవంగా మన న్యాయ వ్యవస్థలో ఎన్ని లోపాలు ఉన్నాయో అర్థమవుతోంది. ఇది బూటకపు ఎన్‌కౌంటర్ అని తెలిసినప్పటికీ సీబీఐ, సీబీఐ ప్రత్యేక న్యాయమూర్తి ఏమీ చేయలేక పోయారు. వ్యవస్థ ముందు నిస్సహాయులయ్యారు. ఆ ముగ్గురు బాధితులకు న్యాయం చేయడంలో మన న్యాయవ్యవస్థ వైఫల్యాన్ని ఇది ప్రతిబింబిస్తోంది. సీనియర్ నాయకులు, సీనియర్ పోలీసు అధికారుల జోక్యం ఉన్న నేపథ్యంలో తుది తీర్పు వివక్షభరితంగా ఉందన్న భావన లేకపోలేదు. ఏదిఏమైనా కోర్టు ఇంత గుడ్డిగా వ్యవహరించడం నిర్ఘాంతపరుస్తోంది. కీలకమైన సాక్షులంతా మాటమార్చినప్పటికీ కోర్టుకు అనుమానం రాకపోవడం ఆశ్చర్యకరం. సొహ్రాబుద్దీన్ తన భార్య, స్నేహితుడితో కలిసి ప్రయాణించిన బస్సు డ్రైవరు, తోటి ప్రయాణికులు కూడా ఆ ముగ్గురి కోసం నిలబడలేకపోయారు.

ఏదిఏమైనా సొహ్రాబుద్దీన్ హత్యకేసు పరిణామాలు స్పష్టంగా ఉన్నాయి. ప్రధాన సాక్షి అయిన తులసీరామ్ ఆ తరువాత వేరొక ఎన్‌కౌంటర్‌లో హతంకావడం యాదృచ్ఛికం కాదు. సొహ్రాబుద్దీన్ భార్య చనిపోయిన పరిస్థితులపై నేటికీ స్పష్టతలేదు. పోలీసులు ఆమెపై అమానుషంగా అత్యాచారానికి పాల్పడి, చంపేసి, అక్కడికక్కడే దహనం చేశారు.

ఏదిఏమైనా 2018, డిసెంబరు 21 రుబాబుద్దీన్ జీవితంలో దుర్దినం. ఆయన తన సోదరుడికి న్యాయం జరగాలని పడిన శ్రమకు ఫలితం దక్కలేదు.

ఇప్పుడు ఆయన కిందికోర్టు ఆదేశాలను సుప్రీంకోర్టులో సవాల్ చేయాలని యోచిస్తున్నారు. శక్తివంతమైన నాయకుల ప్రమేయం, బూటకపు ఎన్‌కౌంటర్లకు పాల్పడిన పోలీసులపై చర్యలు లేకపోవడం వ్యవస్థపరంగా అనేక ప్రశ్నలకు తావిస్తోంది.

విశాలాంధ్ర
బతుకు
The Life
శనివారం
05 జనవరి 2019

చిన్నారుల చిత్రం!



పిండివంటల వేళాయే!

జనవరి వచ్చిందంటే...పండగ వచ్చినట్టే...పండగ అంటే...పిండివంటలు ఉండాలిగా! పెద్ద పండగ సంక్రాంతికి పూర్వపు రోజుల్లో కుండలకు కుండలు పిండివంటలు వండేవాళ్ళు. అందులో ప్రధానమైనది అరిసెలు. వాటితోపాటు తీపి మిఠాయిలు, కారం తాయిలాలు ఎన్నోఎన్నెన్నో రకాలు. దేనికదే ప్రత్యేకం. పెద్దల కోసం కొన్ని, పిల్లల కోసం కొన్ని...ఇలా రకరకాలు తయారుచేసేవారు. నేటి రోజుల్లో ఆ సంప్రదాయ వంటకాలే కనిపించడం లేదు...కనిపించినా అవి బయట మార్కెట్‌లోనే. ఇళ్ళల్లో తయారుచేసేవారు తరిగిపోయారు. బాగా తగ్గిపోయారు. కొంచెం తీరిక చేసుకుని ఇంట్లోనే పిండివంటలు చేసుకుంటే ఎంచక్కా మంచి రుచిని ఆస్వాదించడమే కాదు...డబ్బులూ బోలెడు ఆదా చేసుకోవచ్చు. ఏమంటారూ...మరి పిండివంటలు తయారీకి సిద్ధమేనా! పూర్వపు సంప్రదాయ పిండివంటల్లో కొంచెం వెరైటీగా ఉండే రకాలు, సులభంగా తయరుచేసుకునే వంటలు.... కొన్ని చూద్దాం...చేద్దాం!



సేమియా జంతికలు



కావలసిన పదార్థాలు

సేమియాలు ఒక కప్పు, బియ్యం పిండి రెండు కప్పులు, వాము ఒక టీ స్పూన్, కారం ఒక టీ స్పూన్, ఉప్పు రుచికి సరిపడ, ఆయిల్ డీప్ ఫ్రైకి సరిపడ.

తయారీ విధానం

ఒకటిన్నర కప్పు నీళ్ళల్లో సేమియాలు వేసి రెండు గంటలు నానబెట్టిలి. రెండు గంటల తర్వాత నానిన సేమియాలను చేతి వేళ్ళతో మెత్తగా మెదపాలి. ఇందులో బియ్యం పిండి, పావుకప్పు వేడివేడి నూనె, ఉప్పు, వాము, కారం కూడా వేసి కలపాలి. పొయ్యి మీద పాన్ పెట్టి డీప్ ఫ్రైకి సరిపడ ఆయిల్ వేసి బాగా కాగనివ్వాలి. పిండిని జంతికల గొట్టంలో వేసి నూనెలో జంతికల్లా వేసుకోవడమే. చిన్న కన్నాలు ఉన్న జంతికల ప్లేట్ ఎంచుకుంటే బాగా వేగుతాయి. తినడానికి బాగుంటాయి. లేత బంగారు వర్ణం వచ్చేవరకూ జంతికలను రెండువైపులా వేయించుకోవాలి. వేగిన జంతికలను గాలి చొరబడని డబ్బాలో వేసుకుంటే ఎక్కువ రోజులు నిల్వ ఉంటాయి.

మైదా వెన్న బిస్కట్లు

కావలసిన పదార్థాలు

మైదా అరకేజీ, వెన్న 100 గ్రాములు, నెయ్యి 100 గ్రాములు, పంచదార పావుకేజీ, ఉప్పు చిటికెడు, కొద్దిగా పాలు.

తయారీ విధానం

ఒక గిన్నెలో మైదా, వెన్న, నెయ్యి, పంచదార, ఉప్పు వేసి బాగా కలుపుకోవాలి. ఇలా తయారైన మిశ్రమంలో కొద్దిగా పాలుపోసి చపాతి ముద్దలా కలిపి ఒక గంట పక్కన పెట్టుకోవాలి. ఇప్పుడు స్టవ్ వెలిగించి అట్ల పెనంపై మందంగా ఇసుక పోసి సమానంగా సర్దాలి. నానిన పిండిన చపాతీలా చేసి అంచులేని గ్లాసుతో చపాతీ మీద నొక్కితే గుండ్రంగా బిస్కట్ల మాదిరిగా వస్తాయి. అలా అన్నీ చేసుకున్నా వేరే మందంగా ఉన్న మరో అట్ల పెనం తీసుకుని దాని మీద కట్ చేసిన బిస్కట్లను ఒక్కొక్కటిగా సర్ది స్టవ్ మీద ఉన్న అట్ల రేకు మీద (ఇసుక మీద) పెట్టాలి. అంటే ఇసుక వేడి మీద బిస్కట్లు కాలతాయన్నమాట. ఇదే ఈ మైదా బిస్కట్ల ప్రత్యేకత. ఒకవైపు కాలిన తర్వాత రెండోవైపు తిప్పాలి. ఇసుక బాగా వేడెక్కిన తర్వాత పెడితే ఐదు నిముషాల్లోనే బిస్కట్లు రెడీ అయిపోతాయి. ఈ బిస్కట్లు నెల రోజులు నిల్వ ఉంటాయి. ఇవి తీపి బిస్కట్లు. కారంగా కావాలనుకుంటే ఇదే పిండితో ఇలాగే తయారు చేసుకోవచ్చు. పంచదారకు బదులు ఉప్పు వేసుకుంటే సరిపోతుంది. వెన్న కలిపిన ఈ తీపి మైదా బిస్కట్లు నోట్లో వేసుకోగానే ఇట్టే కరిగిపోతాయి. తిన్నకొద్దీ ఇంకా ఇంకా తినాలనిపిస్తాయి, నోరూరిస్తాయి. మరి మీరూ ట్రై చేసి చూడండి. వీటి రుచి తెలుసుకోండి.



కారం కాజాలు



కావలసిన పదార్థాలు

గోధుమపిండి లేదా మైదా పిండి ఒక కప్పు, కారం ఒక టీ స్పూన్, జీలకర్ర లేదా వాము అర టీస్పూన్, ఉప్పు రుచికి సరిపడ, ఆయిల్ తగినంత.

తయారీ విధానం

గోధుమపిండిలో ఉప్పు, కారం, జీలకర్ర, వాము, టేబుల్ స్పూన్ వేడి నూనె వేసి బాగా కలుపుకోవాలి. కొద్దికొద్దిగా నీళ్ళు పోస్తూ మెత్తగా, మృదువుగా పిండి కలిపి పక్కన పెట్టుకోవాలి. పైన మూత పెట్టి అరగంట అలాగే ఉంచాలి. అరగంట తర్వాత ఈ పిండిని చిన్న ఉండలుగా తీసుకుని పూరీల్లా చేసుకోవాలి. ఆ పూరీని మళ్ళీ మీకు ఇష్టమైన ఆకారంలో చాకుతో కట్ చేసుకోవాలి. నలుచదరం లేదా డైమండ్, లేదా హార్లిక్స్ మూత ఆకారంలో లేదా పొడవుగా కాజాల్లా ఇలా మీకు ఎలా ఇష్టమైతే ఆ ఆకారంలో మలుచుకోవచ్చు. పొయ్యి మీద పాన్ పెట్టి నూనె పోసి బాగా కాగాక ఈ కట్ చేసుకున్న ముక్కలు అందులో వేసుకోవాలి. తక్కువ మంట మీద గోధుమ వర్ణం వచ్చేవరకూ వాటిని వేయించుకోవాలి. రెండు వైపులా బాగా వేగిన ముక్కలను పేపర్ టవల్ లేదా మామూలు వస్త్రం మీద చల్లారేవరకూ ఉంచాలి. ఇవి చల్లారిన తర్వాత గాలి వెళ్ళని డబ్బాలో వేసుకోవాలి. అంతే కారం కాజాలు రెడీ. వేడివేడి అల్లంటీతో కలిపి తింటే ఆహా ఆ మజాయే వేరు అనిపిస్తుంది.

కొబ్బరి సమోసా



కావలసిన పదార్థాలు

జీడిపప్పు, బాదంపప్పు, పిస్తాపప్పు చిన్నగా కట్ చేసినవి ఒక కప్పు, కొబ్బరికాయ ఒకటి, పంచదార మూడు కప్పులు, మిల్క్‌మెయిడ్ ఒక కప్పు, యాలకుల పొడి టీ స్పూన్, మైదా పావుకిలో, నెయ్యి కప్పు, నూనె పావుకిలో

తయారీ విధానం

మైదాలో కొద్దిగా పంచదార పొడి, చిటికెడు ఉప్పు, టీ స్పూన్ నెయ్యి వేసి ముద్దలా కలిపి పక్కన పెట్టుకోవాలి. ఇప్పుడు కొబ్బరి కోరుకోవాలి. తరువాత స్టవ్ వెలిగించి ఒక గిన్నె పెట్టి దానిలో పంచదార, కొద్దిగా మిల్క్‌మెయిడ్ వేసి తీగపాకం పట్టాలి. పాకంలో కొబ్బరికోరు వేసి గట్టిపడేవరకూ కలుపుతూ ఉండాలి. గట్టిపడిన దానిలో యాలకుల పొడి వేసి కలిపి పక్కన పెట్టుకోవాలి. ఇందులో చిన్నగా కట్ చేసిన జీడిపప్పు, బాదం పప్పు, పిస్తాపప్పులు వేసి కలుపుకోవాలి. ముందుగా కలిపి ఉంచుకున్న మైదాపిండిని చిన్నచిన్న ఉండలుగా తీసుకుని చపాతీల్లా చేసుకోవాలి. దీనిని మధ్యకు కట్ చేసి ఒక ముక్కను సమోసాలా చుట్టి దానిలో కొబ్బరి మిశ్రమం పెట్టి మూసేయాలి. మొత్తం సమోసాలు చేసి పక్కన పెట్టుకున్నాక పొయ్యి మీద పాన్ పెట్టి నూనె పోసి కాగనివ్వాలి. ఇందులో సమోసాలు వేసి దోరగా వేయించి తీసి పంచదార తీగపాకంలో వేసి ఐదు నిముషాలు ఉంచి తీయాలి. అంతే తియ్యతియ్యని కొబ్బరి సమోసా రెడీ.



కొబ్బరి చకోడీలు

కావలసిన పదార్థాలు

బియ్యంపిండి రెండు కప్పులు, నీళ్ళు రెండు కప్పులు, తాజా కొబ్బరి ముప్పావు కప్పు, పెసరపప్పు ఒక టేబుల్ స్పూన్, కారం ఒకటి లేదా రెండు టీ స్పూన్‌లు, ఇంగువ చిటికెడు, ఉప్పు రుచికి సరిపడ, ఆయిల్ తగినంత.

తయారీ విధానం

పెసరపప్పును అరగంటపాటు నీళ్ళల్లో నానబెట్టాలి. తాజా కొబ్బరిలో కొద్దిగా నీళ్ళు పోసి మెత్తని చిక్కని పేస్ట్‌లా చేసుకోవాలి. పొయ్యి మీద నీళ్ళు పెట్టి అవి మరుగుతుండగా టేబుల్ స్పూన్ ఆయిల్, నానబెట్టిన పెసరపప్పు, ఇంగువ, కారం, ఉప్పు, కొబ్బరి పేస్ట్, బియ్యంపిండి వేసి బాగా కలుపుకోవాలి. దీనిని పొయ్యి మీద దించి చల్లారనివ్వాలి. అరచేతులకు కొద్దిగా ఆయిల్ రాసుకుని చల్లారిన ఈ పిండిని చిన్నచిన్న ఉండలుగా చేసుకోవాలి. ఈ ఉండలను మందంగా, పొడవైన ముక్కలుగా చేసుకుని రెండు చివరలు కలిపి గుండ్రంగా చకోడీల్లా చేసుకోవాలి. ఈ చకోడీలను తడి ఆరేవరకూ ఒక పక్కన పెట్టి ఉంచుకోవాలి. పొయ్యి మీద పాన్ పెట్టి డీప్ ఫ్రైకి సరిపడ ఆయిల్ వేసి బాగా కాగనివ్వాలి. నూనె కాగిన తర్వాత చకోడీలను అందులో వేసి వేయించుకోవాలి. ముదురు గోధుమ రంగు వచ్చేవరకూ వేయించుకోవాలి. వేగిన చకోడీలు చల్లారితే చాలు కొబ్బరి చకోడీలు రెడీ అయినట్టే. వీటిని తింటే చకోడీల్లో కొబ్బరి చకోడీల రుచే వేరయా అనాల్సిందే. గాలి చొరబడని డబ్బాలో పెట్టుకుంటే ఇవి ఎక్కువ రోజులు నిల్వ ఉంటాయి. తిన్నకొద్దీ తినాలనిపించే ఈ చకోడీలు ఈ సంక్రాంతికి మీరూ తయారుచేసి చూడండి.



పల్లి బూరెలు

కావలసిన పదార్థాలు

బియ్యం రెండు కప్పులు, మినపప్పు ఒక కప్పు, పంచదార లేదా బెల్లం రెండు టీ స్పూన్లు, ఉప్పు అర టీ స్పూన్. బూరె లోపల పూర్ణం కోసం వేరుశెనగపప్పు ఒక కప్పు, తెల్ల నువ్వులు నాలుగు టేబుల్ స్పూన్‌లు, బెల్లం తురుము ఒక కప్పు, కొబ్బరి తురుము అర కప్పు, యాలకుల పొడి ఒక టీ స్పూన్, ఆయిల్ డీప్ ఫ్రైకి సరిపడ

తయారీ విధానం

బియ్యం, మినపప్పు కడిగి ఐదారు గంటలు నానబెట్టాలి. తర్వాత ఆ నీటిని పారబోసి ఈ రెండింటిని మిక్సీ పట్టుకోవాలి. ఈ పిండి మరీ పలచగానూ ఉండకూడదు. అలాగని మరీ చిక్కగానూ ఉండ కూడదు. నీళ్ళు సరిపడ చూసి పోసుకోవాలి. ఈ పిండిలో రెండు టీ స్పూన్‌లు బెల్లం లేదా పంచదార, అర టీ స్పూన్ ఉప్పు కలుపు కోవాలి. అప్పుడు లోపల పూర్ణమే కాదు పైన పొర కూడా తియ్యతి య్యగా ఉంటుంది. ఈ పిండి పక్కన పెట్టుకోవాలి. పొయ్యి మీద పాన్ పెట్టి తక్కువ మంట మీద తెల్ల నువ్వులు వేసి వేయించు కోవాలి. లేత గోధుమరంగు వచ్చేవరకూ వాటిని వేయించాలి. వీటిని ప్లేట్‌లోకి తీసుకుని చల్లారనివ్వాలి. ఇదే పాన్‌లో మధ్యస్థాయి మంట మీద వేరుశెనగపప్పులు వేగించు కోవాలి. వేగిన తర్వాత పైన పొర తీసేసి తెల్ల నువ్వులు, వేరుశెనగలు కలిపి మిక్సీలో వేసి పొడి చేసుకోవాలి. ఇందులో కొబ్బరి తురుము, బెల్లం తురుము, యాలకుల పొడి వేసి మరోసారి మిక్సీ వేయండి. మొత్తం ఈ మిశ్రమాన్ని ఒక గిన్నెలోకి తీసుకుని చిన్నచిన్న ఉండలుగా చేసుకోండి. ఒక్కో ఉండను తీసుకుని ముందుగా సిద్ధం చేసి ఉంచుకున్న బియ్యం, మినపప్పు పిండిలో ముంచి తీసి ఆయిల్‌లో తక్కువ మంట మీద వేయించుకోవాలి. పాన్‌లో డీప్ ఫ్రైకి సరిపడ ఆయిల్ పోసి బాగా కాగిన తర్వాత మంట తగ్గించేసుకోవాలి. వేయించిన బూరెలను శుభ్రమైన పేపర్ లేదా వస్త్రం మీద వేసుకోవాలి. అదనపు నూనె అంతా పోతే చాలు. పల్లి బూరెలు రెడీ అయినట్టే. ఇంక ఎంచక్కా టేస్ట్ చేసేయవచ్చు. బూరెలు వేయగా పిండి మిగిలిపోతే అట్లు వేసేసుకోవచ్చు.

నేను - సుడిగుండం (నవల) 6

పి.చంద్రశేఖర్ ఆజాద్
సెల్: 92465 73575

నిన్నటి సంచిక తరువాయి

"అప్పుడప్పుడూ అనుకుంటాను. అన్నయ్య మనల్ని ఇక్కడికి తీసుకు రాకపోతే నీకు చదువు చెప్పించగలిగే దాన్ని కాదు. నువ్వు బడికి బదులు కూలి పనులకు వెళ్లేవాడివి. ఎవరైనా అడిగితే బాధ్యత తీసుకోరు. మా వదినలు ఎలాంటి వారో నాకు తెలుసు. నన్ను ఎలా చూసేవారో నాకు గుర్తుంది. అవన్నీ నేను పట్టించుకోను. చివరకి అమ్మమ్మని కూడా సరిగ్గా చూడలేదు. అలా చూస్తుంటే ఇంకొంత కాలం బతికేది" అన్నప్పుడు అమ్మ గొంతు జీరబోయింది.

నాకు కూడా దుఃఖం ముంచుకొచ్చింది. ముఖం పక్కకి తిప్పుకున్నాను. కొద్ది క్షణాల తర్వాత తనని తాను నిగ్రహించుకుంది. .

"నరసయ్య అన్నయ్యకి పెళ్లి జరిగినప్పుడు నా గురించి చెప్పాడు. వదిన బయట నుండి వచ్చింది. పిల్లలు పుట్టకముందు, పుట్టాక కూడా తులసికి ఎందుకు ఖర్చు పెడుతున్నావని ఒక్కసారి కూడా అన్నయ్యని అడగలేదు. నేను మంచి స్థితిలో వుంటే ఇలా చేసేదాన్నా అంటే చెప్పలేను"

అమ్మకేసి ఆశ్చర్యంగా చూసాను.

"అలాంటి గొప్ప మనుషుల నీడలో మనం బతుకుతున్నాం" అంది. 'బుల్లమ్మాయి గారూ' అని ఎవరో పిలవటంతో బయటకి వెళ్లింది.

అమ్మ ఆలోచనలు నన్ను విస్మయ పరుస్తుంటాయి. పైకి మౌనంగా కనిపిస్తుంది. మా తాత తనని ఎంత అల్లారు ముద్దుగా చూసుకున్నాడో గుర్తు చేసుకుంటుంది. ఓ మరణం కొందరి జీవితాల్ని తల్లకిందులు చేస్తుందనటానికి అమ్మ కూడా ఓ ఉదాహరణ.

అమ్మ లోపలకు వచ్చింది.

"వెన్నెల పుట్టినప్పుడు నీకు భార్య వచ్చింది అనుకున్నాను. అన్నయ్యతో కూడా అనలేదు. మనం వారికి తగం అని నాకు తెలుసు" అంటుంటే నాలో అహం



కదిలిందేమో!

"అలాంటి మాట అన్నయ్య వదినల నుండి రావాలి. వెన్నెలకి నువ్వంటే ఇష్టమని నాకు తెలుసు. చిన్నప్పటి ఇష్టాలు పెద్దయ్యాక వుంటాయనుకోవటం పొరపాటు. రేపు నీలానే చదువుల కోసం వెన్నెల బయటకు వెళ్తుంది. అక్కడ కొత్తవారు కలుస్తారు. అభిప్రాయాలు మారిపోతాయి. దానికి మంచి సంబంధం వస్తే మొదట నేను సంతోషపడతాను. మా అన్నయ్యల మీద కోపంతో నేను ఈ మాట అనటం లేదు. నా మేనకోడళ్ల కంటే మంచి సంబంధాలు అర్చనకీ, వెన్నెలకీ రావాలి. వాళ్లు డబ్బులకి యిబ్బంది పడే పరిస్థితి రాకూడదు" అంది.

అమ్మ ఇంకేం చెప్పదలుచుకుందా అని ఆలోచిస్తున్నాను.

"ఇంతగా ఎందుకు చెబుతున్నానంటే రేపటి నుంచి నీ పక్కన మేం వుండటం లేదు. ఒకరు ఎంత గొప్పవారయినా, చెడ్డవారయినా ఈ వయసులోనే మొదలవుతుంది. అందుకే జాగ్రత్తగా వుండాలి"

తలూపాను.

"నువ్వు వెన్నెలని చేసుకుంటావా అనేది ఇప్పుడు సమస్య కాదు. నిన్ను ఒకటి అడగనా?"

"అదేంటమ్మా అలా అంటావు. అడుగు"

"నువ్వు ఎవరినీ ప్రేమించటం లాంటిది చేయవద్దు. పెళ్లి ఆలోచన రానీయొద్దు. నువ్వు వెన్నెలని చేసుకుంటావని మావయ్య ఇవన్నీ చేయటం లేదు, అత్తయ్యా, వెన్నెల ఇష్టపడితేనే నువ్వు చేసుకుందువుగాని. వాళ్లు కాదన్నాక మనం బయటకు వెళ్లాలి. అప్పుడు నీ ఇష్టం. నువ్వు ఎవర్ని చేసుకున్నా నేను కాదనను. వచ్చే అమ్మాయికి నేను మీతో వుండటం ఇష్టం లేదంటే నేను విడిగా వుంటాను"

"ఎందుకమ్మా ఇలా మాట్లాడతావు. నాకు బాధే కాదు. నా మీద నమ్మకం నాకే పోతోంది" అన్నాను.

"నిజం ఎప్పుడూ నిష్ఠూరంగానే వుంటుంది. నేను చదువుకుంది తక్కువ. బతుకు ఎన్నో పాఠాలు నేర్పింది. అవసరమయినప్పుడే నేను మాట్లాడతాను. మా అన్నయ్యల ముందు నేను ఎప్పుడూ మాట్లాడలేదు. నీ దగ్గరే మాట్లాడగలను. నీ సంతోషం కోసం నేను మాట్లాడను. ఇంకోసారి ఇంత సేపు నీతో మాట్లాడే పనులు చేయకు. అంతవరకు నేను చెప్పదలుచుకున్నాను" అంది.

నేను ఇంక సాగదీయ దలుచుకోలేదు.

****

నేను అత్తయ్య దగ్గరకు వెళ్లాను.

"బాగా చదువుకో అల్లుడూ" అంది.

వెన్నెలా - అర్చనా - అమ్మ - మిత్రులు నాకు వీడ్కోలు చెప్పారు.

మావయ్య నాతో పాటు విశాఖ వచ్చాడు. ఫీజు కట్టాడు. హాస్టల్లో చేర్పించాడు. ఇంటికి వెళ్లబోయే ముందు మాట్లాడాడు.

"ఎప్పుడు డబ్బులు అవసరం వచ్చినా నాకు టెలిగ్రామ్ ఇవ్వు. ఏ విషయంలోనూ నువ్వు లోటు అనుకోవద్దు. నలుగురిలో నువ్వు తల దించుకోకూడదు. చదువు విషయంలో నువ్వు బాధ్యత లేకుండా వుంటావని నేను అనుకోను. అమ్మని చూడాలనిపిస్తే ఇంటికి రా. ఇదే కదా మొదటిసారి మా అందరికీ దూరంగా వుండటం, అమ్మ చేసినట్లు ఇక్కడ వంటకాలుండవు. అన్నిటికీ అలవాటు పడాలి. బాగా తిను. ఆరోగ్యం పాడవకుండా చూసుకో" అనీ 'వెళ్లిరానా' అన్నాడు. తలూపాను.

మావయ్య నడుస్తుంటే నాన్న వెళ్తున్నట్లు అనిపించింది.

"నాకీ చదువులు వద్దు. ఉద్యోగాలు వద్దు. మీ అందరు కావాలి" అని పరుగులు తీసుకుంటూ వెళ్లి మావయ్యని హత్తుకోవాలనిపించింది.

వెళ్తున్న వాడల్లా మావయ్య వెనక్కి తిరిగి వచ్చాడు.

"వారానికో ఉత్తరం రాస్తుండు. అమ్మకి అవే నీకు దూరంగా వున్నాననే బాధని తగ్గిస్తాయి" అన్నాడు.

"అలాగే మావయ్యా" అన్నాను.

నా కళ్లల్లోకి కొద్ది క్షణాలు చూసాడు. భుజం మీద చెయ్యి వేసి కొద్ది సేపు కళ్లు మూసుకున్నాడు.

ఆ తర్వాత వెళ్తున్నాడు. మధ్యలో వెనక్కి తిరిగి చూసి చేతులూపాడు. నేనూ చెయ్యి వూపాను. నా కళ్ల ముందు నుండి మావయ్య రూపం అదృశ్యమైంది.

నేను అక్కడున్న చెట్ల దగ్గరకు వెళ్లాను. చాలాసేపు అక్కడ వుండిపోయాను.

****

రెండో అధ్యాయం

యూనివర్సిటీలో నేను...

మొట్టమొదటిసారి సముద్రాన్ని చూసింది. విశాఖలోనే. ఎప్పటినుండో సముద్రాన్ని చూడాలని నాకు వుండేది. ఒడ్డున కూర్చుని అలా చూస్తుంటే నాకు భయం కలిగింది..

అనంతమైన జల రాసి. సంసారాన్ని సముద్రంతో పోలుస్తారు. ఉద్యమాలని పోలుస్తారు. ప్రేమని పోలుస్తారు. కొంతమంది విధ్వంసానికి ప్రతీకగా చూస్తారు. కవులు కావ్యాలు రాస్తారు. మామూలు జనం సముద్రం చెంతకు చేరి సేద తీరుతారు.

ఇప్పటివరకు నేను బతికిన బతుకు వేరు. పల్లె - పట్నం నుండి నగరానికి చేరుకున్నాను. ఇప్పటి నుండి సమూలమైన మార్పులు రాబోతున్నాయని నాకు అనిపిస్తోంది.

నరసయ్య మావయ్య దృష్టిలో తిరుపతిలో నన్ను చదివించాలని వుంది. కనీసం కావలిలో, అవన్నీ కుదరలేదు.

ఎవరు ఎప్పుడు ఎక్కడ వుండాలో అందరి విషయంలో మనుషులే నిర్ణయించలేరు. అదొక సంఘటన. రహస్యపు లోతుల్లోకి వెళ్లే సమయం కూడా వుండదు. ఎప్పటికయినా నా ఆత్మకథ రాసుకోవాలనీ అప్పుడే నాకు అనిపించింది.

అది ప్రపంచం కోసం కాదు. నా కోసం. ఇప్పటి వరకు నా మనసులో నిన్నటి జీవితం ముద్రించుకుని వుంది. ఇక నుండి అవన్నీ పుస్తకంలో రాయాలి.

నా బాల్యం - కౌమారంలో గుర్తుంచుకోదగ్గ ఎన్నో సంఘటనలు వున్నాయి. అవన్నీ ఉద్వేగాలకు చెందినవి. ఎక్కువ భాగం ఒకే రకంగా వుంటాయి. నా మిత్రుల్లో అనేక రకాల వారున్నారు.

అందులో ప్రతి ఒక్కరిదీ ఓ కథ!

అలాంటివన్నీ ప్రపంచానికి ఆదర్శం కాకపోవచ్చు. కానీ ఎవరికి వారు తమ గురించి తాము తెలుసుకోవటానికి ఉపకరిస్తాయి. మేధావులకి అందులోని అంశాలు అంతగా రుచించవు. ఈ జీవన పోరాటంలో తీరిక వున్నప్పుడు అవన్నీ గుర్తు చేసుకోవాలి. అదీ నా కోరిక.

రేఖామాత్రంగా కనిపించే అంశాలు విస్తృతంగా తరచి చూస్తే కొత్త అర్థాలు కనిపిస్తాయి. మనిషిని మించిన - మనసుని మించిన బెర్ముడా ట్రయాంగిల్ ఏముంటుంది. మన జీవితం గురించి ఇంకొకరు వ్యాఖ్యానించే కంటే మనమే మాట్లాడితే బాగుంటుంది.

జీవితం ఒక్కటే. సందర్భాలు వేరు. వ్యాఖ్యానాలు వేరు. అలాగే సిద్ధాంతం ఒకటే. అర్థం చేసుకోవటం - విశ్లేషించటం - ఆచరణ ఏ రంగంలో అయినా భిన్నంగా వుంటాయి.

నా తొలి యవ్వనపు రోజులు అంత ఉద్వేగంగా సాగలేదు. నా కుటుంబ నేపథ్యం - నా మిత్రులు - నేను చదువుకున్న ప్రాంతాలు అందుకు కారణం కావచ్చు.

నాకు ఈత వచ్చు. అయినా సముద్రం నాకు కొత్త. అందుకే నేను ఈదాలనుకోలేదు. అలలు నా కాళ్లను తడిపాయి. అలా కొత్త ప్రయాణం మొదలయింది.

****

నేను ముందు మావయ్యకి ఉత్తరం రాసాను. అందులోనే విడిగా అమ్మకు రాసి కవర్లో వుంచే ముందు చదువుకున్నాను.

(ఇంకా ఉంది)

రైల్వేలో మరోసారి కొలువుల జాతర



రైల్వేలో తాజాగా భారీ సంఖ్యలో జూనియర్ ఇంజనీర్‌లకు ఉద్యోగావకాశాలకు నోటిఫికేషన్ వెలువడింది. మరో రెండు రకాల పోస్టులు కూడా భర్తీ చేయనున్నారు. రైల్వే రిక్రూట్‌మెంట్ బోర్డు మొత్తం 13,487 పోస్టుల భర్తీకి నోటిఫికేషన్ విడుదల చేసింది. దీనిద్వారా జూనియర్ ఇంజనీర్, జూనియర్ ఇంజనీర్ (ఐటీ), డిపో మెటీరియల్ సూపరింటెండెంట్, కెమికల్ అండ్ మెటలర్జికల్ అసిస్టెంట్ పోస్టులను భర్తీ చేయబోతున్నారు.

ప్రకటించిన పోస్టులు :

జూనియర్ ఇంజినీర్- 12,844
జూనియర్ ఇంజినీర్ (ఐటీ)- 29
డిపో మెటీరియల్ సూపరింటెండెంట్- 227
కెమికల్ అండ్ మెటలర్జికల్ అసిస్టెంట్- 387

వీటికి 18 నుంచి 33 సంవత్సరాల లోపు ఉన్నవారు (01.01.2019 నాటికి) అర్హులు. రాతపరీక్ష తేదీలు ఇంకా విడుదల కాలేదు.

ఆన్‌లైన్ రిజిస్ట్రేషన్ జనవరి 2న మొదలై జనవరి 31కు ముగుస్తుంది.

❀ డిప్లొమా/ ఇంజినీరింగ్ డిగ్రీ పూర్తిచేసినవారు జూనియర్ ఇంజినీర్ పోస్టులకు అర్హులు.

❀ బీఎస్సీ (కంప్యూటర్ సైన్స్), బీసీఏ, బీటెక్ (సీఎస్ఈ/ఐటీ) అభ్యర్థులు జూనియర్ ఇంజినీర్ (ఐటీ) పోస్టులకు అర్హులు.

❀ ఏదైనా డిప్లొమా/ ఇంజినీరింగ్ డిగ్రీ పూర్తిచేసినవారు డిపో మెటీరియల్ సూపరింటెండెంట్ పోస్టులకు అర్హులు

❀ బ్యాచిలర్ డిగ్రీలో ఫిజిక్స్, కెమిస్ట్రీ సబ్జెక్టులు ఉన్నవారు కెమికల్ అండ్ మెటలర్జికల్ అసిస్టెంట్ పోస్టులకు అర్హులు.

సెంట్రల్ వాటర్ కమిషన్, సెంట్రల్ పబ్లిక్ వర్క్ డిపార్ట్‌మెంట్, మిలటరీ ఇంజినీరింగ్ సర్వీసెస్, వివిధ ప్రాజెక్టులు, డైరెక్టర్ జనరల్ బోర్డర్ రోడ్స్ ఆర్గనైజేషన్, నేషనల్ టెక్నికల్ రిసెర్చ్ ఆర్గనైజేషన్ వంటి సంస్థల్లో జూనియర్ ఇంజినీర్ పోస్టులో విధులు నిర్వర్తించాలి. రోజువారీ పనుల్లో కిందిస్థాయి ఉద్యోగుల పనితీరును గమనించాలి. వాటిని ప్రతిరోజూ రికార్డు చేసుకుని, తరువాతి పనిదినాల్లో చేయాల్సిన పనులను ఆయా సిబ్బందికి కేటాయించి, పనిలో పురోగతి ఉండేలా చూసుకోవాలి. కొత్త ప్రాజెక్టులు మొదలవుతుంటే వాటి

వేలాది పోస్టుల భర్తీకి నోటిఫికేషన్

ప్లానింగ్ లేదా ప్రస్తుతం ఉన్నవాటి రిపేర్లు, పునరుద్ధరణ వంటి కార్యకలాపాలను జూనియర్ ఇంజినీర్లు నిర్వహించాల్సి ఉంటుంది.

సీబీటీ-1 విభాగాలు, ప్రశ్నలు

మ్యాథమెటిక్స్ & అర్థమెటిక్	30 ప్రశ్నలు
జనరల్ ఇంటెలిజెన్స్ అండ్ రీజనింగ్	25 ప్రశ్నలు
జనరల్ అవేర్‌నెస్	15 ప్రశ్నలు
జనరల్ సైన్స్	30 ప్రశ్నలు

100 ప్రశ్నలకు జవాబుల రాయడం 90 నిముషాల్లో పూర్తిచేయాలి. సరైన సమాధానానికి ఒక మార్కు, తప్పు సమాధానం రాస్తే 1/3 వ వంతు మార్కు తగ్గిస్తారు.

సీబీటీ-2 విభాగాలు, ప్రశ్నలు

జనరల్ అవేర్‌నెస్	15 ప్రశ్నలు
ఫిజిక్స్ కెమిస్ట్రీ	15 ప్రశ్నలు
కంప్యూటర్ బేసిక్స్ అండ్ అప్లికేషన్	10 ప్రశ్నలు
బేసిక్ ఎన్విరాన్‌మెంట్ అండ్ పొల్యూషన్ కంట్రోల్	10 ప్రశ్నలు
టెక్నికల్ ఎబిలిటీస్	100 ప్రశ్నలు

ఈ పరీక్షలో 150 ప్రశ్నలను రెండు గంటల వ్యవధిలో పూర్తి చేయాలి. 150 మార్కులు కేటాయించారు. ప్రతి తప్పు సమాధానానికి 1/3 వంతు మైనస్ మార్కులున్నాయి.

జూనియర్ ఇంజినీర్ పోస్టులో చేరిన తరువాత పదోన్నతి ద్వారా ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ పోస్టు ఆ తరువాత సీనియర్ సెక్షన్ ఇంజనీర్ పోస్టులకు చేరవచ్చు.

జూనియర్ ఇంజనీరు పోస్టులో చేరినవారికి నెలకు రూ.35,000 జీతంతోపాటు అలవెన్సులు, అనేక సౌకర్యాలు లభిస్తాయి.

ఎంపిక ప్రక్రియ

కంప్యూటర్ ఆధారిత పరీక్ష (సీబీటీ)- 1, 2 పరీక్షలు రాయాలి. మొదటి పరీక్షలో అర్హత మార్కులు పొందినవారికి రెండో పరీక్ష నిర్వహిస్తారు. సీబీటీ-1 పరీక్ష అర్హత (క్వాలిఫైయింగ్) కోసం మాత్రమే. ఈ పరీక్షలో వచ్చే మార్కులు సీబీటీ-2కు అర్హత సాధించేందుకు అవసరం. ఫైనల్ మెరిట్ మార్కుల్లో సీబీటీ-1 మార్కులను పరిగణనలోకి తీసుకోరు.

సీబీటీ-2లోని మార్కుల ఆధారంగా మెడికల్ పరీక్షను కూడా విజయవంతంగా పూర్తిచేసినవారికి పోస్టులు కేటాయిస్తారు.



ఏ విభాగం ఎలా చదవాలి?

జనరల్ ఇంటెలిజెన్స్ : విభాగంలోని ప్రశ్నలు సులువుగా ఉంటాయి. సీటింగ్ అరేంజ్‌మెంట్, ఇన్‌పుట్-అవుట్‌పుట్, కోడింగ్-డీకోడింగ్, సిలాజిజం విభాగాల్లోని ప్రశ్నలకు సమాధానం గుర్తించాలంటే ఇంగ్లిష్ భాష మీద పట్టుండాలి. మిగిలిన అంశాలైన నంబర్లు, లెటర్లు, క్యాలెండర్, క్లాక్, నాన్‌వెర్బల్ సిరీస్, డైరెక్షన్స్ అంశాలు సులువుగా సమాధానాలు గుర్తించేలా ఉంటాయి. ఎక్కువ ప్రశ్నలు సాధన చేస్తే సమాధానాలను తక్కువ సమయంలో గుర్తించవచ్చు. ఈ విభాగంలోని ప్రశ్నలు నేరుగా అడిగేలా ఉంటాయి. కాబట్టి అందుబాటులో ఉన్న మెటీరియల్ నుంచి వీలైనన్ని ఎక్కువ ప్రశ్నలకు సమాధానాలు గుర్తించాలి.

అర్థమెటిక్ : బీటెక్ అభ్యర్థులు కొంతమేరకు సులువుగా చేయవచ్చు. డిప్లొమా వారు ఎక్కువ సమయం సన్నద్ధతకు కేటాయించాల్సి ఉంటుంది. సాధన చేస్తే కచ్చితమైన సమాధానాన్ని గుర్తించి మార్కులను పొందవచ్చు. ఆల్జీబ్రా, పాలినామియర్స్, వైశాల్యాలు, ఘనపరిమాణాలు ఫార్ములాలతో ముడిపడి ఉంటాయి. కాబట్టి, ఫార్ములాలను పట్టిక రూపంలో తయారు చేసుకుని, మననం చేయాలి. మిగిలిన అంశాలను రోజువారీ పనులతో ముడిపెట్టుకుంటూ సాధన చేయాలి. శాతాలు, నిష్పత్తి, వ్యాపార భాగస్వామ్యం, లాభనష్టాలు, చక్రవడ్డీ, బారువడ్డీ, కాలం-దూరం, కాలం-పని నుంచి ఎక్కువ ప్రశ్నలు వస్తాయి. పైచార్ట్, బార్ డయాగ్రమ్, లైన్‌గ్రాఫ్‌ల నుంచి 5 ప్రశ్నలు వస్తాయి.

జనరల్ అవేర్‌నెస్ : మంచి మార్కులు పొందాలంటే మెటీరియల్ తప్పనిసరి. కాబట్టి, తగిన దానిని ఎంచుకోవాలి. రైల్వే బడ్జెట్, నూతన రైలు మార్గాలు, ప్రాజెక్టులు, టెక్నాలజీ (రైల్వే), రైల్వే ఆవిష్కరణలు, ప్రమాదాలు-జాగ్రత్తలు మొదలైన వాటిపై శ్రద్ధపెట్టాలి. రైల్వే జోన్లు, స్కీమ్‌లు, రైల్వే-ఎకానమీ వంటి వాటినీ పరిగణనలోకి తీసుకోవాలి. కరెంట్ అఫైర్స్, జాగ్రఫీ, ఎకానమీ, పాలిటీ, జాతీయ, అంతర్జాతీయ ఈవెంట్లు, క్రీడలు, కేంద్ర ప్రభుత్వ పథకాల నుంచి ప్రశ్నలు వస్తాయి.

జనరల్ సైన్స్ : ఇంటర్‌లో చదువుకున్న అంశాల నుంచే ప్రశ్నలుంటాయి. ప్రశ్నల స్థాయి సాధారణంగా ఉంటుంది. రోజువారీ చర్యల్లో ఉండే సైన్స్‌ని పరీక్షించేలా ప్రశ్నలుంటాయి. ఫిజిక్స్, కెమిస్ట్రీ, బయాలజీ, జువాలజీ అంశాల నుంచి ప్రశ్నలు వస్తాయి.

పరీక్షకు తగ్గట్టుగా మెటీరియల్ సిద్ధం చేసుకుని, ఎక్కువ మాదిరి ప్రశ్నపత్రాలను సాధన చేస్తే మెరుగైన ఫలితాలను పొందవచ్చు.

టెక్నికల్ ఎబిలిటీ ప్రశ్నలు ఇంజినీరింగ్‌లోని ఎలక్ట్రానిక్స్, ఎలక్ట్రికల్, కంప్యూటర్స్, సివిల్, ఐటీ, కెమికల్, మెకానికల్, ఎన్విరాన్‌మెంట్, ఇంజినీరింగ్ డ్రాయింగ్, గ్రాఫిక్స్ నుంచి ఉంటాయి.

వైర్‌లెస్ కమ్యూనికేషన్, సిగ్నల్ సిస్టం, కంట్రోల్ సిస్టం, జంక్షన్స్, డయోడ్స్, అనలాగ్, డిజిటల్ సర్క్యూట్స్, ఎనర్జీ బ్యాండ్స్ ఎలక్ట్రానిక్స్ ఇంజినీరింగ్‌లో ముఖ్యమైన ప్రశ్నలు.

కంప్యూటర్ ఫండమెంటల్స్, ఎంఎస్ ఆఫీస్ షార్ట్‌కట్స్, డీబీఎంఎస్, ఆపరేటింగ్ సిస్టమ్స్, కంప్యూటర్ నెట్‌వర్క్స్, సాఫ్ట్‌వేర్ ఇంజినీరింగ్, సిస్టమ్ ప్రోగ్రామింగ్ విభాగాలు కంప్యూటర్ ఇంజినీరింగ్‌లో ముఖ్యమైనవి.

సబ్జెక్టు మీద కనీసావగాహన ఉండి, ప్రాథమిక అంశాలపై పట్టుంటే సమాధానాలను గుర్తించవచ్చు. పుస్తకాల ద్వారా నేర్చుకున్న పరిజ్ఞానానికి ప్రాక్టికల్ వినియోగం తెలిసుండాలి. అభ్యర్థులు ప్రొఫెషనల్ నాలెడ్జ్ అంశాలపై ఎక్కువ శ్రద్ధ చూపాలి. ఆ విధంగా పరీక్షకు గరిష్ఠస్థాయిలో సన్నద్ధమైతే రైల్వే జూనియర్ ఇంజినీర్ పోస్టులను చేజిక్కించుకోవచ్చు.

ఏపీపీఎస్సీ 169 గ్రూప్-1 పోస్టులకు నోటిఫికేషన్

ఆంధ్రప్రదేశ్‌లో వివిధ ప్రభుత్వ శాఖల్లో ఖాళీగా ఉన్న 169 గ్రూప్-1 సర్వీస్ పోస్టుల భర్తీకి రాష్ట్ర పబ్లిక్ సర్వీస్ కమిషన్ (ఏపీపీఎస్సీ) ప్రకటన విడుదల చేసింది.

పోస్టుల వివరాలు...

పోస్టులు : డిప్యూటీ కలెక్టర్, అసిస్టెంట్ కమిషనర్ ఆఫ్ స్టేట్ ట్యాక్స్, డిప్యూటీ సూపరింటెండెంట్ ఆఫ్ పోలీస్ (సివిల్), డిప్యూటీ సూపరింటెండెంట్ ఆఫ్ జైల్స్ (మెన్), డిస్ట్రిక్ట్ ఫైర్ ఆఫీసర్లు, అసిస్టెంట్ ట్రెజరీ ఆఫీసర్/ అసిస్టెంట్ అకౌంట్స్ ఆఫీసర్ **తదితర పోస్టులు...**



అర్హత : బ్యాచిలర్ డిగ్రీ ఉత్తీర్ణత. కొన్ని పోస్టులకు కమిషన్ నిర్దేశించిన ఇతర అర్హతలు ఉండాలి.

వయసు : 18-42 ఏళ్ల మధ్య ఉండాలి. రిజర్వేషన్ అభ్యర్థులకు సడలింపు ఉంటుంది.

ఎంపిక : ప్రిలిమినరీ ఎగ్జామ్, మెయిన్ ఎగ్జామ్, ఇంటర్వ్యూ ఆధారంగా.

ప్రిలిమినరీ పరీక్ష తేదీ : మార్చి 10, 2019.

మెయిన్ ఎగ్జామ్ తేదీ : 2019, జూన్ 10 నుంచి 22 వరకు.

దరఖాస్తు విధానం : ఆన్‌లైన్‌లో.

దరఖాస్తు ఫీజు : అప్లికేషన్ ప్రాసెసింగ్ ఫీజు రూ.250, ఎగ్జామ్ ఫీజు రూ.120 చెల్లించాలి.

దరఖాస్తు ప్రారంభతేదీ : జనవరి 7, 2019.

దరఖాస్తుకు చివరితేదీ : జనవరి 28, 2019.

ఫీజు చెల్లించుటకు చివరితేదీ : జనవరి 27, 2019.

పూర్తి వివరాలకు వెబ్‌సైట్ : https://psc.ap.gov.in

ఏపీపీఎస్సీ 446 గ్రూప్-2 పోస్టులకు నోటిఫికేషన్

ఆంధ్రప్రదేశ్‌లోని వివిధ ప్రభుత్వ శాఖల్లో ఖాళీగా ఉన్న 446 గ్రూప్-2 పోస్టుల భర్తీకి రాష్ట్ర పబ్లిక్ సర్వీస్ కమిషన్ (ఏపీపీఎస్సీ) ప్రకటన విడుదల చేసింది.

పోస్టులు : 446 (ఎగ్జిక్యూటివ్-154, నాన్ ఎగ్జిక్యూటివ్-292) అసిస్టెంట్ కమర్షియల్ ట్యాక్స్ ఆఫీసర్, డిప్యూటీ తహశీల్దార్, అసిస్టెంట్ లేబర్ ఆఫీసర్, అసిస్టెంట్ డెవలప్‌మెంట్ ఆఫీసర్, అసిస్టెంట్ సెక్షన్ ఆఫీసర్, సీనియర్ ఆడిటర్ తదితర పోస్టులు...

అర్హత : బ్యాచిలర్ డిగ్రీ ఉత్తీర్ణత. కొన్ని పోస్టులకు కమిషన్ నిర్దేశించిన ఇతర అర్హతలుండాలి.

వయసు : 18-42 ఏళ్ల మధ్య ఉండాలి. (ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ ఎస్సై పోస్టుకు 18-28 మధ్య ఉండాలి). రిజర్వేషన్ అభ్యర్థులకు సడలింపు ఉంటుంది.

ఎంపిక : రెండంచెల రాత పరీక్ష ద్వారా.

స్క్రీనింగ్ టెస్ట్ తేదీ : మే 5, 2019.

మెయిన్ ఎగ్జామ్ తేదీ : 2019 జులై 18, 19 తేదీల్లో.

దరఖాస్తు విధానం : ఆన్‌లైన్‌లో.

దరఖాస్తు ఫీజు : అప్లికేషన్ ప్రాసెసింగ్ ఫీజు రూ.250, ఎగ్జామ్ ఫీజు రూ.80 చెల్లించాలి.

దరఖాస్తు ప్రారంభతేదీ : జనవరి 10, 2019.


దరఖాస్తుకు చివరితేదీ : జనవరి 31, 2019.

ఫీజు చెల్లించుటకు చివరితేదీ : జనవరి 30, 2019.

వెబ్‌సైట్ : https://psc.ap.gov.in

సోషియాలజీ కోర్సులు పూర్తిచేసిన వారికి ఉద్యోగావకాశాలు

ఒక మనిషి వ్యవహారశైలిని సమాజానికి అనుగుణంగా తీర్చిదిద్దేందుకు అవసరమైన నైపుణ్యాలను అందించే సబ్జెక్టు సోషియాలజీ. రాష్ట్రంలోని దాదాపు అన్ని యూనివర్సిటీల్లోనూ బీఏలో సోషియాలజీ ఒక సబ్జెక్టుగా అందుబాటులో ఉంది. అంతేకాకుండా సోషియాలజీలో ఎంఏ, ఎంఫిల్, పీహెచ్‌డీ కోర్సులను కూడా ఆఫర్ చేస్తున్నాయి. జవహర్‌లాల్ నెహ్రూ యూనివర్సిటీ, యూనివర్సిటీ ఆఫ్ ఢిల్లీ, బెనారస్ హిందూ యూనివర్సిటీ తదితర ప్రముఖ విద్యాసంస్థలు, సెంట్రల్ యూనివర్సిటీలు పీజీ స్థాయిలో సోషియాలజీని అందిస్తున్నాయి. ఐఐటీలు కూడా సోషియాలజీని కోర్ సబ్జెక్టుగా లేదా ఇంటర్ డిసిప్లినరీ కోర్సుగా పలు స్థాయిల్లో (ఎంఏ, ఎంఫిల్, పీహెచ్‌డీ) అందుబాటులో ఉన్నాయి. సోషియాలజీలో ఉమెన్ డెవలప్‌మెంట్, రూరల్ డెవలప్‌మెంట్, ట్రైబల్ డెవలప్‌మెంట్ తదితర స్పెషలైజేషన్లలో రీసెర్చ్ చేయడం ద్వారా అద్భుత అవకాశాలను అందిపుచ్చుకోవచ్చు. సోషియాలజీ కోర్సు పూర్తిచేసిన వారు అకడమిక్ అండ్ రీసెర్చ్ సంస్థల్లో అధ్యాపకులుగా అవకాశాలను దక్కించుకోవచ్చు. స్వచ్ఛంద సంస్థలు, కార్పొరేట్ సంస్థల కార్పొరేట్ సోషల్ రెస్పాన్సిబిలిటీ (సీఎస్ఆర్) విభాగాల్లో, ప్రభుత్వ పథకాల్లో వివిధ హోదాల్లో అవకాశాలుంటాయి. ఆఫీస్‌లో వర్క్ ఫ్రెండ్లీ



ఎన్విరాన్‌మెంట్ కల్పించడం ద్వారా ఉద్యోగులతో మరింత ప్రభావవంతంగా పని చేయించుకునేందుకు ఎంఎన్‌సీలు కూడా సోషియాలజీ అభ్యర్థులను నియమించుకుంటున్నాయి. ప్రభుత్వాలు సామాజిక అభివృద్ధి కోణంలో విద్య, ఆహార భద్రత, ఆరోగ్యం తదితర విషయాల్లో వివిధ పథకాలను అమలు చేస్తున్నాయి. ఈ పథకాలు క్షేత్రస్థాయిలో లబ్ధిదారులకు సక్రమంగా అంది, సత్ఫలితాలు వచ్చేలా చేసే సుశిక్షితులైన నిపుణుల అవసరం ఉంది. ఈ క్రమంలో సోషియాలజీలో కోర్సులు పూర్తిచేసిన వారికి అవకాశాలు లభిస్తున్నాయి. ప్రారంభంలో నెలకు కనీసం రూ.20 వేల వేతనం ఖాయం. సోషియాలజీలో కోర్సులు పూర్తిచేసిన అభ్యర్థులు స్వయం ఉపాధి దిశగా ఆలోచించవచ్చు. ఫ్యామిలీ కౌన్సిలర్లుగా, కమ్యూనిటీ కౌన్సిలర్లుగా మారవచ్చు.

పోటీ పరీక్షల కోసం

కరెంట్ అఫైర్స్‌కు సన్నద్ధత ఇలా..

కరెంట్ అఫైర్స్‌పై పట్టు సాధించడానికి ముఖ్యంగా పత్రికలను ఉపయోగించుకోవాలి. అందులో వచ్చే ముఖ్యమైన అంశాలతో ప్రత్యేకంగా నోట్స్ రాసుకోవాలి. ఆయా అంశాలకు సంబంధించిన నేపథ్యం కూడా తెలుసుకోవాలి. దీనివల్ల ప్రశ్న ఏ విధంగా వచ్చినా, కచ్చిత సమాధానం గుర్తించేందుకు వీలవుతుంది.

కరెంట్ అఫైర్స్ అనగానే పరీక్షకు ముందు మార్కెట్లో దొరికే ఏదో ఒక పుస్తకం కొని, చదివితే సరిపోతుందనే భావన కొందరిలో ఉంటుంది. ఇది సరికాదు. కరెంట్ అఫైర్స్ అనేది కొన్ని మార్కులకు సంబంధించిన విభాగం కాదు. పరీక్ష మొత్తానికి దీనిపై అవగాహన ఉపయోగపడుతుందనే వాస్తవాన్ని గుర్తించాలి. అందువల్ల తప్పనిసరిగా రోజువారీ సన్నద్ధత అవసరం. పత్రికలతో పాటు ఒక ప్రామాణిక కరెంట్ అఫైర్స్ మ్యాగజైన్ చదివితే మంచిది. పరీక్షకు ముందు కనీసం ఆర్నెల్ల కరెంట్ అఫైర్స్‌ను చదవాలి.

పత్రికలను చదవడం వల్ల కరెంట్ అఫైర్స్‌పై పట్టుతో పాటు వివిధ విభాగాల (భౌగోళిక, ఆర్థిక, శాస్త్రసాంకేతిక తదితర)కు సంబంధించిన పదజాలంపై అవగాహన ఏర్పడుతుంది. ఇది ప్రిపరేషన్ సాఫీగా సాగేందుకు ఉపయోగపడుతుంది. అంతర్జాతీయ, జాతీయ, ప్రాంతీయంగా చోటుచేసుకునే ముఖ్య పరిణామాలపై అవగాహన పెంపొందించుకోవాలి.

విశాలాంధ్ర బిజినెస్

సెన్సెక్స్	నిఫ్టీ	బంగారం (విజయవాడ)	బంగారం (విశాఖపట్నం)	వెండి (విజయవాడ)	వెండి (విశాఖపట్నం)	డాలరు Vs రూపాయి
181.39 ▲	55.10 ▲	10 ▲	30,530	0 ◀◀	41,450	69.72
35,695.10	10,272.35	30,040	ప్రొద్దుటూరు 30,520	40,000	ప్రొద్దుటూరు 41,365	
		22 క్యారెట్లు, 10 గ్రాములు	22 క్యారెట్లు, 10 గ్రాములు	కిలో (రూపాయల్లో)	కిలో (రూపాయల్లో)	

టాప్ గెయినర్స్ (సెన్సెక్స్)

కంపెనీ	ప్రస్తుత ధర	మార్పు (శాతాల్లో)
భారతీ ఇన్‌ఫ్రాటెల్	285.05	4.95
ఎస్-బ్యాంక్	189.65	3.01
టాటామోటార్స్	170.95	2.95
భారతీ ఎయిర్‌టెల్	324.70	2.85
వేదాంత	194.45	2.63

టాప్ లూజర్స్ (సెన్సెక్స్)

కంపెనీ	ప్రస్తుత ధర	లాస్ (శాతాల్లో)
హెచ్‌సీఎల్ టెక్	932.35	-1.69
టెక్‌మహీంద్ర	681.10	-1.47
టీసీఎస్	1,876.85	-1.22
ఇన్ఫోసిస్	673.90	-1.21
హీరోమోటార్‌కార్ప్	3,045.00	-0.89

విదేశీమారకం విలువ (ఫారెక్స్)

కరెన్సీ	రూ.విలువ (క్రి.ముగింపు)	రూ.విలువ (ప్ర.ముగింపు)
డాలర్	70.19	69.72
యూరో	79.63	79.47
పౌండ్	88.16	88.26
ఆస్ట్రేలియా డాలర్	48.89	49.12
సింగపూర్ డాలర్	51.38	51.22

బులియన్

బంగారం (10 గ్రాములు)	22 క్యారెట్లు రూ.	24 క్యారెట్లు రూ.
హైదరాబాద్	30,480	32,598
చెన్నై	30,480	32,598
బెంగళూరు	29,950	32,032
ముంబై	31,280	33,454
విజయవాడ	30,040	33,000
విశాఖపట్నం	30,530	31,950
ప్రొద్దుటూరు	30,520	32,050
ముడి చమురు		47.09



'ఉల్లి'కి కనీస మద్దతు



- క్వింటాకు రూ.700 ధర
- ధర వ్యత్యాసం చెల్లింపునకు ప్రభుత్వం ఓకే
- సెంట్రల్ మార్కెట్ ఫండ్ నుంచి రూ.4 కోట్లు
- గతేడాది ఆగస్టు నుంచి చెల్లించాలని నిర్ణయం
- ఫిబ్రవరి వరకు ధర మద్దతు పథకం అమలు
- కర్నూలు జిల్లాకు మాత్రమేనని స్పష్టీకరణ

విశాలాంధ్ర సెంట్రల్ డెస్క్ - అమరావతి: ఉల్లి రైతుల కష్టాలపై ఎట్టకేలకు రాష్ట్ర ప్రభుత్వం స్పందించింది. దెబ్బతిన్న రైతులను ఆదుకునేందుకు ముందుకు వచ్చింది. నాలుగు నెలల క్రితమే వామపక్ష అనుబంధ రైతు సంఘాలు ఉల్లి రైతులను ఆదుకోవాలని కర్నూలు మార్కెట్ యార్డులో ఆందోళన చేశాయి. రైతుల దుస్థితిపై సీఎం చంద్రబాబుకు సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కె రామకృష్ణ లేఖ రాశారు. ఈ నేపథ్యంలో ఉల్లికి కనిష్టంగా క్వింటాకు రూ.700 ధర లభించేలా చర్యలు చేపట్టింది. అందులో భాగంగానే మద్దతు ధర పథకాన్ని (పీఎస్ఎస్) ప్రభుత్వం ప్రకటించింది. కర్నూలు మార్కెట్ యార్డులో క్వింటా ఉల్లికి రూ.700 కంటే తక్కువ ధర లభించిన రైతులకు వ్యత్యాసం మొత్తాన్ని చెల్లించాలని ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. గతేడాది ఆగస్టు ఒకటి నుంచి ఈ సంవత్సరం ఫిబ్రవరి 28 వరకు ఈ పథకం అమలులో ఉంటుందని వ్యవసాయశాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి బుడితి రాజశేఖర్ ఉత్తర్వుల్లో పేర్కొన్నారు. కర్నూలు వ్యవసాయ మార్కెట్ కమిటీలో ఈ పథకాన్ని అమలు చేయాలని ప్రభుత్వం నిర్ణయించింది. ఇందుకోసం ఈ పథకం కింద రూ.4 కోట్లను కేటాయించింది. కేంద్ర మార్కెట్ నిధి (సీఎంఎఫ్) నుంచి తొలి దశలో రూ.2 కోట్లు విడుదల చేయాలని మార్కెటింగ్‌శాఖ కమిషనర్‌కు సూచించింది. ఈ పథకాన్ని అమలు చేసేందుకు కర్నూలు జిల్లా కలెక్టర్ చైర్మన్‌గా కమిటీని ఏర్పాటు చేసింది. జాయింట్ కలెక్టర్ వైస్ చైర్మన్‌గా వ్యవహరించే కమిటీకి మార్కెటింగ్‌శాఖ అసిస్టెంట్ డైరెక్టర్ (ఏడీ) కన్వీనర్‌గా, ఉద్యానశాఖ ఏడీ, మార్కెట్ కమిటీ కార్యదర్శి సభ్యులుగా వ్యవహరించనున్నారు. ఉల్లికి కనీస ధర రూ.700 (క్వింటాకు) తక్కువగా పొందిన రైతులకు వ్యత్యాసం మొత్తాన్ని నేరుగా బ్యాంకు ఖాతాలో జమ చేసేలా కమిటీ చర్యలు చేపట్టాలని ప్రభుత్వం ఉత్తర్వుల్లో పేర్కొంది. రెవెన్యూ, ఉద్యానశాఖ సహకారంతో ఈ పథకాన్ని సమర్థంగా అమలు చేయాలని తెలిపింది. ఎకరాకు 6 నుంచి ఎనిమిది టన్నుల వరకు అనుమతించాలని తెలిపింది.

9 లక్షల క్వింటాళ్లకే...

ఉల్లి పంట అధికంగా ఉన్న కర్నూలు జిల్లాకు మాత్రమే పీఎస్ఎస్ పథకాన్ని అమలు చేయాలని ప్రభుత్వం ఉత్తర్వుల్లో పేర్కొంది. కర్నూలు మార్కెట్ కమిటీకి సుమారు 9 లక్షల క్వింటాళ్ల ఉల్లి వస్తుందని ప్రభుత్వం అంచనా వేసింది. గతంలో ఎకరాకు ఎనిమిది టన్నుల దిగుబడి రాగా, ఈ ఏడాది అది ఆరు టన్నులకు పడిపోయింది. కర్నూలులోనే పత్తికొండ మార్కెట్ యార్డుతోపాటు పశ్చిమ గోదావరి జిల్లా తాడేపల్లిగూడెం, కృష్ణాజిల్లా విజయవాడతోపాటు గుంటూరులోనూ ఉల్లి కొనుగోలు కేంద్రాలు ఉన్నాయి. ఇతర జిల్లాల్లోనూ కొంత సాగు విస్తీర్ణం ఉంది. అయితే, ఒక్క కర్నూలు వ్యవసాయ మార్కెట్ యార్డుకు వచ్చిన రైతులకే పీఎస్ఎస్ పథకాన్ని అమలు చేయాలని ప్రభుత్వం నిర్ణయించటంపై నిరసన వ్యక్తమవుతోంది. దీనికితోడు క్వింటాకు కనీసం రూ.వెయ్యి ధర ఉండేలా చర్యలు చేపట్టాలని రైతు సంఘాలు డిమాండు చేస్తున్నాయి.

వెంటాడిన కరవు

రాష్ట్రంలో కర్నూలు జిల్లాలోనే అత్యధికంగా ఉల్లి సాగు ఉంది. సాధారణంగా జిల్లాలో ఖరీఫ్‌లో 25 వేల హెక్టార్లలో రబీలో ఐదు వేల హెక్టార్లలో రైతులు ఉల్లిని సాగు చేస్తుంటారు. ఈసారి ఖరీఫ్, రబీ సీజన్‌లను కరవు వెంటాడటంతో సాగు విస్తీర్ణం కూడా పడిపోయింది. ఖరీఫ్‌లో 15,500 ఎకారాల్లో, రబీలో 3,500 ఎకరాల్లో ఉల్లి పంట వేశారు. అయితే, ఒక్కసారిగా ఉల్లి రైతులను కష్టాలు చుట్టుముట్టాయి. తీవ్ర వర్షాభావం వల్ల పంటలు దెబ్బతిన్నాయి. ఎకరాకు రూ.50 వేల వరకు ఖర్చవ్వగా, తగ్గిన దిగుబడి, ధర ఆశాజనకంగా లేకపోవటంతో రైతులు తీవ్రంగా నష్టపోయారు. వ్యాపారులు కూడా సిండికేటుగా మారటంతో కర్నూలు వ్యవసాయ మార్కెట్ యార్డులో క్వింటా ఉల్లికి రూ.200 నుంచి రూ.600 ధరే లభించింది. ఎకరాకు 40 క్వింటాళ్ల నుంచి 60 క్వింటాళ్ల దిగుబడి వచ్చింది. ఈ లెక్కన సగటున 50 క్వింటాళ్ల దిగుబడిని సాధించిన రైతుకు రూ.10 వేల నుంచి రూ.35 వేల ఆదాయమే లభిస్తుంది. పెట్టుబడి కంటే రూ.15 వేల నుంచి రూ.35 వేలు తక్కువగా వస్తుంది. హోల్‌సేల్ మార్కెట్‌లో రైతుకు మద్దతు ధరను చెల్లించటంలో ప్రభుత్వం వైఫల్యం చెందింది. అదే సమయంలో రిటైల్ మార్కెట్‌లో కేజీ ఉల్లి ధర రూ.15 నుంచి రూ.20గా ఉంది. ఈ నేపథ్యంలో రైతులను ఆదుకోవాలని వామపక్షాలు, రైతు సంఘాలు ప్రభుత్వాన్ని పలుమార్లు కోరాయి. నాలుగు నెలలుగా రైతులు నష్టాలను ఎదుర్కొంటుండగా, ఇప్పటికి ప్రభుత్వం స్పందించింది. పీఎస్ఎస్ పథకం ద్వారా రైతులను ఆదుకోవాలని నిర్ణయించింది. ప్రతి ఉల్లి రైతుకు క్వింటాకు రూ.700 ధర లభించేలా చర్యలు చేపట్టాలని ఆదేశాలు జారీ చేసింది.

నష్టాలకు బ్రేక్

181పాయింట్లతో దలాల్‌స్ట్రీట్



ముంబై: దలాల్ స్ట్రీట్ శుక్రవారం లాభాలతో ముగిసింది. రెండు రోజులు వరుస నష్టాలనుండి కోలుకుని సూచీలు లాభపడ్డాయి. ఉదయం లాభ నష్టా లతో ఒడిదొడుకులకు గురైనప్పటికీ తర్వాత కోలుకు న్నాయి. చివరి రెండు గంటల్లో కొనుగోళ్లు ఊపందుకోవ డంతో మార్కెట్లు ఈ వారాంతాన్ని లాభాలతో ముగిం చాయి. ఆరంభంలో సెన్సెక్స్ 70 పాయింట్లకు పైగా లాభపడగా.. నిఫ్టీ 10,700 పాయింట్ల వద్ద ప్రారంభ మైంది. బ్యాంకు, ఆటో స్టాక్స్ సానుకూలంగా నమోదుకా వడంతో అంతర్జాతీయ మార్కెట్లు కూడా లాభాల్లో నమోదయ్యాయి. ఐటిస్టాక్స్, ఇన్ఫోసిస్, టిసిఎస్,హెచ్‌సి ఎల్ టెక్ స్వల్ప లాభాలతో సరిపెట్టుకోవలసివచ్చింది. మన దేశంలో మదుపరులు కార్పొరేట్ ఫలితాల ప్రకటిం చనున్న నేపథ్యంలో కాస్త అప్రమత్తత పాటిస్తున్నట్లు తెలుస్తోంది. స్టేట్ రన్ బ్యాంకులు ర్యాలీ నమోదు చేసాయి. నిఫ్టీ పిఎస్‌యు బ్యాంకు ఇండెక్స్ 2శాతంపైగా లాభపడింది. బిఎస్‌ఇ సెక్టరల& సూచీల్లో , టెలికాం, బ్యాంకెక్స్ 0.9శాతం, 1.4శాతం లాభపడింది. ఐటి, టెక్, కన్స్యూమర్ డ్యూరబుల్స్,ఎఫ్ఎంసిజి, క్యాపిటల్ గూడ్స్ నష్టాల్లో నమోదయ్యాయి. బిఎస్‌ఇ సెన్సెక్స్ 181.39 పాయింట్లు లాభపడి 0.51శాతంతో 35,695.10 పాయింట్లకు చేరింది. నిఫ్టీ 55.1 పాయిం ట్ల లాభంతో 10,727.35 పాయింట్ల వద్ద ముగి సింది. డాలరుతో రూపాయి మారకం విలువ రూ.69.87వద్ద ట్రేడవుతోంది. బిఎస్‌ఇ మిడ్‌కాప్, స్మాల్‌కాప్ సూచీలు 0.48శాతం, 0.10శాతం నమోద య్యాయి. నేడు ఎన్ ఎస్‌ఈలో భారతి ఇన్‌ఫ్రాటెల్, వేదాంత, యస్ బ్యాంకు, టాటా మోటార్స్, భారతి ఎయి ర్‌టెల్ తదితర కంపెనీల షేర్లు లాభపడ్డాయి. హెచ్‌సీ ఎల్ టెక్, టెక్ మహీంద్రా, ఇన్ఫోసిస్, టీసీఎస్, హీరో మోటోకార్ప్ తదితర కంపె నీల షేర్లు నష్టపోయాయి. అంతర్జాతీయంగా యూరోపి యన్ స్టాక్స్, ఆసియా షేర్లు మిశ్రమంగా నమోద య్యాయి. చమురు ధరలు లాభాల్లో ముగిసాయి.

40వేలు దాటిన వెండి

న్యూఢిల్లీ: వెండి ధర పెరిగింది. వరుసగా నాలుగో రోజు ధర పెరగడంతో బులియన్ మార్కెట్లో కేజీ వెండి రూ. 40వేల మార్క్ దాటింది. శుక్రవారం ఒక్కరోజే రూ. 440 పెరిగి కేజీ వెండి ధర రూ. 40,140 పలికింది. పారిశ్రామిక వర్గాలు, నాణేల తయారీదారుల నుంచి డిమాండ్ ఊపందుకోవడంతో ధర పెరిగినట్లు మార్కెట్ వర్గాలు పేర్కొంటున్నాయి. బంగారం ధర మాత్రం కాస్త దిగొచ్చింది. డాలర్‌తో రూపాయి బలపడటంతో పాటు స్థానికంగా కొనుగోళ్లు తగ్గడంతో 10 గ్రాముల పసిడి ధర రూ. 145 తగ్గి రూ. 32,690గా ఉంది. గడిచిన మూడు రోజుల్లో బంగారం ధర రూ. 565 పెరిగింది. కాగా.. అంతర్జాతీయంగా ఈ లోహాల ధరలు స్వల్పంగా పెరిగాయి. న్యూయార్క్ మార్కెట్లో ఔన్సు బంగారం ధర 1293.61 డాలర్లు, ఔన్సు వెండి ధర 15.75 డాలర్లుగా ఉంది.

నష్టాల్లో 94 విమానాశ్రయాలు



న్యూఢిల్లీ: గడచిన ఆర్థిక సంవత్సరం (2017-18)లో భారతీయ విమాన ప్రాధికారిక సంస్థ (ఏఏఐ) నిర్వహణలోని 94 విమానాశ్రయాలు భారీగా నష్టాలను మూటగట్టుకున్నాయని ప్రభుత్వం వెల్లడించింది. 2017-18 ఆర్థిక సంవత్సరంలో ఏఏఐ నిర్వహణలో మొత్తం 129 విమానాశ్రయాలు ఉండగా అందులో 94 విమానాశ్రయాలు నష్టాలను ప్రకటించాయని పౌర విమానయాన శాఖ మంత్రి సురేశ్ ప్రభు తెలిపారు. సంబంధిత విమానాశ్రయాల కోసం వెచ్చించిన మొత్తాలకు అనుగుణంగా రాబడులను ఆర్జించక పోవటంతో నష్టాలను నమోదు చేసుకోవాల్సి వచ్చిందని ఆయన చెప్పారు. అయితే రాబడులను పెంచకోవటం, నష్టాలను తగ్గించుకునేందుకు అవసరమైన చర్యలను చేపడుతున్నట్లు ప్రభు పేర్కొన్నారు. విమానాశ్రయాల్లో దొంగతనం కేసుల తగ్గుముఖం పట్టాయని పౌర విమానయాన శాఖ సహాయ మంత్రి జయంత్ సిన్హా తెలిపారు. ఈ తరహా కేసులు 2016లో 64 ఉండగా, 2017లో 59కి, 2018లో 28 కేసులకు తగ్గిపోయాయని చెప్పారు. కాగా రిమోట్లీ పైలెటెడ్ ఎయిర్‌క్రాఫ్ట్ సిస్టమ్ (ఆర్‌పీఏఎస్) కోసం డైరెక్టరేట్ జనరల్ ఆఫ్ సివిల్ ఏవియేషన్ (డీజీసీఏ) ఇప్పటి వరకు ఎలాంటి ప్రత్యేక గుర్తింపు సంఖ్యను జారీ చేయలేదని ఆయన తెలిపారు. అలాగే డ్రోన్ ఆపరేటర్ల కోసం గత ఏడాది డిసెంబరు 1న డిజిటల్ స్కై పేరుతో రిజిస్ట్రేషన్ ప్రక్రియను ప్రారంభించినట్లు సిన్హా తెలిపారు. అదేవిధంగా మానవ రహిత విమాన ఆపరేటర్‌కు అనుమతిని మంజూరు చేయలేదని సిన్హా పేర్కొన్నారు.

విజ్ఞానం



నాలుక పరీక్షతో

ఆరోగ్యం అంచనా...

నాలుకను పరీక్షించి మనిషి ఆరోగ్యాన్ని అంచనా వేయవచ్చుననేది అందికీ తెలిసిందే...నోటిలోని నాలుక ఆరోగ్యంపై సరైన అవగాహన కల్పిస్తుంది. నాలుక రంగు అనేది మనిషి మనిషికీ తేడాఉంటుంది. కొంతమందిలో పింక్ రంగులో ఉండి చిన్న బంప్స్ మాదిరిగా ఉంటే వైరల్ ఇన్‌ఫెక్షన్ ఉన్నట్లు గుర్తించవచ్చు...నోటి రంగు మారినట్లు అనిపిస్తే మాత్రం దంతవైద్యునితో పరీక్ష చేయించడం మంచిదే.. నాలుకపై కొంత మందికి తెల్లపూతలాటా ఉంటుంది. ఫలితంగా వీరిలో నాలిక తడారిపోయిఉంటుంది. దీనికోసం వయసుతో సంబం ధింత మందులు వాడవలసిఉంటుంది. నోటిలో సలైవా తగ్గినట్ల యితే డెంట్ కావిటీలుఉన్నట్లు గురించవచ్చు...దీనికోసం వైద్యలు ఫ్లోరైడ్ అధికంఆ ఉన్న టూత్‌పేస్టు వినియోగించమని సూచి స్తారు. నాలుకపై తెల్లటిపూతలా ఉంటే ఇన్‌ఫ్లమేటరీ ఉన్నట్లు గుర్తించవచ్చు. ఈ కారణంగా గమ్స్ రెడ్‌గా ఉంటాయి. హెర్పస్, ఐరన్‌లోపంఉంటే మాత్రం నోటిలో అల్సర్లు ఏర్పడతాయి.

వార్తా పత్రికల్లో ఇడ్లీ, దోసెల ప్యాకింగ్ నిషేధం

జులై 1 నుంచి కొత్త నిబంధనలు



న్యూఢిల్లీ: ఇడ్లీ, దోసె, పూరీ, బజ్జీల వంటివి వార్తా పత్రికల్లో ప్యాక్ చేసి ఇస్తుంటారు. ఇకపై ఇలా కుదరదు.. ఆహార పదార్థాల ప్యాకింగ్‌కు వార్తా పత్రికలే కాదు పునర్వినియోగ ప్లాస్టిక్ కూడా జులై 1 నుంచి వినియోగించకూడదని ఆహార భద్రతా ప్రమాణాల సంస్థ (ఎఫ్ఎస్ఎస్ఏఐ) ఆదేశించింది. ఆహారం ప్యాకేజింగ్, నిల్వ, తీసుకెళ్లేందుకు కూడా పునర్వినియోగ ప్లాస్టిక్‌తో తయారయ్యే క్యారీబ్యాగ్‌లను వినియోగించ కూడదని పేర్కొంది. వార్తాపత్రికల తయారీకి వినియోగించే ఇంక్‌లు, డైల వల్ల క్యాన్సర్ సంభవించే ప్రమాదం ఉన్నందున, వీటిల్లో ఆహార పదార్థాలను ప్యాక్ చేసి ఇవ్వకూడదని తెలిపింది. ఆహార భద్రతా ప్రమాణాలను తదుపరి స్థాయికి తీసుకెళ్లేందుకు నూతన నిబంధనలు దోహద పడతాయని ఎఫ్ఎస్ఎస్ఏఐ ముఖ్య కార్యనిర్వహణాధికారి పవన్ అగర్వాల్ తెలిపారు. అసంఘటిత రంగంలో ఈ నిబంధనలు అమలు చేయడం కష్టమేనని, అందుకే ప్రజల్లో తగిన అవగాహన కల్పించేందుకు 2019 జులై 1 నుంచి అమలు చేయాలని నిర్ణయించినట్లు వెల్లడించారు. ఆహార పదార్థాలను సూక్ష్మజీవులు, రసాయనాలు, భౌతిక-వాతావరణ కాలుష్య ప్రభావం నుంచి రక్షించడమే లక్ష్యంగా ప్యాకేజ్ ఉండాలని, వేర్వేరు పదార్థాలకు భిన్న రకాలు అవసరమని పేర్కొన్నారు.

బాండ్ల రూపేణా జారీకి

ప్రభుత్వ సన్నాహాలు

7 బ్యాంకులకు రూ.28,629 కోట్లు

న్యూఢిల్లీ: మూలధన పునర్‌వ్యవస్థీకరణలో భాగంగా ఏడు ప్రభుత్వ రంగ బ్యాంకులకు ఆరు ప్రత్యేక బాండ్లను ప్రభుత్వం జారీ చేయనుంది. ఈ బాండ్ల మొత్తం విలువ రూ.28,629 కోట్లు కాగా.. 10 నుంచి 15 ఏళ్లలో వీటి గడువు తీరిపోతుంది. బదిలీకి వీలులేని ఈ బాండ్లకు చట్టబద్ధ ద్రవ్య నిష్పత్తి (ఎస్ఎల్ఆర్) నిబంధనలు వర్తించవని ప్రభుత్వం ఒక నోటిఫికేషన్‌లో వెల్లడించింది. బాండ్లు జారీ అయ్యే ఏడు పీఎస్‌యూల్లో బ్యాంక్ ఆఫ్ ఇండియా, బ్యాంక్ ఆఫ్ మహారాష్ట్ర, సెంట్రల్ బ్యాంక్ ఆఫ్ ఇండియా, ఓరియంటల్ బ్యాంక్ ఆఫ్ కామర్స్, సిండికేట్ బ్యాంక్, యూకో బ్యాంక్, యునైటెడ్ బ్యాంక్ ఉన్నాయి. అత్యధికంగా బ్యాంక్ ఆఫ్ ఇండియాకు రూ.10,086 కోట్ల విలువైన బాండ్లను కేటాయించనున్నారు. ఆ తర్వాతి ఓరియంటల్ బ్యాంక్ ఆఫ్ కామర్స్‌కు కూ.5500 కోట్ల వరకు జారీ చేయనున్నారు. ఈ బ్యాంకులకు ఏ రోజైతే నిధులు అందుతాయో ప్రత్యేక సెక్యూరిటీల జారీ తేదీ ఆ రోజే అవుతుందని ప్రభుత్వం పేర్కొంది.

పెట్టుబడుల స్వర్గధామం దుబాయ్

విశాలాంధ్ర బ్యూరో-హైదరాబాద్: ప్రపంచ ఇన్వెస్టర్లకు ముఖ్యంగా నిర్మాణ రంగంలో పెట్టుబడులు పెట్టాలని భావించేవారికి స్వర్గధామంగా దుబాయ్ నిలిచిందని డాన్యూబ్ వెల్లడించింది. ప్రస్తుత మార్కెటింగ్ ట్రెండ్స్‌ను బట్టి దుబాయ్‌లో పెట్టుబడులు సాలీనా 8 నుంచి 10 శాతం రాబడిని ఇస్తూ, ప్రపంచంలోనే శరవేగంగా వృద్ధి చెందుతున్నాయని సంస్థ వ్యవస్థాపక చైర్మన్ రిజ్వాన్ సాజన్ తెలిపారు. నిర్మాణ రంగంలో పెట్టుబడులకు దుబాయ్ అత్యంత అనుకూలమని తమ అధ్యయనంలో తేలినట్టు వెల్లడించారు.

మార్కెట్లోకి నోకియా 106 ఫోన్

విశాలాంధ్ర బ్యూరో-హైదరాబాద్: హెచ్ఎండీ గ్లోబల్ నూతన నోకియా ఫీచర్ ఫోన్ నోకియా 106 (2018)ను భారత మార్కెట్లోకి విడుదల చేసింది. దీనిధరను రూ.1299గా నిర్ణయించింది. ఇందులో 1.8 అంగుళాల డిస్‌ప్లే, 4ఎంబీ ర్యామ్, 4ఎంబీ ఇంటర్నల్ స్టోరేజ్, 2000 కాంటాక్టు, 500 ఎస్ఎంఎస్‌లను స్టోర్ చేసుకునే వీలుంది. 800 ఎంఏహెచ్ బ్యాటరీ సామర్థ్యం కలిగి ఉంది.

విస్తరణ బాటలో పీటర్ ఇంగ్లండ్

విశాలాంధ్ర బ్యూరో-హైదరాబాద్: ఆదిత్యబిర్లా ఫ్యాషన్ అండ్ రిటైల్ లిమిటెడ్‌కు చెందిన మెన్స్‌వేర్ బ్రాండ్ పీటర్ ఇంగ్లండ్ విస్తరణ ప్రణాళికలో భాగంగా ఎక్స్‌క్లూజివ్ స్టోర్‌ను ఏలూరులో ప్రారంభించింది. పవర్‌పేట సమీపంలో ఉన్న ఈ సరికొత్త స్టోర్‌లో స్మార్ట్ క్యాజువల్స్ మొదలు చికల్ ఫార్మల్స్ వరకూ వినూత్నమైన డిజైన్లు అందుబాటులో ఉన్నాయని సంస్థ సీఓఓ మనీష్ సింఘాల్ నేడొక ప్రకటనలో తెలిపారు. దాదాపు 1400 చదరపు అడుగుల విస్తీర్ణంలోనిఈ ఆకర్షణీయమైన ఔట్‌లెట్ అత్యుత్తమ ఫ్యాషన్ కేంద్రంగా యువతకు ప్రీమియం షాపింగ్ అనుభవాలను అందించనుందన్నారు.

రెండువేల నోట్లు బోలెడు..!

ఆర్థికశాఖ కార్యదర్శి సుభాష్ చంద్ర గార్గ్



న్యూఢిల్లీ: ప్రస్తుతం అవసరానికి మించి రూ.2వేల నోట్లు చలామణిలో ఉన్నాయని ఆర్థిక శాఖ కార్యదర్శి సుభాష్ చంద్ర గార్గ్ స్పష్టం చేశారు. రూ.2వేల నోట్ల ముద్రణ విషయంపై ఇంకా ఎటువంటి నిర్ణయం తీసుకోలేదని ఆయన శుక్రవారం వెల్లడించారు. నోట్ల ముద్రణను కనిష్ఠ స్థాయికి తీసుకు రానున్నట్లు వచ్చిన వార్తలపై ఆయన స్పష్టతనిచ్చారు. 'వ్యవస్థలో ప్రస్తుతం అవసరమైన దాని కంటే ఎక్కువ రూ.2వేల నోట్లు ఉన్నాయి. దాదాపు 35శాతం నోట్లు చలామణీలో ఉన్నాయి. రూ.2వేల నోట్ల ముద్రణకు సంబంధించి ప్రస్తుతం ఎటువంటి నిర్ణయం తీసుకో లేదు' అని ఆయన స్పష్టం చేశారు. అవసరాన్ని బట్టి నోట్ల ముద్రణ ఉంటుందని ఆయన పేర్కొన్నారు. రిజర్వు బ్యాంకు రూ.2000నోట్ల ముద్రణను కనిష్ఠ స్థాయికి తగ్గించిందని ఆర్థికశాఖ ఉన్నతాధికారి గురువారం వెల్లడించిన విషయం తెలిసిందే. దీంతో రూ.2వేల నోటు క్రమేణా కనుమరుగు కానుందని వార్తలు వచ్చాయి. చలామణీలో ఉన్న నగదుపై సమీక్ష జరిపిన కేంద్రం, ఆర్బీఐ ఏ మేరకు కొత్త నోట్లను ముద్రించాలన్న దానిపై తగిన నిర్ణయం తీసుకున్నట్లు తెలిపారు. ఇందులో భాగంగానే రూ.2వేల నోట్ల ముద్రణను తగ్గించినట్లు తెలిపారు. నవంబరు 8, 2016న రూ.1000, రూ.500 నోట్లను రద్దు చేస్తున్నట్లు ప్రధాని నరేంద్రమోదీ ప్రకటించిన విషయం తెలిసిందే. ఆ సమయంలో కొత్తగా రూ.2వేల నోటును ప్రవేశపెట్టారు.

విలీనంతో ఉద్యోగాలు పోవు




న్యూఢిల్లీ: ప్రభుత్వ రంగ బ్యాంకుల విలీనం వల్ల ఉద్యోగాల కోత ఉండబోదని కేంద్ర ఆర్థిక మంత్రి అరుణ్‌జైట్లీ తెలిపారు. ప్రభుత్వ రంగ బ్యాంకులైన దేనా బ్యాంకు, విజయా బ్యాంక్‌ను బ్యాంక్ ఆఫ్ బరోడాలో విలీనం చేసేందుకు కేంద్ర మంత్రివర్గం ఇటీవల ఆమోదం తెలిపింది. దీనిపై జైట్లీ నేడు లోక్‌సభలో మాట్లాడారు. బ్యాంకుల విలీనంతో స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా లాంటి అతిపెద్ద సంస్థ ఏర్పడుతుందని, అంతేగాక.. రుణ వ్యయం కూడా తగ్గుతుందని జైట్లీ అన్నారు. ఈ సందర్భంగా జైట్లీ మాట్లాడుతూ.. బ్యాంకు నిరర్థక ఆస్తులు తగ్గుతున్నాయని, రూ. 3లక్షల కోట్లను తిరిగి వ్యవస్థలోకి తెచ్చేందుకు దివాల చట్టం సాయపడిందన్నారు. ప్రభుత్వ రంగ బ్యాంకుల రీకాపిటలైజేషన్ కింద డిసెంబరు 31 నాటికి రూ. 51,533కోట్లను బ్యాంకులకు ఇచ్చినట్లు తెలిపారు. '2018-19 ఆర్థిక సంవత్సరం బడ్జెట్ అంచనాల్లో రూ. 65వేల కోట్లను ప్రభుత్వ రంగ బ్యాంకుల రికాపిటలైజేషన్ కోసం కేటాయించాం. ఇందులో డిసెంబరు 31 నాటికి రూ. 51,533 కోట్లను బ్యాంకులకు ఇచ్చాం. నిరర్థక ఆస్తులతో ప్రభుత్వ రంగ బ్యాంకులు నష్టాలను చవిచూస్తున్నాయి' అని జైట్లీ తెలిపారు. మొత్తం 21 ప్రభుత్వ రంగ బ్యాంకుల్లో 11 బ్యాంకులను తక్షణ దిద్దుబాటు చర్యల నియమావళి కిందకు తీసుకొచ్చినట్లు తెలిపారు.

మీ ఫోన్ పోతే చేయాల్సిన పనులివే..

ప్రస్తుత రోజుల్లో స్మార్ట్‌ఫోన్ అనేది ప్రతి ఒక్కరి జీవితంలో అత్యవసర పరికరం. వ్యక్తికి సంబంధించిన కీలక సమాచారం మొత్తం స్మార్ట్ ఫోన్‌లో భద్రపరుస్తున్నారు. బ్యాంకింగ్‌కి సంబంధించిన సమాచారం కానీ, నగదు లావాదేవీలకు సంబంధించి ఇంకా ఇతర అనేక పనులు ఈ స్మార్ట్ ఫోన్ ద్వారా నిర్వహిస్తున్నారు. ఇలా మన జీవితంలో కీలక పాత్ర పోషిస్తున్న స్మార్ట్ ఫోన్ ఉన్నంటుండి పోగొట్టుకుంటే ఇంకా అంతే సంగతి. కొన్ని సందర్భాల్లో వీటికి భారీ మూల్యం చెల్లించుకోవాల్సిం వస్తుంది. ఆండ్రాయిడ్, యాపిల్ వంటి స్మార్ట్‌ఫోన్‌లలో లేటెస్ట్ సెక్యూరిటీ ఫీచర్లను పొందుపరచటం వల్ల కొంతలో కొంత ఉపశమనంగా మీ ఫోన్‌లకు సంబంధించి ఆచూకీ తెలిసే అవకాశం ఉంటుంది. ఒక వేళా ఆండ్రాయిడ్ డివైస్ మేనేజర్ ద్వారా కూడా మీ ఫోన్ కనుగొనలేకపోతే ఈ టిప్స్ ద్వారా ఫోన్‌ను రికవర్ చేసి అందులో ఉన్న డేటాను ఎరేజ్ చేసి దాన్ని రిమోట్‌గా లాక్ చేయండి.

స్టెప్స్...

- మీ స్మార్ట్‌ఫోన్‌లో Android Device Manager యాప్‌ను ఇన్స్టాల్ చేయండి
- యాప్ ఓపెన్ చేసి మీరు ఉపయోగిస్తున్న డివైస్‌ను సెలెక్ట్ చేయండి
- secure device అనే ఆప్షన్‌ను ప్రెస్ చేయండి
- lock screen మెసేజ్‌తోపాటు ఫోన్ నెంబర్‌ను యాడ్ చేయండి



గూగుల్ అకౌంట్‌ను రిమోట్ విధానంలో...

ఈ విధంగా మీరు మీ ఫోన్ పోగొట్టుకున్నప్పుడు గూగుల్ అకౌంట్‌ను రిమోట్ విధానంలో నుండి లాగ్ అవుట్ చేసి దాని నుండి మొత్తం డేటాను ఎరేజ్ చేయగలుగుతారు. మీరు మీ డివైస్ లో గూగుల్ ప్లే సర్వీస్‌ను ప్రారంభించకపోతే, మీ ఫోన్‌లో యాప్‌ను ఉంచండి. మీ ఆండ్రాయిడ్ స్మార్ట్ ఫోన్ పోగొట్టుకుంటే మీరు ఏమి చేయాలి, దాన్నిఎలా లాగ్ అవుట్ చేయాలో మీ డేటాను ఎలా ఎరేజ్ చేయాలో ఈ స్టెప్స్ ఫాలో అయిపోండి...

స్టెప్స్...

- google.com/android/devicemanager లోకి వెళ్ళండి
- మీరు లాస్ట్‌లో ఉపయోగించిన డివైస్‌ను సెలెక్ట్ చేయండి
- మీరు మ్యాప్ ద్వారా మీ స్మార్ట్ ఫోన్ స్థానాన్ని చూడగలుగుతారు. మీరు ఇక్కడ ఉన్నట్లయితే, Play sound pi నొక్కండి. ఇది గట్టిగా రింగ్ చేస్తుంది అప్పుడు మీరు మీ డివైస్ కనుగొనగలరు.
- ఒక వేళ మీ ఫోన్ అపహరణకు గురైతే ' Secure Device ' ను ప్రెస్ చేసి మీ ఫోన్‌ను లాక్ చేయవచ్చు.
- మీ ఫోన్‌లో క్రెడిట్ కార్డు ఇన్ఫర్మేషన్ లేదా ఫొటోస్ వంటివి ఏమైనా ఉంటె ' Erase Device ' ను నొక్కి డేటా అంత ఎరేజ్ చేయండి.

ఫోన్‌ను ఒక్క చేత్తోనే ఆపరేట్ చేసే పద్ధతులివే..


ఇప్పుడొస్తున్న ఫోన్‌లన్నీ పొడవైన తెరలవే.. రెండు చేతుల్నీ వాడాల్సిన పరిస్థితి.. అనివార్యమై ఒంటి చేత్తో ఆపరేట్ చేయాల్సివస్తే.. కుదురుతుందా? ఈ చిట్కాల్ని వాడితే సరి. సింగిల్ హ్యాండ్‌తో చక చకా తెరని చుట్టేయొచ్చు.

ప్రత్యేక లాంచర్లు ఉన్నాయ్



ఫోన్‌లో నోటిఫికేషన్స్ చూడాలన్నా.. లాక్ చేయాలన్నా.. స్క్రీన్‌షాట్ తీసుకోవాలన్నా.. కచ్చితంగా రెండు చేతులకీ పని పెట్టాల్సిందే. అయితే, కొన్ని లాంచర్ యాప్స్‌ని వాడితే అంత కష్టం అక్కర్లేదు. సింపుల్‌గా సింగిల్ హ్యాండ్‌తోనే చేసేయొచ్చు. కావాలంటే మైక్రోసాఫ్ట్ లాంచర్ యాప్ ప్రయత్నించండి. ఆండ్రాయిడ్ యూజర్లు గూగుల్ ప్లే నుంచి పొందొచ్చు. ఇన్‌స్టాల్ చేశాక లాంచర్ సెట్టింగ్స్‌లో gestures పెట్టుకోవచ్చు. అంటే.. తెరని రెండు స్లార్లు తాకితే ఫోన్ లాక్ అయ్యేలా చేయొచ్చు. వేలితో పైకి స్వైప్ చేస్తే గూగుల్ సెర్చ్ ఓపెన్ అయ్యేలా సెట్ చేసుకోవచ్చు. ఇలా మీరు ఒంటి చేత్తో చేయాలనుకునే వాటిని సెట్ చేసుకునే వీలుంది. ఇదే మాదిరిగా 'నోవా లాంచర్' యాప్‌లోనూ చేయొచ్చు. అయితే, ప్రీమియం యాప్‌లో మాత్రమే కొన్ని ఆప్షన్స్‌ని ఎనేబుల్ చేయడం సాధ్యం అవుతుంది. ప్లే స్టోర్‌లో మరిన్ని థర్డ్‌పార్టీ యాప్‌లూ ఉన్నాయి.

బిల్ట్‌ఇన్‌గా కొన్ని



పొడవైన తాకేతెరలతో కూడిన ఫోన్‌లో పై భాగాన్ని ఒంటి చేత్తో అందుకోవడం కొంచెం కష్టమే. ఉదాహరణకు బ్రౌజర్‌లో అడ్రస్‌బార్ లేదంటే.. నోటిఫికేషన్స్. వీటిని ఇట్టే బొటనవేలికి అందేలా చేయొచ్చు. హాట్‌గా అందుబాటులోకి వచ్చిన సరికొత్త ఐఫోన్‌ల్లో ఈ సమస్యని అధిగమించేందుకు 'రీచబిలిటీ' సదుపాయం బిల్ట్‌ఇన్‌గా ఉంది. ఎనేబుల్ చేసేందుకు సెట్టింగ్స్‌లోని 'జనరల్' మెనూని చూడండి. దాంట్లోని 'యాక్సెసిబిలిటీ' మెనూలోకి వెళ్తే దాంట్లో రీచబిలిటీ ఆప్షన్ కనిపిస్తుంది. ఎనేబుల్ చేయండి. ఇకపై తెరని కిందికి స్వైప్ చేస్తే ఫోన్ భాగం కిందికి దిగుతుంది. దీంతో రెండో చేయి వాడాల్సిన అవసరం రాదు. ఇదే మాదిరి ఆండ్రాయిడ్‌లోనూ ప్రయత్నిద్దాం అనుకుంటే కొన్ని కంపెనీల స్మార్ట్‌ఫోన్‌ల్లోనే సాధ్యం. అన్ని ఫోన్‌ల్లో సాధ్యం అయ్యేలా చేయాలంటే 'వన్ హ్యాండ్ మోడ్' థర్డ్‌పార్టీ యాప్‌ని వాడాల్సిందే. యాపిల్ ఫోన్‌లోని రీచబిలిటీ ఆప్షన్ మాదిరిగానే ఇదీ పని చేస్తుంది.

'షార్ట్‌కట్' దార్లున్నాయి..

లాంచర్ యాప్‌లతో పని లేకుండా వేళ్లకి దగ్గరగా షార్ట్‌కట్ మెనూలను పెట్టుకుందాం అనుకుంటే అందుకు తగిన యాప్‌లు ప్లే స్టోర్‌లో సిద్ధంగా ఉన్నాయి. తెరపై మీకు అనువైన చోట సైడ్‌బార్‌లుగా వీటిని పెట్టుకోవచ్చు. 'స్వైప్ మాస్టర్, జెడ్‌స్వైప్, సర్కిల్ యాప్, ఓమ్నీ స్వైప్.. యాప్‌లు అందుకు ప్రత్యేకం. ఉదాహరణకు నిత్యం వాడే యాప్‌లను ఫోల్డర్లలోకి వెళ్లి సెలెక్ట్ చేయకుండా బొటనవేలి కొనకు అందుబాటులో ఉండేలా పెట్టుకునేందుకు 'ఓమ్నీస్వైప్' యాప్‌ని ప్రయత్నించొచ్చు. ఎక్కువగా వాడుతున్న యాప్‌లు ఆటోమాటిక్‌గా సైడ్‌బార్స్‌లో చేరిపోతాయి.

ఐఫోన్‌లో అదే 'బొట్టు'




ఐఫోన్ తెరలపై నిత్యం కనిపించే ఓ తెల్లని బొట్టు అదేనండీ.. టెక్నాలజీ పరిభాషలో దాన్ని 'అసిస్టివ్ టచ్' అని పిలుస్తారు. ఒంటి చేత్తో ఐఫోన్‌పై చక చకా పని ముగించేందుకు అదో చక్కని నావిగేషన్ టూల్. మరి, ఆండ్రాయిడ్‌లో అలాంటి బొట్టున్న ఫోన్‌లూ కొన్ని కనిపిస్తున్నాయి. మరి, మీ ఆండ్రాయిడ్ ఫోన్ సంగతేంటి? ఫోన్‌లోకి పిలిచేద్దాం అనుకుంటే ప్లే స్టోర్ నుంచి 'అసిస్టివ్ టచ్ ఫర్ ఆండ్రాయిడ్' యాప్‌ని ఇన్‌స్టాల్ చేయండి. సెట్టింగ్స్‌లోకి వెళ్లి యాప్‌కి అనుమతి ఇస్తే ప్రత్యేక టచ్ బటన్ వచ్చేస్తుంది. దాన్నుంచే ఫోన్‌ని లాక్ చేయొచ్చు. సెట్టింగ్స్‌ని క్షణాల్లో ఓపెన్ చేయొచ్చు. ఎక్కువగా వాడే యాప్‌లను ప్రత్యేక మెనూలో పెట్టుకోవచ్చు. టచ్ బటన్‌కి ప్రొఫైల్ పిక్‌ని పెట్టుకోవచ్చు కూడా.

గూగుల్ క్రోమ్ చిట్కా

ఇప్పటికీ మీరు వాడే గూగుల్ బ్రౌజర్ వెర్షన్ 65 లేదా అంతకంటే ముందు వెర్షన్ అయితే అడ్రస్‌బార్‌ని మీకు అనువుగా మార్చేయొచ్చు. డీఫాల్ట్ అడ్రస్‌బార్ బ్రౌజర్ పైభాగంలోనే ఉంటుంది. అలాంటప్పుడు పొడవైన ఫోన్‌ల్లో ఒంటి చేత్తో అడ్రస్‌ని టైప్ చేయడం కష్టమే. అలాంటప్పుడు అడ్రస్‌బార్‌ని తెర కిందికి తెచ్చుకోవచ్చు తెలుసా? అదెలాగంటే... అడ్రస్‌బార్‌లో chrome://flags టైప్ చేసి ఎంటర్ చేయండి. వచ్చిన ఆప్షన్స్‌లో 'క్రోమ్ హోం' ఆప్షన్‌ని ఎనేబుల్ చేసి బ్రౌజర్‌ని తిరిగి ఓపెన్ చేస్తే చాలు. అడ్రస్‌బార్ తెర కింది భాగంలో కనిపిస్తుంది.

ఒంటి చేతి యాప్‌లు

ఒపేరా టచ్




సులభమైన నావిగేషన్‌తో ఒంటి చేత్తో బ్రౌజింగ్ చేసేందుకు అనువైన బ్రౌజర్. అందుకు ప్రత్యేక యాక్షన్ బటన్లు ఉన్నాయి. ఫోన్ బ్రౌజర్ నుంచి డెస్క్‌టాప్ బ్రౌజర్‌కి క్షణాల్లో క్యూఆర్ కోడ్ ద్వారా కనెక్ట్ అవ్వొచ్చు.

సింపుల్ కంట్రోల్



ప్రత్యేక సైడ్‌బార్‌ని పెట్టుకుని కావాల్సిన యాప్‌లను ఇట్టే యాక్సెస్ చేయొచ్చు. తెరకు ఎటువైపు అయినా అమర్చుకోవచ్చు. తాకేతెరలో సమస్యలున్న వారికి యాప్ ఎంతో ప్రయోజనకరం.

జీబోర్డ్, స్విఫ్ట్‌కీబోర్డ్



సింగిల్ హ్యాండ్‌తో చకా చకా టైపింగ్ చేసేందుకు ఇవి అనువైనవి. అందుకు ప్రత్యేకంగా 'వన్ హ్యాండ్ మోడ్' ఉంది. జీబోర్డు కాకుంటే స్విఫ్ట్‌కీబోర్డ్‌ని వాడొచ్చు. కీబోర్డు పరిమాణాన్ని మీకు తగినట్టుగా మార్చుకునే వీలుంది.

స్మూజ్ (Smooz Browserz)



మునివేళ్లతో మాయ చేస్తూ బ్రౌజింగ్‌ని మరింత సులభం చేస్తుంది.

వాటేసుకున్న అందాల భామలు! వాటే సీన్!







ఆ అందగత్తెలు ఇద్దరికీ... మాజీ ప్రియుడు ఒకరే! అదే అసలు సమస్య! అయితే, ఒకప్పుడు ఇద్దరూ ఒకే అందగాడ్ని వాటేసుకున్నారు కానీ.. ఇప్పుడు ఒకర్నొకరు హగ్ చేసుకున్నారు! ఏంటి ఆ బాలీవుడ్ బ్యూటిఫుల్ హగ్ స్టోరీ ? దీపిక, రణబీర్.. ఈ జంట గురించి ఇప్పుడు చెప్పుకోటం అంత బాగోదు. కానీ వీరిద్దరూ ఒకప్పుడు బాలీవుడ్స్ హాట్ కపుల్! ఎక్కడ చూసినా ఆర్కే డీపీ అంటూ చర్చ జరిగేది. కానీ ఆ తరువాత ఏం జరిగిందో మనకు తెలిసిందేగా! దీపిక మెడపైన రణబీర్ టాటూ మిగిలిపోయింది కానీ... ఈ ఇద్దరి ప్రేమ చరిత్రలో కలిసిపోయింది. దీపూ, రణబీర్ మాజీలైపోయారు. ఆ తరువాత రణబీర్‌తో కత్రినా వ్యవహారం నడిపింది. సహజంగానే రొమాంటిక్ రోమియో అయిన రణబీర్.. జూలియట్ లాంటి కత్రీనాతో జూలు విదిలించి మరీ డేటింగ్ చేశాడు. అప్పుడు కూడా రణబీర్ పుణ్యమా అని కత్రీనా పేరు బీ-టౌన్‌లో మార్మోగిపోయింది. కత్రినా కైఫ్‌ని కాస్తా కత్రినా కపూర్ అనేదాకా వ్యవహారం చేదాటిపోయింది! దీపికతో రణబీర్ రిలేషన్ ఏమైందో... కత్రీనా తోనూ అతగాడి బంధం అదే అయింది! కత్రీనా, రణబీర్‌లు పెళ్లి కాకుండానే పెటాకులు చేసేసుకున్నారు. కానీ, రణబీర్‌తో కత్రీనా రొమాన్స్ ఒకే ఒక్క వ్యక్తికి అస్సలు నచ్చలేదు. ఆమే మన మస్తానీ దీపిక! మాజీ ప్రియుడితో క్యాట్ క్యూట్‌గా డేటింగ్ మొదలు పెట్టేసరికి దీపిక భగ్గుమంది. అప్పట్నుంచీ ఈ ఇద్దరు టాల్ బ్యూటీస్ మధ్య టాకింగ్స్ అస్సలు లేవు. ఎక్కడా కలిసి కనిపించే వారు కారు. అదే ఇంతకాలం కొనసాగింది. కానీ.. రణవీర్ సింగ్‌తో దీపిక పెళ్లి.. మొత్తం సీనంతా మార్చేసింది. ఇప్పుడు పతి, పత్నీ ఔర్ ఓ.. మంచి ఫ్రెండ్స్ అయిపోయారు! కత్రీనా మెరిసిపోయే చీరలో మురిసిపోతూ వచ్చి.. దీప్‌వీర్ రిసెప్షన్‌కి హాజరైంది కూడా! రణవీర్ సింగ్, దీపిక పెళ్లి తరువాత ముంబైలో ఇచ్చిన రిసెప్షన్‌లో కత్రినా స్పెషల్ అట్రాక్షన్‌గా నిలిచింది. అసలు ఆమెకు ఆహ్వానం అందదనే అంతా భావించారు. కానీ, రణవీర్ ప్రత్యేకంగా క్యాట్‌ని విందుకి పిలిచాడు. అయితే, దీపిక మాత్రం తన మాజీ ప్రియుడి... మాజీ ప్రియురాల్ని మన్నించిందా.. అనేది సస్పెన్స్ గానే మిగిలిపోయింది. రణవీర్ సింగే దానికి కూడా తెర దించేశాడు. ఈ మధ్య జరిగిన 'స్టార్ స్క్రీన్ అవార్డ్స్' ఫంక్షన్లో.. కత్రీనా ఎంటర్ కాగానే మనోడు ఉత్సాహంగా లేచి వెళ్లాడు. అంతే కాదు.. ఆమెను ఆప్యాయంగా హత్తుకుని భార్య దీపిక వద్దకు తీసుకొచ్చి మాటలు కలిపాడు. అంతే... ఇద్దరు హాట్ బాలీవుడ్ బేబ్స్.. హ్యాపీగా హగ్ చేసేసుకున్నారు! ఇప్పుడు వీరి ఈ వాటేసుకోవటం బాలీవుడ్ మొత్తం వాటే సీన్ అనేలా చేస్తోంది! ఇక మిగిలింది మిసెస్ దీపిక, మిస్ కత్రీనా ఇద్దరూ కలసి ఓ మంచి ట్రయాంగిల్ లవ్ స్టోరీ చేయటమే!

'రౌడీ బేబీ'.. అదరగొట్టింది!




ధనుష్, సాయిపల్లవి జంటగా నటించిన చిత్రం 'మారి 2'. బాలాజీ మోహన్ ఈ చిత్రానికి దర్శకత్వం వహించారు. డిసెంబరు 21న విడుదలైన ఈ సినిమా మంచి టాక్ అందుకుంది. బాక్సాఫీసు వద్ద చక్కటి వసూళ్లు రాబట్టినట్లు సినీ విశ్లేషకులు చెప్పారు. కాగా ఈ సినిమాలోని 'రౌడీ బేబీ' పాట వీడియోను చిత్ర బృందం విడుదల చేసింది. దీనికి యూట్యూబ్‌లో విశేషమైన స్పందన లభించింది. కేవలం రెండు గంటల్లో 10 లక్షల వ్యూస్, 10వేల లైక్‌లు పొందిన తొలి వీడియో పాట ఇదని చెబుతున్నారు. ఇప్పటి వరకు ఈ పాటను 1.09 కోట్ల మందికి పైగా చూశారు. అంతేకాదు దాదాపు 4 లక్షల మంది పాట నచ్చిందని లైక్ చేశారు. ఇది యూట్యూబ్ ట్రెండింగ్‌లో మూడో స్థానంలో ఉంది. సాయిపల్లవి స్టెప్పులు, హావభావాలు అద్భుతంగా ఉన్నాయని నెటిజన్లు కామెంట్లు చేశారు. ఈ పాటకు ప్రభుదేవా, జానీ, బాబా భాస్కర్ కొరియోగ్రఫీ అందించారు. యువన్ శంకర్ రాజా బాణీలు అందించారు. ధనుష్, ధీ పాటను ఆలపించారు. ఈ చిత్రాన్ని వండర్‌బార్ ఫిల్మ్స్ పతాకంపై ధనుష్ నిర్మించారు. శరత్‌కుమార్, కృష్ణ ఇందులో ప్రధాన పాత్రలు పోషించారు. సాయిపల్లవి ఇటీవల 'పడి పడి లేచె మనసు' సినిమాతో ప్రేక్షకుల ముందుకు వచ్చారు. శర్వానంద్ కథానాయకుడిగా హను రాఘవపూడి తెరకెక్కించిన ఈ సినిమా ప్రేక్షకుల ఆదరణ పొందింది. ప్రస్తుతం సాయిపల్లవి 'ఎన్జీకే' చిత్రంలో నటిస్తున్నారు. సూర్య ఇందులో కథానాయకుడు. మరోపక్క ఆమె మలయాళ చిత్రంలోనూ కథానాయిక పాత్ర పోషిస్తున్నారు. ఇందులో ఫాహద్ ఫాసిల్ కథానాయకుడు. రానా, సాయిపల్లవి ప్రధాన పాత్రల్లో ఓ సినిమా రాబోతున్నట్లు సమాచారం.

ఏఆర్ రెహ్మాన్ స్వరపరిచిన 'డింగ్ డాంగ్' సాంగ్ రిలీజ్



జీవీ ప్రకాష్ కుమార్, అపర్ణ బాలమురళి జంటగా నటిస్తున్న చిత్రం 'సర్వం తాళమయం'. రాజీవ్ మీనన్ దర్శకత్వంలో రూపొందుతున్న ఈ చిత్రానికి లతా మీనన్ నిర్మాతగా వ్యవహరిస్తున్నారు. ఈ చిత్రంలో నెడుముడి వేణు, వినీత్, సంత ధనంజయన్, కుమరవేల్, దివ్యదర్శిని, సుమేష్, అథిర తదితరులు కీలకపాత్రలు పోషిస్తున్నారు. ఈ చిత్రానికి ఏఆర్ రెహ్మాన్ సంగీతం అందించారు. ఈ చిత్రానికి సంబంధించిన 'డింగ్ డాంగ్' సాంగ్ నేడు చిత్రబృందం విడుదల చేసింది. దీనిని రెహ్మాన్ తన ట్విటర్ అకౌంట్ ద్వారా షేర్ చేశారు. గ్రామీణ నేపథ్యంలో సాగే ఈ పాట ప్రేక్షకులను ఆకట్టుకుంటుందనడంలో సందేహం లేదు.

'తస్సాదియ్యా'.. చెర్రీ డ్యాన్స్ ఇరగదీశాడయ్యా రామ..



మాస్ డైరెక్టర్ బోయపాటి శ్రీను దర్శకత్వంలో మెగా పవర్ స్టార్ రామ్ చరణ్ హీరోగా తెరకెక్కిన చిత్రం 'వినయ విధేయ రామ'. డీవీవీ ఎంటర్‌టైన్‌మెంట్స్ బ్యానర్‌పై డీవీవీ దానయ్య ఈ చిత్రాన్ని నిర్మించారు. ఈ సినిమాలో చెర్రీ సరసన కియారా అద్వాని హీరోయిన్‌గా నటించింది. బాలీవుడ్ ప్రముఖ నటుడు వివేక్ ఒబెరాయ్ ప్రతి నాయకుడిగా నటించారు. ఈ చిత్రానికి రాక్‌స్టార్ దేవిశ్రీ ప్రసాద్ సంగీతం అందించారు. ఈ చిత్రంలోని 'తస్సాదియ్యా' సాంగ్ ప్రోమోను చిత్రబృందం నేడు విడుదల చేసింది. ఈ సాంగ్‌లో చెర్రీ స్టెప్స్ ఇరగదీశాడు. ఈ సాంగ్ అభిమానులకు ఓ ట్రీట్ అని చెప్పవచ్చు.

హిందీలో మోడీ బయోపిక్ ఖరారు!





భారత ప్రధాని నరేంద్ర మోదీ జీవితాధారంగా బాలీవుడ్‌లో ఓ బయోపిక్ తెరకెక్కబోతోంది. ఈ బయోపిక్‌కు 'పీఎం నరేంద్రమోడీ' అనే టైటిల్‌ను ఖరారు చేశారు. ఇందులో రీల్ లైఫ్ మోదీ పాత్రలో బాలీవుడ్ నటుడు వివేక్ ఒబెరాయ్‌ను ఎంపికచేసుకున్నారు. ఈ చిత్రానికి ఒమంగ్ కుమార్ దర్శకత్వం వహించనున్నట్లు సినీ విశ్లేషకుడు తరణ్ ఆదర్శ్ ట్విటర్ ద్వారా ప్రకటించారు. 7న ఈ చిత్ర ఫస్ట్‌లుక్ పోస్టర్‌ను విడుదల చేయనున్నట్లు వెల్లడించారు.

15 నుంచి సినిమా చిత్రీకరణ ప్రారంభం కానుంది. ఇప్పటికే రాజకీయ నేతల జీవితాధారంగా బయోపిక్‌లు వరసకడుతున్నాయి. అలనాటి నటుడు, దివంగత ముఖ్యమంత్రి నందమూరి తారక రామారావు జీవితాధారంగా 'యన్‌టిఆర్' బయోపిక్ విడుదలకు సిద్ధమైంది. భారత మాజీ ప్రధాని మన్మోహన్ జీవితాధారంగా 'ది యాక్సిడెంటల్ ప్రైమ్ మినిస్టర్' చిత్రం త్వరలో విడుదల కానుంది. మరోపక్క దివంగత తమిళనాడు ముఖ్యమంత్రి జయలలిత జీవితాధారంగా 'ది ఐరన్ లేడీ' అనే బయోపిక్ తెరకెక్కుతోంది. బాలీవుడ్‌లో 'మేరీ కోమ్', 'సరబ్‌జీత్' లాంటి అద్భుతమైన బయోపిక్‌లను తెరకెక్కించిన ఒమంగ్ కుమార్ మోడీ సినిమాను తెరకెక్కిస్తుండడంతో సినిమాపై అంచనాలు పెరిగిపోయాయి.

కుప్పకూలిన భవనం : ఏడుగురి మృతి

న్యూఢిల్లీ : పశ్చిమ ఢిల్లీలో ఫ్యాక్టరీ భవనం ఒకటి కుప్పకూలడంతో ఒక బాలుడితోసహా ఏడుగురు మృతి చెందారు. సీలింగ్ ఫ్యాన్ల తయారీ సంస్థలో ఫర్నేస్ (కొలిమి)లో పేలుడు జరిగి, భవనంలో సగభాగం కుప్పకూలడంతో శుక్రవారం ఈ ఘటన జరిగిందని పోలీసులు వెల్లడించారు. మృతి చెందినవారిలో ఆరుగురిని గుర్తించారు. వారిలో రాంఫాల్ (45), అజయ్ (22), ముంగర్ (55), హంశు(6), అజయ్ ((25), రాజేష్ (40) ఉండగా, మరొకరిని గుర్తించాల్సి ఉందన్నారు. అంకిత్‌గుప్తా, గంగేష్, మున్నా, మంజు, సురేందర్, అశోక్, బచ్చాయ్‌లు గాయాలపాలైయ్యారు. వీరందరికీ దీన్‌దయాళ్ ఉపాధ్యాయ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నారని డిప్యూటీ కమిషనర్ మోనికా భరద్వాజ్ వెల్లడించారు. ఘటనాప్రాంతానికి నాలుగు అగ్నిమాపకదళాలతోపాటు, ఎనిమిది వాహనాలు చేరుకుని సహాయకార్యక్రమాలు అందించాయన్నారు. భవనంలో సగం మాత్రమే కూలినప్పటికీ మిగతాదికూడా కూలే అవకాశం ఉండటంతో మొత్తం భవనాన్ని కూల్చివేశారు. ఈ ఫ్యాక్టరీలో సీలింగ్ ఫ్యాన్ల తయారీ జరుగుతోంది. గాయాలపాలైన ఫ్యాక్టరీ యజమాని అంకిత్‌గుప్తాపై కేసునమోదు చేశామని అధికారులు వెల్లడించారు. సహాయకార్యక్రమాల్లో పాల్గొన్న ప్రత్యక్ష సాక్షి మనీష్ మాట్లాడుతూ భవనంలోని సగభాగం దెబ్బతిందని 15 మందిని కాపాడి ఆచార్య భిక్షు ఆసుపత్రికి తరలించామన్నారు. టీవీలో ఈ ఘటన దృశ్యాలు చూసి సహాయం అందించడానికి వెళ్లానని స్థానికుడు సురేంద్ర జైన్ తెలిపారు.

పోలీసులకు వీక్లీ ఆఫ్‌లు...!

ఎంపీ ప్రభుత్వం అమలు

భోపాల్: మధ్యప్రదేశ్‌లోని పోలీసులకు వారాంతపు సెలవు అవకాశం లభించింది. ఎన్నికల ప్రచారంలో ఇచ్చిన హామీ మేరకు సీఎం కమల్‌నాథ్ కొత్త సంవత్సరం సందర్భంగా ఈ నోటిఫికేషన్ జారీ చేశారు. ఇప్పటివరకు రాష్ట్ర పోలీసులకు ఏటా సాధారణ సెలవులు (సీఎల్), అనారోగ్యపు సెలవులు (ఎస్‌ఎల్), ఆర్జిత సెలవులు (ఈఎల్) మాత్రమే ఉండగా.. ఇక నుంచి ప్రతి పోలీసుకు కచ్చితంగా వారాంతపు సెలవు (వీక్లీ ఆఫ్) లభించనుంది. ఈ విషయాన్ని మధ్యప్రదేశ్ డీజీపీ రిషి కుమార్ శుక్లా ప్రకటించారు. రాష్ట్రంలోని అన్ని పోలీస్ స్టేషన్లలో విధులు నిర్వర్తిస్తున్న పోలీసులు సహా.. జిల్లాల్లోని ప్రత్యేక సాయుధ బలగాల యూనిట్లకు ఇది వర్తిస్తుందని వెల్లడించారు. దీనిపై స్పందించిన సీఎం కమల్‌నాథ్.. "మేం ఎన్నికల ప్రచారంలో ఇచ్చిన హామీని అమలు చేశాం. వారంలో ఒక రోజు సెలవును తమ కుటుంబానికి కేటాయిస్తారని ఆశిస్తున్నాం." అని ట్వీట్ చేశారు. ఈ వారాంతపు సెలవు తమలోని ఒత్తిడిని దూరం చేస్తుందని, వారానికోసారి తమ కుటుంబాలతో గడిపేందుకు ఇది చక్కని అవకాశమని పోలీసులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

బ్లూ ప్రింట్ లేదు..!

- అది అక్రమ గని
- 355 అడుగుల్లో కార్మికులు
- అందుకే ఇబ్బంది
- మేఘాలయ గనిపై సుప్రీంకు కేంద్రం వివరణ





న్యూఢిల్లీ : మేఘాలయలో అక్రమ బొగ్గు గనిలో చిక్కుకున్న 15 మంది కార్మికులను రక్షించేందుకు ఆపరేషన్ నిర్వహణలో అనేక ఇబ్బందులు ఎదురవుతున్నాయని కేంద్రం శుక్రవారం సుప్రీంకోర్టుకు తెలిపింది. 355 అడుగుల బొగ్గు గని బావికి సంబంధించి ఎటువంటి బ్లూ ప్రింట్ లేకపోవడమే ఇందుకు కారణమని పేర్కొంది. కాగా డిసెంబరు 13న ఈ బొగ్గు గనిలో కార్మికులు చిక్కుకున్నారు. ఒక నది సమీపంలో ఈ అక్రమ గని ఉందని, నీరు పోటెత్తడం వల్ల సహాయక చర్యలకు ప్రతిబంధకంగా మారిందని కేంద్ర ప్రభుత్వం వివరించింది. సహాయక ఆపరేషన్‌ను వేగవంతం చేసేందుకు తీసుకున్న చర్యల గురించి న్యాయమూర్తులు ఏకేసిక్రీ, ఎస్.అబ్దుల్‌నజీర్‌లతో కూడిన బెంచ్‌కు కేంద్రం తరఫున హాజరైన సొలిసిటర్ జనరల్ తుషార్ మెహతా తెలిపారు. సహాయక చర్యల్లో, పురోగతిపై ఒక స్థితి నివేదికను7న సమర్పించాల్సిందిగా కేంద్ర ప్రభుత్వానికి, ఇతర అధికార యంత్రాంగాన్ని సుప్రీంకోర్టు బెంచ్ ఆదేశించింది. బొగ్గు గనిలో గల్లంతైన 15 మంది కార్మికులను కాపాడటానికి జరుగుతున్న సహాయక చర్యలపై ఈనెల 3న సుప్రీం కోర్టు అసంతృప్తి వ్యక్తం చేసింది. ఇది జీవన్మరణ అంశమైనందున వారిని రక్షించేందుకు సమర్థవంతమైన, వేగవంతమైన సహాయక ఆపరేషన్ అవసరమని స్పష్టం చేసింది. కార్మికులను రక్షించేందుకు ప్రభుత్వం తీసుకుంటున్న చర్యలను శుక్రవారం తెలియజేయాలని సొలిసిటర్ జనరల్‌ను న్యాయస్థానం సూచించింది. మేఘాలయ తూర్పు జయంతియా హిల్స్ జిల్లాలో పూర్తిగా చెట్లతో నిండిన కొండపై ఉన్న ఈ బొగ్గు గనిలోకి సమీపంలోనిలిటిన్ నది నుంచి పెద్ద ఎత్తున వరద నీరు చేరడంతో 15 మంది కార్మికులు అందులో చిక్కుకున్నారు. బొగ్గు సేకరణ కోసం కార్మికులు ప్రవేశించేందుకు సాధారణంగా మూడు నుంచి నాలుగు అడుగుల ఎత్తులో ఇరుకైన సొరంగాలు తవ్వబడి ఉంటాయి. ఈ క్షితిజ సమాంతర సొరంగాలను 'ఎలుక రంధ్రాలు' అని అంటారు. ఇందులో కేవలం ఒక వ్యక్తి మాత్రమే సరిపోతారు. సొలిసిటర్ జనరల్ మాట్లాడుతూ జాతీయ విపత్తు నిర్వహణ దళం(ఎన్‌డీఆర్‌ఎఫ్)కు చెందిన అనేక మంది సభ్యులు గని ప్రాంతంలో పని చేస్తున్నారన్నారు. నీటి ప్రవాహం ఉన్న గని వద్దకు నావికాదళ సభ్యులను ప్రభుత్వం పంపిందని తెలిపారు. 'ఎన్‌డీఆర్‌ఎఫ్ సభ్యులు 72 మంది ఇప్పటికే ఉన్నా ఫలితం లేదు' అని బెంచ్ ప్రస్తావిస్తూ 'సైన్యం సాయం ఎందుకు తీసుకోలేదు? థాయ్‌లాండ్‌కు వాటర్ పంపులు పంపారని ఆయన(పిటిషనర్) చెప్పారు. ఆ పంపులను ఎందుకు ఇక్కడ వినియోగించలేదు అని కూడా' ప్రశ్నించింది. థాయ్‌లాండ్‌లో ఒక గుహలో ఫుట్‌బాల్ టీమ్ చిక్కుకున్న ప్పుడు వారిని రక్షించే ఆపరేషన్ నిర్వహణ కోసం 2018, జూన్-జూలైలో రాయల్ థాయ్ ప్రభుత్వానికి సాంకేతిక సహకారం అందించడంతోపాటు అధిక సామర్థ్యం కలిగిన వాటర్ పంపులను కిర్లోస్కర్ బ్రదర్స్ లిమిటెడ్(కేబీఎల్) ఆఫర్ చేసినట్లు పిటిషనర్ ఆదిత్య ఎన్ ప్రసాద్ తన వ్యాజ్యంలో పేర్కొన్నారు. థాయ్‌లాండ్‌కు విమానం ద్వారా మహారాష్ట్రలోని కిర్లోస్కర్‌వాడి ప్లాంటు నుంచి అధిక సామర్థ్యం కలిగిన ఆటోప్రైమ్ డీ-వాటరింగ్ పంపులు నాలుగింటిని కేబీఎల్ అప్పట్లో ఏర్పాటు చేసింది. కాగా 15 మందిని అత్యవసరంగా రక్షించాలంటూ దాఖలైన పిటిష న్‌ను వ్యతిరేకించడం లేదంటూ మెహతా పేర్కొన్నారు. అయితే సహాయ చర్యల్లో 72 మంది ఎన్‌డీఆర్‌ఎఫ్ సభ్యులతో పాటు నావికాదళం సిబ్బంది, కోల్ ఇండియా లిమిటెడ్, అగ్నిమాపక దళ సిబ్బంది కూడా పాల్గొంటు న్నట్లు ప్రభుత్వం తరపు న్యాయవాది వివరించారు. పిటిషనర్ తరపు సీనియర్ న్యాయవాది ఆనంద్ గ్రోవర్ మాట్లాడుతూ కార్మికులు ప్రమాదంలో చిక్కుకున్న గనికి అనుసంధానంగా ఉన్న మరో గని ద్వారా 25 హార్స్‌పవర్ పంపులను మాత్రమే వినియోగించి నీటిని తోడుతున్నట్లు బెంచ్‌కు తెలిపారు. 'గనులు, అటువంటి ఇతర పరిస్థితుల'లో సహాయక కార్యకలాపాలకు ఒక ప్రామాణిక సహాయక పద్ధతి(ఎస్‌ఓపీ)ని సన్నద్ధం చేసేలా కేంద్ర ప్రభుత్వాన్ని, ఇతర యంత్రాంగాన్ని ఆదేశించాలని కూడా పిటిషనర్ కోరారు. భారత సైన్యం, నావికాదళం, వైమానిక దళానికి చెందిన సాంకేతిక విభాగాల సేవలను వినియోగించుకోవడం ద్వారా కార్మికులను రక్షించాలని కూడా ఆదేశించాలని అభ్యర్థించారు.

రాఫెల్ స్కామ్‌పై క్రిమినల్ దర్యాప్తు

రాహుల్‌గాంధీ



న్యూఢిల్లీ : వచ్చే సార్వత్రిక ఎన్నికల్లో కాంగ్రెస్ అధికారంలోకి వస్తే రాఫెల్ ఒప్పందం వివాదంపై క్రిమినల్ దర్యాప్తునకు ఆదేశిస్తామని కాంగ్రెస్ అధ్యక్షుడు రాహుల్‌గాంధీ అన్నారు. శుక్రవారం పార్లమెంట్ ప్రాంగణంలో ఆయన మీడియాతో మాట్లాడారు. ఈ సందర్భంగా ప్రధాని మోడీ, కేంద్ర ప్రభుత్వంపై మరోసారి విమర్శల దాడి చేశారు. రాఫెల్ ఒప్పందంలో అనిల్ అంబానీకి చెందిన రిలయన్స్ డిఫెన్స్‌కే విదేశీ భాగస్వామ్యం ఇవ్వాలని భారత ప్రభుత్వం డసో ఏవియేషన్‌ను ఆదేశించినట్లు ఆ కంపెనీ అంతర్గత ఈ మెయిల్ల ద్వారా బహిర్గతమైంది. అయినప్పటికీ ప్రభుత్వం దీనిపై మాట్లాడట్లేదు. రాఫేల్ వివాదంపై కేంద్ర రక్షణమంత్రి నిర్మలా సీతారామన్ మాట్లాడాలని కాంగ్రెస్ సహా మొత్తం ప్రతిపక్షం కోరుకుంటోంది' అని రాహుల్ అన్నారు. మొన్నటి లోక్‌సభ సమావేశంలో అరుణ్‌జైట్లీ చాలా సేపు మాట్లాడారని, రాఫెల్‌పై ప్రశ్నలకు మాత్రం సమాధానం చెప్పలేదని రాహుల్ ఎద్దేవా చేశారు.రాఫెల్ చర్చకు భయపడి మోడీ దూరంగా వెళ్లిపోతున్నారని ఆరోపించారు. తాము అధికారంలోకి వస్తే ఈ వివాదంపై క్రిమినల్ దర్యాప్తునకు ఆదేశిస్తామని, నేరస్థులను శిక్షిస్తామని రాహుల్ స్పష్టం చేశారు. డసాల్ట్ కంపెనీ నుంచి 36 యుద్ధ విమానాలను కొనేందుకు ఒప్పందం కుదుర్చుకోవడానికి రక్షణ మంత్రిత్వ శాఖ అభ్యంతరాలు లేవనెత్తిందా? లేదా? విమానాల ధరను ఎవరు పెంచారు? చెప్పాలని నిలదీశారు. అంతకు ముందు కాంగ్రెస్ పార్టీ విడుదల చేసిన ఓ ప్రకటనలో రాఫెల్ ఒప్పందంపై రక్షణ మంత్రిత్వ శాఖ, న్యాయ మంత్రిత్వ శాఖ అభ్యంతరాలు వ్యక్తం చేసినట్లు తెలిపే ఫైల్ నోటింగ్స్‌ను విడుదల చేసిన సంగతి తెలిసిందే.

సస్పెన్షన్ ఎత్తివేయండి

స్పీకర్‌కు తంబిదురై విజ్ఞప్తి



న్యూఢిల్లీ : సభ్యుల సస్పెన్షన్‌ను ఎత్తివేయాల్సిందిగా లోక్‌సభ స్పీకర్ సుమిత్రా మహాజన్‌కు ఏఐఏడీఎంకే నాయకుడు, డిప్యూటీ స్పీకర్ ఎం.తంబిదురై విజ్ఞప్తి చేశారు. సభా కార్యకలాపాలకు పదేపదే అడ్డుతగులుతున్నందుకు టీడీపీ, ఏఐఏడీఎంకే సభ్యులను నాలుగు రోజులు సస్పెండ్ చేసిన విషయం విదితమే. సభలో అల్లరిని సహించేది లేదని సుమిత్రా మహాజన్ హెచ్చరించిన నేపథ్యంలో తంబిదురై జీరో అవర్‌లో ఈ అంశాన్ని ప్రస్తావించారు. వెల్‌లోకి రాబోమని హామీ తీసుకొని సభ్యులపై సస్పెన్షన్‌ను ఎత్తివేయాలని ఆయన కోరారు. పార్లమెంటు శీతాకాల సమావేశాలు ప్రారంభమైన నాటి నుంచి కావేరీ నదిపై డ్యామ్ నిర్మాణం, ఆంధ్రప్రదేశ్‌కు ప్రత్యేకహోదాపై ఏఐఏడీఎంకే, టీడీపీ సభ్యులు సభలో గందరగోళం సృష్టిస్తున్న విషయం విదితమే. 24 మంది అన్నా డీఎంకే సభ్యులను బుధవారం నుంచి ఐదు రోజులు, 21 మంది అన్నా డీఎంకే, టీడీపీ సభ్యులను గురువారం నుంచి నాలుగు రోజుల పాటు స్పీకర్ సస్పెండ్ చేశారు. 'మేడమ్ చర్య తీసుకునే హక్కు మీకు ఉంది. దాని పట్ల నాకు అభ్యంతరం లేదు. ఎలాంటి ఉల్లంఘనను సహించాల్సిన అవసరం లేదని నాకు తెలుసు. అదేసమయంలో తమ సమస్యలపై ఆందోళన చేసే అవకాశం సభ్యులకు ఉంటుంది. వారిని క్షమించండని మాత్రమే నేను కోరుతున్నా. ఇంకా ఈ సభ రెండు రోజులు మాత్రమే మిగిలి ఉంది' అని తంబిదురై వేడుకున్నారు. సభ్యులు వెల్‌లోకి రాకూడదన్న అంశాన్ని ఆయన అంగీకరించారు.

అయోధ్య కేసు 10కి వాయిదా...!

న్యూఢిల్లీ : అయోధ్యలోని రామ జన్మభూమి- బాబ్రీ మసీదు వివాదం కేసులో విశ్వహిందూ పరిషత్‌కు సుప్రీం కోర్టు ధర్మాసనం ఝలక్ ఇచ్చింది. ఈ కేసు విచారణను మళ్లీ వాయిదా వేసింది. ప్రధాన న్యాయమూర్తి రంజన్ గొగొయ్, జస్టిస్ ఎస్‌కే కౌల్‌తో కూడిన ధర్మాసనం ముందుకు ఈ కేసు పిటిషన్లు శుక్రవారం వచ్చాయి. ఈ కేసులో ఇరు పక్షాల వాదనలు వినకుండానే విచారణను జనవరి 10కి ధర్మాసనం వాయిదా వేసింది. ఈ కేసు విచారణ కనీసం 30 సెకన్లు కూడా సాగక పోవడం గమనార్హం. అయోధ్య కేసు విచారణ ప్రారంభం కాగానే.. 'ఈ కేసులో విచారణకు తేదీల ఖరారుపై ఈనెల 10న తగిన ధర్మాసనం ఆదేశాలు జారీ చేస్తుంది' అని చీఫ్ జస్టిస్ రంజన్ గొగొయ్ తెలిపారు. ఇరు పక్షాల తరఫున విచారణకు హాజరైన సీనియర్ న్యాయవాదులు హరీశ్ సాల్వే, రాజీవ్ ధవన్‌ల నుంచి ఎలాంటి వాదనలు వినకుండానే కోర్టు విచారణను వాయిదా వేసింది. రామ జన్మభూమి కేసా? అవునా? అయితే మా ఆదేశాలు వినండి.. దీనిపై తదుపరి ఆదేశాలను సంబంధిత ధర్మాసనం ఈ నెల 10న జారీ చేస్తుంది. మీరంతా ఆ రోజు రండి అని చీఫ్ జస్టిస్ గొగోయ్ చెప్పారు. చీఫ్ జస్టిస్‌గా రంజన్ గొగోయ్ వచ్చిన తర్వాత సోమ, శుక్రవారాల్లో వివిధ అంశాల్లో విచారణను ఇద్దరు సభ్యుల ధర్మాసనాలు చేపట్టాయి. ఈ వారం మొత్తం కోర్టులో ఇలాంటి విచారణలే జరిగాయి. దీంతో శుక్రవారం రామ జన్మభూమి కేసును వినకుండా.. వచ్చే గురువారం ముగ్గురు సభ్యుల ధర్మాసనం అందుబాటులో ఉండటంతో ఆ రోజుకు వాయిదా వేశారు. అయోధ్య వివాదంపై గతంలో దాఖలైన 4 సివిల్ పిటిషన్లపై అలహాబాద్ హైకోర్టు 2010లో తీర్పు ఇచ్చింది. మొత్తం 2.77 ఎకరాల వివాదాస్పద భూమిని సున్నీ వక్ఫ్‌బోర్డు, నిర్మోహి అఖాడా, రామ్‌లీల్లా సంస్థలకు సమానంగా పంచాలని పేర్కొంది. ఈ తీర్పును సవాల్ చేస్తూ సుప్రీంకోర్టులో 14 పిటిషన్లు దాఖలయ్యాయి. వీటిని స్వీకరించిన న్యాయస్థానం పిటిషన్లపై జనవరి మొదటి వారంలో తగిన ధర్మాసనం విచారణ చేపడుతుందని గతేడాది అక్టోబరు 29న నిర్ణయించింది. తాజాగా శుక్రవారం మరోసారి వాయిదా వేసింది.

కేరళపై బీజేపీ-ఆర్ఎస్ఎస్ 'సర్జికల్ స్ట్రైక్'



- సంఘ్‌పరివార్‌ది అంటరానితనం, క్రూరత్వ అజెండా
- ఆ ఇద్దరు మహిళలు సాధికారత, విముక్తి అంశాన్ని లేవనెత్తారు
- సామాజిక కార్యకర్త అగ్నివేష్

తిరువనంతపురం : సామాజిక కార్యకర్త స్వామి అగ్నివేష్ బీజేపీ-ఆర్ఎస్ఎస్‌లపై శుక్రవారం విమర్శలు చేశారు. శబరిమల ఆలయంలోకి మహిళల ప్రవేశానికి వ్యతిరేకంగా ఆర్ఎస్ఎస్ వర్గాలు కేరళలో హింసాత్మక నిరసనలు చేపట్టాయని, రాష్ట్రంపై సంఘ్‌పరివార్ 'సర్జికల్ స్ట్రైక్'గా ఆయన ఆరోపించారు. ఈనెల 2న అయ్యప్ప ఆలయంలోకి ప్రవేశించిన 40 ఏళ్ల మహిళలు బిందు, కనకదుర్గలను ఈ సందర్భంగా అగ్నివేష్ అభినందించారు. దేశంలో అణచివేతకు గురవుతున్న మహిళల విముక్తి, సాధికారత అంశాన్ని ఈ ఇద్దరు మహిళలు లేవనెత్తారన్నారు. సంఘ్‌పరివార్ ప్రకటించిన యుద్ధం రాష్ట్ర ప్రజా జీవితంపైన మాత్రమే కాదని, ప్రజలు, వారి ప్రజాస్వామ్య హక్కులపై కూడా అని ఒక ప్రకటనలో తెలిపారు. 'కేరళ మహిళలు ఒక చారిత్రక కార్యక్రమం ద్వారా తమ ఆగ్రహాన్ని వ్యక్తం చేశారు. మత ఛాందసవాద ఏజెంట్ల అంటరానితనానికి చికిత్స చేయాలనేది వారి నిర్ణయం' అని స్వామి అగ్నివేష్ వివరించారు. భారతదేశ హిందూత్వ దృష్టి సారాంశం ఇప్పుడు చాలా స్పష్టంగా ఉందని పేర్కొన్నారు. 'అభివృద్ధి దాని ఎర, దానికి క్రూరమైన అజెండా ఉంది. అది బహిరంగంగా నటిస్తోంది. అంటరానితనపు అభిప్రాయాన్ని కలిగి ఉంది' అని అన్నారు.

ప్రభుత్వానికి వ్యతిరేకంగా రథయాత్ర : శబరిమల కర్మ సమితి

కేరళ రాష్ట్రంలో హిందోన్మాదుల నిరసనలు, దాడులు పెచ్చుమీరాయి. ఆలయంలోకి మహిళల ప్రవేశంపై ఎల్‌డీఎఫ్ ప్రభుత్వానికి వ్యతిరేకంగా నిరసనలను ఉధృతం చేయాలని వేర్వేరు హిందూత్వ అనుకూల గ్రూపులకు చెందిన శబరిమల కర్మ సమితి, బీజేపీ నిర్ణయించాయి. ఆలయ సంప్రదాయాన్ని నాశనం చేసేందుకు సీపీఎం, రాడికల్ సంస్థల మధ్య అనుమానాస్పద సంబంధాలు ఉన్నాయంటూ గురువారం ఇక్కడ సమావేశమైన సమితి నాయకులు ఆరోపించారు. మావోయిస్టు గ్రూపు మద్దతుతో ఆలయంలోకి ఇద్దరి మహిళలు ప్రవేశించడంపై ఎన్ఐఏ దర్యాప్తు జరిపించాలని కోరారు. కొజికోడ్ జిల్లా, కోయిలండికి చెందిన సీపీఐ(ఎంఎల్) కార్యకర్త, కళాశాల అధ్యాపకురాలు అయిన బిందు(42), మల్లప్పురంలోని అంగడిపురానికి చెందిన పౌర సరఫరాల విభాగం ఉద్యోగిని కనకదుర్గ(44)లు బుధవారం తెల్లవారుజామున 3.38 గంటలకు శబరిమల అయ్యప్ప ఆలయంలోకి ప్రవేశించి స్వామి దర్శనం చేసుకున్నారు. కాగా కేరళ ప్రభుత్వానికి వ్యతిరేకంగా రాష్ట్ర వ్యాప్తంగా రథయాత్ర చేపడతామని, 100 జిల్లాల్లో ఇది కొనసాగుతుందని కర్మ సమితి నాయకుడు కుమార్ తెలిపారు. అలాగే ఈనెల 14న శబరిమలలో మకరవిలక్కు ఉత్సవం సందర్భంగా రాష్ట్రవ్యాప్తంగా 18 కోట్ల మకర జ్యోతులు వెలిగించనున్నట్లు చెప్పారు. 18న సెక్రటేరియట్‌కు ప్రదర్శన నిర్వహిస్తామన్నారు.

సుదూర రైళ్లకు ఆధునిక కోచ్‌లు..

ప్రభుత్వ యోచన



న్యూఢిల్లీ : దూరప్రయాణాలు సాగించే రైళ్లకు ఆధునిక హంగులు దిద్దే యోచనలో కేంద్రప్రభుత్వం ఉంది. ఈ మేరకు ఆయా రైళ్లలో ప్రస్తుతమున్న కన్వెన్షన్ కోచ్‌ల స్థానంలో ఆధునిక ఎల్‌హెచ్‌వీ (లింక్ హాఫ్‌మ్యాన్ బుష్ డిజైన్ చేసిన) కోచ్‌లను ప్రవేశపెట్టాలని భావిస్తోంది. గతవారంలో గువహటిలో జరిగిన రివ్యూ సమావేశంలో ఈ మేరకు నిర్ణయం జరిగినట్లు రైల్వేమంత్రి పియూష్ గోయల్ శుక్రవారం రాజ్యసభకు తెలిపారు. ఇది దశలవారీగా జరుగుతుందని అన్నారు. ప్రస్తుతానికి నార్త్ ఈస్ట్ ఫ్రంటియర్ రైల్వే పరిధిలోని 18 జతల రైళ్లలో ఎహెచ్‌బీ కోచ్‌లున్నట్లు రాతపూర్వకంగా వెల్లడించారు. ఎక్కువ మందిని తీసుకెళ్లే సామర్థ్యత, మంచి గతి, ఎక్కువ మన్నిక ఉండే కోచ్‌లను 2018-19 నుంచే ఇండియన్ రైల్వే తయారుచేస్తోందని చెప్పారు. ఈశాన్య రైళ్లలోని మోడ్రన్ కోచ్‌లను తొలగిస్తున్నారన్న ఫిర్యాదులపై స్పందిస్తూ 'అలా జరగదని హామీనిస్తున్నా' అని అన్నారు. కొత్త రైళ్లను ప్రవేశపెట్టేందుకు కేంద్రం కట్టుబడి ఉందని మంత్రి మరో ప్రశ్నకు సమాధానంగా చెప్పారు. మానవరహిత రైల్వే క్రాసింగులను దాదాపు తొలగించినట్టు గోయల్ తెలిపారు. తత్ఫలితంగా ప్రమాదాలు కూడా తగ్గాయన్నారు. 2014-15లో 52 ప్రమాదాలు జరగగా గత తొమ్మిది నెలల్లో మూడే జరిగాయని చెప్పారు. 2018, డిసెంబరు వరకు 3,451 మానవ రహిత రైల్వే క్రాసింగులను తొలగించినట్లు తెలిపారు. మరికొద్ది వారాల్లో ఇండియన్ రైల్వే బ్రాడ్ గేజ్ ట్రాకులపై మానవరహిత రైల్వేక్రాసింగులు కనిపించవని అన్నారు. రైల్వే తప్పుంటే బాధితులకు పరిహారం అందిందని, అతిక్రమణదారులకు పరిహారం ఇవ్వమన్నారు.

అమిత్‌షా ఇంటి ఎదుట

యూపీఎస్సీ అభ్యర్థుల ఆందోళన

న్యూఢిల్లీ : యూపీఎస్సీ అభ్యర్థులు బీజేపీ జాతీయ అధ్యక్షుడు అమిత్‌షా ఇంటి ఎదుట ఆందోళన చేపట్టారు. 2011 నుంచి 2015 మధ్య జరిగిన యూపీఎస్సీ పరీక్షల్లో చేపట్టిన మార్పులతో అవకాశాన్ని కోల్పోయిన వారికి మరొక అవకాశం ఇవ్వాలని వారు డిమాండు చేశారు. ఢిల్లీలోని లూటియన్స్ నివాసం వద్ద కొవ్వొత్తులు వెలిగించిన 52 మంది అభ్యర్థులు ఆందోళన నిర్వహించారు. శాంతియుతంగా ఈ నిరసన జరిగిందని పోలీసులు వెల్లడించారు. 2011 నుంచి 2014 వరకు జరిగిన పరీక్షల్లో ప్రాంతీయ భాషల్లో చదివిన విద్యార్థులు నష్టపోయారని, అరుణ్ ఎస్ నిగవేకర్ అధ్యక్షతన యూపీఎస్సీ స్వయంగా ఏర్పాటు చేసిన వార్షిక నివేదిక పేర్కొందని నిరసనకారులు తెలిపారు. ఆయా ఏడాదుల్లో జరిగిన పరీక్షల్లో సీశాట్ పరీక్షాపేపర్‌తో పోటీపరీక్ష నిర్వహించారని, దీంతో ప్రాంతీయ భాషల్లో చదివిన విద్యార్థులకు నష్టం కలిగిందని, ప్రభుత్వం తమకు న్యాయం చేయాలని వారు కోరారు.

ఢిల్లీ పీసీసీ చీఫ్ రాజీనామా..!

న్యూఢిల్లీ: ఢిల్లీ కాంగ్రెస్ అధ్యక్ష పదవికి అజయ్ మాకెన్ (54) రాజీనామా చేశారు. పార్టీ అధ్యక్షుడు రాహుల్‌గాంధీ ఆయన రాజీనామాను ఆమోదించినట్లుగా సమాచారం. అజయ్ మాకెన్ నాలుగేళ్లుగా ఢిల్లీ కాంగ్రెస్ అధ్యక్షుడి పనిచేశారు. ఆరోగ్య కారణాల రీత్యా రాజీనామా చేసినట్లుగా చెబుతున్నప్పటికీ కేంద్ర రాజకీయాల్లో ప్రధాన భూమిక పోషించేందుకు అదేవిధంగా లోక్‌సభ ఎన్నికల్లో పోటీ చేసే నిమిత్తం రాజీనామా చేసినట్లుగా సమాచారం. ఇంతకాలం తనకు సహకరించిన పార్టీ అధ్యక్షుడు రాహుల్‌గాంధీకి, కార్యకర్తలకు, మీడియాకు ఆయన ట్విట్టర్ ద్వారా కృతజ్ఞతలు తెలిపారు. ఢిల్లీ కాంగ్రెస్ ఇన్‌చార్జి పీసీ చాకో, అజయ్ మాకెన్, రాహుల్ గాంధీ గురువారం రాత్రి భేటీ అయ్యారు. ఈ సందర్భంగా అజయ్ రాజీనామాను రాహుల్ గాంధీ ఆమోదించినట్లు తెలుస్తోంది. 2019లో ఆప్‌తో కలిసి పోటీ చేయాలని కాంగ్రెస్ భావిస్తోంది. ఇప్పటికే ఢిల్లీలో ఆప్‌ను అజయ్ మాకెన్ తీవ్రంగా వ్యతిరేకిస్తున్నారు. దీంతో రెండు పార్టీల మధ్య సయోధ్యకు ఇబ్బంది తప్పదనే అజయ్‌తో రాజీనామా చేయించారని మరో సమాచారం. కాంగ్రెస్‌తో పొత్తుపై జరుగుతున్న ప్రచారాన్ని ఆప్ కూడా ఖండించలేదు. అజయ్ స్థానంలో మాజీ సీఎం షీలా దీక్షిత్‌ను నియమించే అవకాశం ఉన్నట్టు తెలుస్తోంది. ఢిల్లీ కాంగ్రెస్ చీఫ్ పదవికి కాంగ్రెస్ నేతలు యోగానంద శాస్త్రి, రాజ్‌కుమార్ చౌహాన్, హరూన్ యూసఫ్, చతర్ సింగ్ పేర్లు పరిశీలనలో ఉన్నట్టు ప్రచారం జరుగుతోంది.

రైతులకు ఎరువుల సబ్సిడీపై నీతి ఆయోగ్ కమిటీ

రాజ్యసభలో మంత్రి ఇంద్రజిత్ సింగ్



న్యూఢిల్లీ : రైతులకు నేరుగా ఎరువుల సబ్సిడీ అందేలా నీతి ఆయోగ్ కమిటీని ఏర్పాటు చేసినట్టు రసాయనాలు, ఎరువుల శాఖ మంత్రి ఇంద్రజిత్ సింగ్ శుక్రవారం రాజ్యసభకు తెలిపారు. ప్రశ్నోత్తరాల సమయంలో మంత్రి మాట్లాడుతూ రైతులకు నేరుగా సబ్సిడీ అందించడమే ఈ కమిటీ లక్ష్యమని అన్నారు. డైరెక్ట్ బెనిఫిట్ ట్రాన్స్‌ఫర్ (డీబీటీ) ప్రక్రియలో మార్పుపై ప్రశ్నకు మంత్రి స్పందిస్తూ '2016లో సబ్సిడీ విధానాన్ని ప్రయోగాత్మకంగా అమలు చేశారు. 2 లక్షల సేల్‌పాయింట్ల ద్వారా 2018, మార్చి నుంచి తొలి దశ అమల్లోకి వచ్చింది. కమిటీ నివేదిక అందాక రెండో దశ మొదలవుతుంది' అని అన్నారు.

మమతకు మైనార్టీల షాక్...!

కోల్‌కతా: లోక్‌సభ ఎన్నికలకు ముందు తృణమూల్ అధినేత్రి మమతా బెనర్జీకి గట్టి ఎదురుదెబ్బ తగిలింది. ఆ పార్టీ నేతలు, కార్యకర్తలు పెద్ద ఎత్తున కాంగ్రెస్ పార్టీలో చేరుతున్నారు. మైనార్టీలు గురువారం పెద్ద ఎత్తున కాంగ్రెస్ పార్టీలో చేరారు. సుమారు 2000 మంది కాంగ్రెస్ కండువా కప్పుకోవడం.. కోల్‌కతాలో చర్చనీయాంశంగా మారింది. వీరిలో టీఎంసీ మైనార్టీ సెల్ ఉపాధ్యక్షుడు షకీల్ అన్సారీ కూడా ఉండటం విశేషం. బీజేపీ, సీపీఎం పార్టీల నుంచి మరో ఐదు వందల మంది కాంగ్రెస్ తీర్థం పుచ్చుకున్నారు. మైనార్టీల చేరికతో కాంగ్రెస్ పార్టీలో జోష్ వచ్చిందంటున్నారు రాజకీయ విశ్లేషకులు.

భద్రతపై రాజీ





మోడీ సర్కారుపై కాంగ్రెస్ ఆగ్రహం

న్యూఢిల్లీ : రాఫెల్ యుద్ధ విమానాల కొనుగోలు ఒప్పందంపై శుక్రవారం నరేంద్రమోడీ ప్రభుత్వం లక్ష్యంగా కాంగ్రెస్ విమర్శల వర్షం కురిపించింది. ఈ ఒప్పందంపై రక్షణ, న్యాయమంత్రిత్వశాఖ అభ్యంతరాలను ప్రధాని నరేంద్రమోడీ అసలు పట్టించుకోలేదని నిశితంగా విమర్శించింది. దీనివల్ల ఖజానాకు భారీ నష్టం వాటిల్లిందని, మోడీ ప్రభుత్వం జాతీయ భద్రతపై రాజీపడిందని నిందించింది. కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు గులాం నబీ ఆజాద్, మల్లికార్జున ఖర్గే, రణదీప్ సూర్జేవాలాలను ఆ పార్టీ రంగంలోకి దించింది. పార్లమెంటు బయట వారు మీడియాతో మాట్లాడుతూ రాఫెల్ ఒప్పందంపై రక్షణ, న్యాయమంత్రిత్వశాఖల అభ్యంతరాలను ప్రస్తావించారు. దీనికి సంబంధించి పూర్తి వాస్తవాలను పార్లమెంటులో వెల్లడించాలని, జేపీసీపై ప్రకటన చేయాలని ప్రధానమంత్రి, రక్షణమంత్రిని డిమాండు చేశారు. రాఫెల్ ఒప్పందంపై విచారణకు సంయుక్త పార్లమెంటరీ కమిటీ(జేపీసీ)ని ఏర్పాటు చేయాలన్న డిమాండును పునరుద్ఘాటించారు. పార్లమెంటులో ప్రభుత్వ సమాధానానికి ముందు ఆజాద్ విలేకరులతో మాట్లాడుతూ 'ఇప్పటికైనా ప్రధానమంత్రి, రక్షణమంత్రి పార్లమెంటుకు పూర్తి వాస్తవాలు చెబుతారా? రాఫెల్ కుంభకోణంపై దర్యాప్తుకు జేపీసీనే సరైనది' అని స్పష్టంచేశారు. జేపీసీ విచారణకు ప్రభుత్వం భయపడుతుందని ఖర్గే విమర్శించారు. ఒప్పందానికి సంబంధించిన ఫైళ్లను పరిశీలించడం ద్వారా వాస్తవాలు బయటికి వస్తాయని, ఇది జేపీసీ వల్లే సాధ్యమని పేర్కొన్నారు. తన వందిమాగధులు అరుణ్‌జైట్లీ, సుష్మా స్వరాజ్ లేదా రక్షణమంత్రి నిర్మలా సీతారామన్ ద్వారా మోడీ అబద్ధాలను కొనసాగిస్తున్నారని ఖర్గే ఆరోపించారు. మోడీ ఏది చెబితే దానికి 'అవును' అనే మంత్రులుగా జైట్లీ, సుష్మ, నిర్మల ఉన్నారని నిందించారు. మరోవైపు రాఫెల్ ఒప్పందంపై కాంగ్రెస్ ఆరోపణలను కేంద్ర ప్రభుత్వం కొట్టిపారేస్తోంది. యూపీఏ ఒప్పందం కన్నా తాము మరింత చౌకగా ఈ ఒప్పందాన్ని కుదుర్చుకున్నామని ఎదురుదాడి చేస్తోంది. రాఫెల్ ఒప్పందంలో చెండాలపు రహస్యాలు, అవినీతి, దుష్టత్వం ఉన్నాయని, ఈ ఒప్పందం కాపీలు గోవా ముఖ్యమంత్రి, మాజీ రక్షణమంత్రి మనోహర్ పారికర్ పడక గదిలో ఉన్నాయని కాంగ్రెస్ ఓ ప్రకటనలో విమర్శించింది. రాఫెల్ ఒప్పందంపై సంప్రదింపులు బృందం రికార్డు చేసిన అభ్యంతరాలను మోడీ పట్టించుకోలేదని చెప్పింది. ఉద్దేశపూర్వకంగా చేసిన తప్పుల కారణంగా ప్రభుత్వ ఖజానాకు భారీగా నష్టం వాటిల్లిందని తెలిపింది. జాతీయ భద్రతపై కేంద్రం రాజీపడిందని ఆరోపించింది. ఈ ఒప్పందానికి భద్రతపై కేబినెట్ కమిటీ ఆమోదం కూడా తీసుకోలేదని కాంగ్రెస్ నాయకులు విడుదల చేసిన సంయుక్త ప్రకటన నిందించింది. పారికర్ పడక గదిలో ఉన్న ఫైళ్లు ఏమిటో వెల్లడించాలని సూర్జేవాలా ప్రధానిని ప్రశ్నించారు. రాఫెల్ ఫైల్ సంప్రదింపుల కమిటీ అనేక ప్రశ్నలు లేవనెత్తడం సుస్పష్టమని వ్యాఖ్యానించారు. అయితే, ఈ ఫైల్‌ను మోడీ చెత్తబుట్టలో పడేశారని ఆరోపించారు.

రెండు కార్లను ఢీకొన్న ట్రక్

ఇద్దరు పిల్లలతోసహా నలుగురి మృతి

ముంబై : ముంబై- పూనే ఎక్స్‌ప్రెస్ రహదారిలో జరిగిన రోడ్డు ప్రమాదంలో నలుగురు వ్యక్తులు మృతి చెందగా, మరో ముగ్గురికి గాయాలయ్యాయి. ట్రక్ మలుపు తిరుగుతూ, ఎదురుగా వచ్చే రెండు కార్లపై పడటంతో ఈ ఘటన జరిగిందని పోలీసు అధికారి తెలిపారు. ఒక కారు 40 అడుగుల లోయలోపడిందని, దానిలోని ఇద్దరు మహిళలతోసహా నలుగురు మృతి చెందగా, మిగిలినవారు గాయాలపాలైయ్యారన్నారు. వారిలో ఇద్దరి పరిస్థితి విషమంగా ఉన్నట్లు పోలీసులు తెలిపారు.



యూరోపియన్ మార్కెట్‌కు ఆంధ్రా కూరగాయలు

విశాలాంధ్ర - నూజివీడు : రాష్ట్రం నుంచి మొదటిసారి యూరోపియన్ మార్కెట్‌కు కూరగాయల ఎగుమతులు ప్రారంభిస్తున్నట్లు ఉద్యానవనశాఖ కమిషనర్ చిరంజీవి చౌదరి పేర్కొన్నారు. కృష్ణాజిల్లా నూజివీడు వేపర్‌హీట్ ట్రీట్‌మెంట్ ప్లాంట్ నుంచి శుక్రవారం కూరగాయల ఎగుమతులను ఆయన ప్రారంభించారు. టీఎంఎస్ ఓవర్సీస్, ఎగ్జి ప్రైవేట్ లిమిటెడ్ కంపెనీ ద్వారా ప్రకాశం జిల్లా యర్రబాలెం గ్రామానికి చెందిన జి.ఇందీవర్, విజయనగరం జిల్లా కొమరాడకు చెందిన శివకుమార్‌రాజుకు చెందిన 800 కేజీల బెండకాయలను యూరోపియన్ దేశాలకు ఎగుమతులు చేశారు. ఈ సందర్భంగా చిరంజీవి చౌదరి మాట్లాడుతూ అమరావతి గ్రీన్స్ పేరుతో ఎగుమతులు ప్రారంభిస్తున్నట్లు తెలిపారు. యూరోపియన్ మార్కెట్‌కు ఎగుమతులు జరగాలంటే నాణ్యత అవసరమని, నాణ్యత కోసం రైతులకు ఏ మోతాదులో ఎరువులు, మందులు వాడాలో సూచనలు చేయడం ద్వారా పంటలను పండించారన్నారు. ఎగుమతి సరకును ఐటీసీ ల్యాబ్‌లో శాంపిల్స్ పరిశీలించి ఎగుమతులు చేస్తామన్నారు. ప్రస్తుతం వారికి ఏ క్వాలిటీ కావాలో అవి ఎగుమతి చేస్తున్నామని, రానున్న రోజుల్లో మరిన్ని ఎగుమతులు జరుగుతాయన్నారు. ప్రతిరోజు ఎగుమతులు ఉండేలా చేయాలన్నదే తమ లక్ష్యం అన్నారు. ఎగుమతుల్లో జీఎంఆర్ కార్గో సంస్థ సహకారం బాగుందన్నారు. ఈ ఏడాది మామిడి ఎగుమతులపై కూడా దృష్టి పెట్టనున్నామని, మన బంగినపల్లి మామిడికి జీఐ ట్యాగ్ వచ్చిందన్నారు. మామిడి నాణ్యత కోసం రైతులకు సూచనలు, సలహాలు ఇవ్వడానికి మామిడి పరిశోధనా కేంద్రం శాస్త్రవేత్తలు క్లస్టర్ల వారీగా రైతులకు సమావేశాలు ఏర్పాటు చేసి శిక్షణ ఇవ్వాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఉద్యాన శాఖ అధికారులు, ఎగుమతిదారులు, మామిడి పరిశోధనాస్థానం శాస్త్రవేత్తలు పాల్గొన్నారు.

అగ్రిగోల్డ్ ఏజెంట్ ముత్తారెడ్డి మృతి



విశాలాంధ్ర - గంపలగూడెం : కృష్ణాజిల్లా గంపలగూడెం గ్రామానికి చెందిన అగ్రిగోల్డ్ ఏజెంట్ కొండా ముత్తారెడ్డి (48) గురువారంరాత్రి మృతి చెందాడు. ముత్తారెడ్డి కొంత కాలంగా అనారోగ్యంతో బాధపడుతున్నట్లు కుటుంబసభ్యులు తెలిపారు. ముత్తారెడ్డికి భార్య, ఇద్దరు కుమారులు ఉన్నారు. ముత్తారెడ్డి భౌతికకాయాన్ని పలువురు సందర్శించి నివాళులర్పించారు. ఆయన కుటుంబానికి ప్రగాఢ సానుభూతిని తెలిపారు.

అట్రాసిటీ కేసుల్లో పోలీసుల నిర్లక్ష్యం

విశాలాంధ్ర - విశాఖ సిటీ బ్యూరో: అట్రాసిటీ కేసుల్లో పోలీసులు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని, సింహాచలం డిపో ఆర్టీసీ ఉద్యోగి మరణానికి కారణమైన డిపో మేనేజర్‌ను తక్షణం అరెస్ట్ చేసేలా ఆదేశాలు జారీ చేయాలని రాష్ట్ర ఎస్సీ, ఎస్టీ కమిషన్ ఛైర్మన్ కారెం శివాజీని దళిత హక్కుల పోరాట సమితి(డీహెచ్‌పీఎస్) రాష్ట్ర అధ్యక్షులు జేవీ ప్రభాకర్, జిల్లా ప్రధాన కార్యదర్శి బూసి వెంకటరావు కోరారు. విశాఖలోని గవర్నర్ బంగ్లాలో శుక్రవారం శివాజీని కలిసి విశాఖ జిల్లాలో పలు సమస్యల ఆయన దృష్టికి తీసుకొచ్చారు. జిల్లాలో అట్రసిటీ కేసుల దర్యాప్తుల్లో పోలీసులు నిర్లక్ష్యం ప్రదర్శిస్తున్నార న్నారు. ఆర్టీసీ డిపో మేనేజర్‌పై అట్రసిటీ కేసు నమోదై 40 రోజులు కావస్తున్నా నేటికీ చర్యలు తీసుకోలేదన్నారు. రాంబిల్లిలో ముత్యాల రమణ హత్యకేసులోనూ దోషులను అరెస్ట్ చేయలేదని ఫిర్యాదు చేశారు.

మతోన్మాదశక్తుల ఆగడాలను సాగనివ్వం

ఏపీ మహిళా సమాఖ్య రాష్ట్ర కార్యదర్శి విమల

విశాలాంధ్ర - విశాఖ సిటీ బ్యూరో : శబరిమల ఆలయంలోని మహిళల ప్రవేశాన్ని స్వాగతిస్తూ సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పు అమలుకు చర్యలు చేపట్టిన కేరళ రాష్ట్ర వామపక్ష ప్రభుత్వాన్ని కూల్చేందుకు మతోన్మాదశక్తులు చేస్తున్న ఆగడాలను సాగనివ్వబోమని ఆంధ్రప్రదేశ్ మహిళా సమాఖ్య రాష్ట్ర కార్యదర్శి ఎ.విమల అన్నారు. శబరిమల ఆలయంలోకి ఇద్దరు మహిళల ప్రవేశంతో గుడిని శుద్ధి చేయడాన్ని ఖండిస్తూ శుక్రవారం విశాఖలోని జీవీఎంసీ గాంధీ విగ్రహం వద్ద ఆంధ్రప్రదేశ్ మహిళా సమాఖ్య ఆధ్వర్యంలో మహిళలు నిరసన వ్యక్తం చేశారు. శబరిమల ఆలయంలో అన్ని వయస్సు మహిళలకు ప్రవేశం కల్పిస్తూ సుప్రీం తీర్పును అందరూ గౌరవిస్తూ అన్ని చోట్లా సమాన హక్కులు కల్పించాలన్నారు. మహిళలు ఆలయ ప్రవేశాన్ని అడ్డుకుంటూ అల్లర్లు సృష్టిస్తున్న మతోన్మాదశక్తుల ఆగడాలను అడ్డుకుంటామన్నారు. ఆలయం మైలపడిందని ఆలయ సిబ్బంది, అర్చకుడు శుద్ధి చేసిన వారిని ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసు నమోదు చేయాలని డిమాండ్ చేశారు. అయ్యప్ప ముసుగులో ఆర్ఎస్ఎస్ గూండాల విధ్వంసాలను కేరళ ప్రజలు సాగనివ్వరన్నారు. ఇటీవల ఆ రాష్ట్రంలో 50 లక్షల మంది మహిళలు నిర్వహించిన శాంతి ర్యాలీని ఓర్వలేకే బీజేపీ శక్తులు విధ్వంసానికి దిగుతున్నాయన్నారు. శబరిమల ఆయలంలో మహిళల ప్రవేశాన్ని ఎవ్వరూ అడ్డుకోలేరన్నారు. కార్యక్రమంలో ఆంధ్రప్రదేశ్ మహిళా సమాఖ్య నగర గౌరవాధ్యక్షులు బి.పరమేశ్వరి, నగర అధ్యక్షులు ఎంఏ బేగంతోపాటు నాయకులు ఎ.దేవుడమ్మ, జయ, నూకాలమ్మ, రాజేశ్వరి పాల్గొన్నారు.



ప్రకృతి సేద్యంతోనే మానవాళి మనుగడ

- కవుల పాట- ప్రకృతి బాటలో ప్రజా గాయకులు
- ప్రకృతి వ్యవసాయంతోనే ఆరోగ్యం, పర్యావరణ పరిరక్షణ
- రాష్ట్ర ప్రకృతి వ్యవసాయదారుల సదస్సులో వక్తలు



విశాలాంధ్ర - విశాఖసిటీ : నేల తల్లిని కాపాడుకుంటేనే మానవాళి మనుగడ సాధ్యపడుతుందని ప్రజా గాయకులు గద్దర్ అన్నారు. ఏయూ అసెంబ్లీ హాలులో శుక్రవారం నిర్వహించిన కవుల పాట- ప్రకృతి బాట ప్రకృతి వ్యవసాయ రైతుల సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా గద్దర్ మాట్లాడుతూ దిగుబడుల కోసం రసాయనాలతో భూమిని నాశనం చేస్తున్నారన్నారు. భూమి, బువ్వ, చెమటచుక్క ఎంతో అవసరమన్నారు. పరిశ్రమల్లో పంట ఉండదన్నారు. లాభాలు, మార్కెట్ కోసమే నష్టాలు, సమస్యలు తెచ్చుకుంటున్నామన్నారు. ప్రజా గాయకులు గోరేటి వెంకన్న, భూపాలరెడ్డి, అందెశ్రీ మాట్లాడుతూ ప్రకృతి వ్యవసాయదారులను ప్రభుత్వాలు ప్రోత్సహించాలన్నారు. ఉత్తరాంధ్ర యాస, సమస్యలను వంగపండు ప్రపంచానికి బలంగా వినిపించారన్నారు. ప్రస్తుతం పర్యావరణ ఉద్యమం చేయాల్సిన అనివార్య పరిస్థితులు వచ్చాయన్నారు. తల్లి బ్రతికుంటే మరో బిడ్డకు జన్మను ఇవ్వగలదన్న సత్యాన్ని అందరూ గుర్తించి భూమిని కాపాడుకోవాలని పిలుపునిచ్చారు. ప్రసంగాల మధ్యలో ప్రజాకళాకారుల ఆలపించిన గీతాలు సభికులను అలరించారు.

ప్రకృతి వ్యవసాయం ఎంతో కీలకం

ప్రకృతి వ్యవసాయంతోనే ప్రజల ఆరోగ్యం, పర్యావరణ పరిరక్షణ సాధ్యమని వక్తలు అభిప్రాయపడ్డారు. వర్సిటీ ప్రాంగణంలో ఉదయం జరిగిన సదస్సుకు అధ్యక్షత వహించిన జట్టు ట్రస్టీ డాక్టర్ డి.పారినాయుడు మాట్లాడుతూ రసాయనాలు, ఎరువులు, పురుగుమందులు వాడటంతో భూమి సారం తగ్గుతుందన్నారు. 60 ఏళ్ల తరువాత భూములు సాగుకు అనుకూలంగా ఉండవని ప్రపంచంలోని శాస్త్రవేత్తలు నిర్ధారించారన్నారు. రసాయనాలతో సాగు చేసిన ఉత్పత్తులను తీసుకోవడం వల్ల ప్రజలు అనారోగ్యం పాలవుతారన్నారు.

పాడేరు, విశాఖ డీపీఎంలు టి. దాస్, కె.సత్యన్నారాయణ మాట్లాడుతూ తూర్పు కనుమల్లో జీవ వైవిధ్యాన్ని కాపాడుకోవాలంటే ప్రకృతి వ్యవసాయం తప్పనిసరి అన్నారు. ఈ సాగులో ఫలితాలు చూసి రైతులు ముందుకు వస్తున్నారన్నారు. రాష్ట్రంలో ఈ ఏడాది 5 లక్షల మంది వరి, పత్తి, చెరకు, అరటి, రాగులు, శనగ, కొర్ర, గంటె, జొన్న, కూరగాయలు, ఆకుకూరలను ప్రకృతి సేద్యం చేస్తున్నారన్నారు.

ఎనిమిది జిల్లాల నుంచి వచ్చిన 24 మంది రైతులు ప్రకృతి వ్యవసాయంతో సాధించిన విజయాలను వివరించారు. ఏపీ రైతు సాధికారిక సంస్థ, ఏపీపీఐ, జట్టు ట్రస్టు ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో ప్రజాకవి వంగపండు ప్రసాదరావు రచించిన 'ఎరువుల భాగోతం' పుస్తకాన్ని ఆవిష్కరించి నృత్య రూపకం ప్రదర్శించారు. వంగపండును రూ.50 వేల నగదు పురస్కారంతో సత్కరించారు. అరవై ఏళ్లే పుస్తకావిష్కరణ చేశారు. ఏయూ రెక్టార్ ఆచార్య ఎం.ప్రసాదరావు, ఆర్ట్స్ కళాశాల ప్రిన్సిపాల్ ఆచార్య కె.రామ్మోహనరావు సహా 13 జిల్లాల రైతులు, కవులు, రచయితలు పాల్గొన్నారు.

ఫినిష్ అయిపోతారు జాగ్రత్త..

బీజేపీ నేతలకు చంద్రబాబు హెచ్చరిక

విశాలాంధ్ర - కాకినాడ : లేనిపోని ప్రాబ్లమ్స్ తెచ్చి పెట్టుకోవద్దు.. పెట్టుకుంటే మీర ఫినిష్ అయిపోతారు జాగ్రత్త అంటూ రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు బీజేపీ నాయకులను తీవ్ర స్థాయిలో హెచ్చరించారు. జన్మభూమి కార్యక్రమంలో శుక్రవారం తూర్పు గోదావరి జిల్లా కాకినాడ వచ్చిన ముఖ్యమంత్రి చంద్రబాబు కాన్వాయన్‌ను బీజేపీ నేతలు అడ్డుకుని నిరసన తెలిపారు. గత ఎన్నికల్లో జిల్లాకు ఇచ్చిన హామీలు అమలు చేయక పోవడాన్ని ఎండగడుతూ సీఎం గోబ్యాక్, డౌన్‌డౌన్ అంటూ కాన్వాయ్‌ని చుట్టుముట్టారు. దీంతో బస్సు నుంచి బయటకు వచ్చిన ఆయన బీజేపీ తీరుపై తీవ్రంగా స్పందించారు. మోడీ చేస్తున్న అన్యాయాన్ని ఇక్కడ సమర్థిస్తారా.. మీకు సిగ్గుందా అంటూ ప్రశ్నించారు. మీకు రాష్ట్రంలో ఉండే అర్హతలేదని హెచ్చరించారు. ఈ క్రమంలో కాన్వాయ్‌ని అడ్డుకున్న బీజేపీ కార్యకర్తలను పోలీసులు అరెస్ట్ చేసి సమీప పోలీస్‌స్టేషన్‌కి తరలించారు. బీజేపీ జిల్లా అధ్యక్షుడు మాలకొండయ్యను పోలీసులు హౌస్ అరెస్ట్ చేశారు. వ్యక్తిగత పని ఉందని బయటకు వచ్చిన ఆయనను అరెస్ట్ చేసి పోర్టు పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. నిరసన వ్యక్తం చేసిన వారిలో బీజేపీ రాష్ట్ర యువమోర్చా నాయకులు రామ్‌కుమార్, బీజేపీ జిల్లా ప్రధానకార్యదర్శి వెంకటేశ్వరరావు, కార్పొరేటర్లు లక్ష్మీప్రసన్న, సుజాతా పాల్గొన్నారు.

నిరసన తెలపడం ప్రజలకు రాజ్యాంగం కల్పించిన హక్కు



విశాలాంధ్ర - విజయవాడ (గాంధీనగర్) : ప్రజాస్వామ్య దేశంలో పౌరులకు తమ సమస్యలపై నిరసనలు తెలిపే హక్కు రాజ్యాంగం కల్పించిందని దీనిని పోలీసు అధికారులు ఉల్లంఘించడం సరైంది కాదని ఏఐటీయూసీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి జి.ఓబులేసు పేర్కొన్నారు. ఏఐటీయూసీ, సీఐటీయూ రాష్ట్ర కమిటీల ప్రతినిధి బృందం శుక్రవారం రాష్ట్ర అడిషనల్ డీజీపీ హరీష్‌గుప్తాను డీజీపీ కార్యాలయంలో కలసి వినతిపత్రం అందజేశారు. ఈ బృందంలో ఓబులేసుతో పాటు సీఐటీయూ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎం.ఏ.గఫూర్, ఏఐటీయూసీ రాష్ట్ర అధ్యక్షులు ఆర్.రవీంద్రనాథ్, సీఐటీయూ రాష్ట్ర ఉపాధ్యక్షులు యు.ఉమామహేశ్వరరావు, ఏఐటీయూసీ రాష్ట్ర ఉప ప్రధాన కార్యదర్శి ఎస్.వెంకట సుబ్బయ్య ఉన్నారు.

అనంతరం ప్రెస్‌క్లబ్‌లో జరిగిన విలేఖరుల సమావేశంలో ఓబులేసు మాట్లాడుతూ భారత రాజ్యాంగం పౌరులందరికీ స్వేచ్ఛ, సమానత్వాన్ని ప్రసాదించిందన్నారు. ప్రభుత్వ విధానాలపై శాంతి యుతంగా నిరసన తెలిపే హక్కును రాజ్యాంగం గుర్తించిందని, శాంతియుత నిరసనలకు అవకాశం లేకుండా పోతే ప్రజాస్వామ్య వ్యవస్థ విస్ఫోటనానికి గురవుతుందని ఇటీవల సుప్రీం కోర్టు ధర్మాసనం వ్యాఖ్యానించిన విషయాన్ని గుర్తుంచుకోవాలన్నారు. ఉమ్మడి రాష్ట్రంలో రాజధాని నగరమైన హైదరాబాద్‌లో కార్మిక, ఇతర ప్రజా సంఘాలు తమ సమస్యలపై ఆందోళనలు, ప్రదర్శనలు, ధర్నాలు చేయడంపై ఆంక్షలు లేవని, ఇందిరాపార్క్ వద్ద మాత్రమే కాకుండా లేబర్ కమిషనర్ కార్యాలయం, విద్యుత్ సౌధ, ప్రభుత్వ డైరెక్టరేట్లు, సంక్షేమ భవనం వద్ద తరచుగా ఇటువంటి ఆందోళనలు జరిగేవని అన్నారు. రాష్ట్ర విభజన అనంతరం కొత్త రాష్ట్రమైన ఆంధ్రప్రదేశ్‌లో ప్రజాస్వామిక,శాంతియుత ఆందోళనలపై తీవ్రమైన ఆంక్షలు పెడుతున్నారని, ఎన్నో సార్లు అధికారుల చుట్టూ తిరిగితే తప్ప అనుమతులు ఇవ్వడం లేదని, ప్రదర్శనలకు పోలీసులు అనుమతినిచ్చినా వివిధ జిల్లాల నుండి వచ్చే కార్మికులు, ఉద్యోగులు, ప్రజలు విజయవాడకు రాకుండా అన్ని చోట్ల ఆటంకాలు కల్పిస్తున్నారన్నారు. ఎక్కడికక్కడ అరెస్టులు చేసి నిర్బంధిస్తున్నారని, నిర్బంధించాలనుకున్న వ్యక్తులు దొరకకపోతే వారి కుటుంబ సభ్యులను పోలీస్ స్టేషన్‌లకు తీసుకువెళ్తున్నారని, కార్మికుల ఆందోళనలు, నిరసనలు జరగకుండా చూడటం పోలీసుల డ్యూటీగా మారడం దురదృష్టకరమన్నారు.

నేరస్తుల పట్ల వ్యవహరించే పద్ధతిలో ప్రజలతో, ఉద్యోగ, కార్మికులతో వ్యవహరించడం చట్టాన్ని అతిక్రమించడమేనని పేర్కొన్నారు. ఇటీవల విజయవాడలో పోలీసుల ఆంక్షలు మితిమీరిపోయాయని, అలంకార్ సెంటర్ వద్ద తప్ప ఎక్కడా ఆందోళనలకు, ధర్నాలకు అనుమతినివ్వడం లేదని, పోలీసు అధికారుల దయా దాక్షిణ్యాలపై ఆధారపడే దుస్థితి రావటం దౌర్భాగ్యమని విమర్శించారు. ఈ పరిస్థితులను సరిచేసి కార్మిక సంఘాలు, ఇతర ప్రజా సంఘాలు శాంతియుతంగా తమ నిరసనలను, ఆందోళనలను చేసుకునేందుకు ఆటంకాలు కల్పించ కుండా క్రిందిస్థాయి అధికారులను ఆదేశించాలని కోరారు.

ఈ నెల 8, 9 తేదీలలో దేశ వ్యాప్తంగా కోట్లాది మంది ఉద్యోగులు, కార్మికులు సార్వత్రిక సమ్మె చేయనున్నారని, కేంద్ర కార్మిక సంఘాల పిలుపు మేరకు మన రాష్ట్రంలో కూడా విజయవాడతో సహా అన్ని పట్టణాలలో ప్రదర్శనలు, మానవహారాలు, నిరాహారదీక్షలు నిర్వహిస్తున్నామని తెలిపారు. ఇవన్నీ శాంతియుతంగా చేసే కార్యక్రమాలే గనుక ఈ సమ్మె రెండు రోజులు ఎటువంటి ఆంక్షలు పెట్టకుండా ప్రదర్శనలకు, నిరసనలకు అనుమతించేలా తక్షణం క్రిందిస్థాయి అధికారులను ఆదేశించాలని కోరారు.

27న బందరు పోర్టుకు శంకుస్థాపన

మంత్రి కొల్లు రవీంద్ర



విశాలాంధ్ర - మచిలీపట్నం : బందరు పోర్టు పనులకు ఈ నెల 27న ముఖ్యమంత్రి చంద్రబాబు శంకుస్థాపన చేపడతారని మంత్రి కొల్లు రవీంద్ర తెలిపారు. పట్టణంలోని 9,10 వార్డుల్లో శుక్రవారం జరిగిన జన్మభూమి - మాఊరు కార్యక్రమాల్లో ఆయన పాల్గొన్నారు. బందరు పోర్టుపనులు ప్రారంభించడానికి ఉన్న అడ్డంకులన్నింటినీ సరిదిద్దుతున్నామన్నారు. పోర్టు నిర్మాణంతో ఈ ప్రాంతంలో అనుబంధ పరిశ్రమలు ఏర్పాటయ్యేందుకు అవకాశం ఉంటుందన్నారు. పరిశ్రమలు ఏర్పాటైతే ఉద్యోగ అవకాశాలు మెరుగవుతాయన్నారు. మచిలీపట్నం- విజయవాడ జాతీయ రహదారి, రైల్వే డబ్లింగ్ పనులు పూర్తయ్యే దశలో ఉన్నాయని, వీటిద్వారా పోర్టునుంచి సరకులు ఎగుమతులు, దిగుమతులు చేసుకునేందుకు అవకాశం ఉంటుందన్నారు. ప్రజాసమస్యలను తెలుసుకునేందుకు ప్రతి ఏటా జనవరిలో జన్మభూమి కార్యక్రమాన్ని ఏర్పాటు చేసి, ప్రభుత్వం ప్రజలకు జవాబుదారీగా ఉంటోందన్నారు. రాష్ట్ర ఆర్థిక పరిస్థితి మెరుగ్గా ఉంటే ఇప్పుడు ఇచ్చే వెయ్యి రూపాయల పింఛనును రెట్టింపు చేయాలని ముఖ్యమంత్రి ఆలోచనగా ఉందన్నారు. అనంతరం సామూహిక సీమంతాల కార్యక్రమంలో పాల్గొని గర్భిణులకు నూతన వస్త్రాలు అందజేసి వారిని ఆశీర్వదించారు. అంగన్‌వాడీ టీచర్లకు ట్యాబ్‌లను అందజేశారు. కాపుకార్పోరేషన్ ద్వారా మంజూరైన రుణాలను లబ్ధిదారులకు అందజేశారు. ఈ కార్యక్రమంలో ముడా చైర్మన్ బూరగడ్డ వేదవ్యాస్, మునిసిపల్ చైర్మన్ మోటమర్రి వెంకటబాబాప్రసాద్, వైస్ చైర్మన్ కాశీ విశ్వనాథం, కౌన్సిలర్లు కొట్టె వెంకట్రావు, మచిలీపట్నం డివిజన్ జన్మభూమి ప్రత్యేక అధికారి ఎం. వెంకటేశ్వరరావు పాల్గొన్నారు.

అంతర్జాతీయ అందాల పోటీలకు విజయవాడ చిన్నారి



విశాలాంధ్ర - విజయవాడ (వన్‌టౌన్) : విజయవాడకు చెందిన అయిదేళ్ళ చిన్నారి పాటిబండ్ల యామిని అంతర్జాతీయ అందాల పోటీలకు ఎంపికైంది. యామిని ఈ నెల 8 నుంచి యూరప్ ఖండంలోని జార్జియా దేశంలో జరగనున్న 'వరల్డ్ రైజింగ్ స్టార్స్ 2019' అంతర్జాతీయ అందాల పోటీలకు జూనియర్ విభాగంలో ఎంపికైంది. ఈ సందర్భంగా బందరురోడ్డులోని ప్రముఖ హోటల్‌లో విలేఖరుల సమావేశంలో యామిని తల్లిదండ్రులు పాటిబండ్ల జాహ్నవి, వెంకట్ మాట్లాడుతూ స్థానిక ఢిల్లీ పబ్లిక్ స్కూల్‌లో 1వ తరగతి చదువుతున్న యామిని చిన్ననాటి నుంచే అందాల పోటీల్లో రాణిస్తున్నదని తెలిపారు. ఈ క్రమంలోనే "లిటిల్ ప్రిన్సెస్" టైటిల్‌ను కైవసం చేసుకుందని తెలిపారు. అంతర్జాతీయ పోటీలలో 40కు పైగా దేశాల నుండి చిన్నారులు పాల్గొంటారని తెలిపారు.

రాష్ట్ర అభివృద్ధికి బాబే అడ్డంకి

విశాలాంధ్ర - శ్రీకాకుళం కలెక్టరేట్ : కేంద్ర ప్రభుత్వం ఆంధ్రప్రదేశ్ అభివృద్ధికి పెద్దఎత్తున నిధులు కేటాయిస్తున్నా వాటి ఖర్చును సరిగా చూపడంలేదని, చంద్రబాబే అభివృద్ధిని అడ్డుకుంటున్నారన్నారని బీజేపీ ఉత్తరాంధ్ర పార్లమెంట్ నియోజకవర్గాల కో-ఆర్డినేటర్ దగ్గుబాటి పురంధేశ్వరి అన్నారు. శ్రీకాకుళంలోని బీజేపీ జిల్లా కార్యాలయంలో శుక్రవారం ఆమె విలేకరులతో మాట్లాడుతూ శ్రీకాకుళం పార్లమెంటు నియోజకవర్గంలో పార్టీని వంద శాతం బలోపేతం చేసుకుని రాబోయే ఎన్నికలలో బీజేపీ అభ్యర్థి గెలుపునకు బాటలు వేస్తామన్నారు. దేశంలో ఏ రాష్ట్రానికి ఇవ్వనంత సహకారం ఆంధ్రాకు ప్రధాని మోడీ ఇచ్చారన్నారు. పోలవరం, పేదలకు మరుగుదొడ్లు, పేదలకు ఇళ్లు, పంచాయతీల్లో రోడ్లు మొదలైన విషయాల్లో రాష్ట్ర ప్రభుత్వం శ్వేతపత్రం విడుదల చేస్తూ కేంద్ర ప్రభుత్వం రాష్ట్రానికి ఏమీ చేయలేదంటూ అవాస్తవాలను ప్రచారం చేస్తున్నారన్నారు. పోలవరానికి ఖర్చు చేస్తున్న ప్రతి పైసా కేంద్ర ప్రభుత్వానిదే అన్నారు. కేంద్రంపై బురద చల్లటానికే చంద్రబాబు రాజకీయం చేస్తున్నారని ఆరోపించారు.

పోలీసు పహారాలో పల్లెపాలెం జన్మభూమి

- పోలీసులు, ప్రజల మధ్య తోపులాట
- గందరగోళం మధ్యనే అయ్యిందనిపించిన అధికారులు
- తాగునీటి కోసం ప్రజల ఆందోళన



విశాలాంధ్ర - కృత్తివెన్ను : ప్రజలు, పోలీసుల మధ్య తీవ్ర తోపులాట, అరుపులు, కేకలు, నిరసనలతో కృష్ణాజిల్లా కృత్తివెన్ను మండలం పల్లెపాలెంలో జన్మభూమి కార్యక్రమాన్ని శుక్రవారం అధికారులు అయ్యిందనిపించారు. పల్లెపాలెం జన్మభూమి కార్యక్రమాన్ని పోలీసు పహారా మధ్య మొక్కుబడిగా నిర్వహించారు. జన్మభూమి కార్యక్రమంలో తమ సమస్యలను చెప్పుకునేందుకు వస్తున్న ప్రజలను పోలీసులు అడ్డుకోవడంతో తోపులాట జరిగింది. తమ గ్రామంలో ఏడాది నుంచి తాగునీరు సరఫరా జరగటంలేదని స్థానికులు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. తాగునీరు సరఫరా చేయలేని అధికారులు ఇంకేం సమస్యలు తీరుస్తారంటూ నిరసన వ్యక్తం చేస్తూ, సమావేశాలు ఎందుకంటూ ఆగ్రహం వ్యక్తంచేశారు. పోలీసులు రంగప్రవేశం చేసి ప్రజలను అడ్డుకోవడంతో గందరగోళం నెలకొంది. ఒక దశలో పోలీసులు, గ్రామస్తుల మధ్య దాదాపు గంటపాటు తోపులాట జరిగింది. అధికారు లకు, ప్రజలకు మధ్య పోలీసులు అడ్డుగా నిలబడి కార్యక్రమాన్ని అయ్యింద నిపించారు. అధికారులకు సమస్యలు చెప్పటానికి వస్తే పోలీసులతో గెంటించి వేయడం ఏమిటని గ్రామస్తులు ఆవేదన వ్యక్తం చేశారు. తమకు కనీసం తాగునీరు ఇవ్వలేకపోతే తమ గ్రామాన్ని పక్కనే ఉన్న పశ్చిమగోదావరి జిల్లాలో కలిపివేయాలని డిమాండు చేశారు. సాయంత్రం లక్ష్మీపురం గ్రామంలో జరిగిన జన్మభూమి కార్యక్రమంలో కూడా మంచినీటి సరఫరా సక్రమంగా జరగటంలేదని ప్రజలు ఆందోళన వ్యక్తం చేశారు. లక్ష్మీపురం ఉన్నత పాఠశాలలో ఉపాధ్యాయులు సంవత్సరం మధ్యలో డిప్యూటేషన్‌ల పేరుతో అక్రమంగా బదిలీలు అవుతున్నారని అధికారుల దృష్టికి తీసుకు వచ్చారు. ఇలాగైతే తమ పిల్లల చదువుల మాటేమిటని తల్లిదండ్రులు ప్రశ్నించారు. గ్రామంలోని హిందూ శ్మశానవాటికను ఆధునీకరించాలని కోరారు.

ఈ కార్యక్రమాలలో ఎంపీపీ వలవల సత్యనారాయణ, జెడ్‌పీటీసీ సభ్యులు ఒడుగు తులసీరావు, ఎంపీటీసీ సభ్యులు మన్నె మౌనిక, మోకా సత్యనారాయణ, ప్రత్యేకాధికారి ఏపీఎస్ శ్రీనివాస్, ఎంపీడీఓ ఎ. శ్రీనాథస్వామి, ఉపాధ్యక్షుడు తమ్మా మురళి, ఏఎంసీ చైర్మన్ గుడిశేవ మహాలక్ష్మి, డీటీ రామకృష్ణ, ప్రధానోపాధ్యాయురాలు విజయ కుమారి, పులగం చిన్నబ్బులు, చెన్నకేశవరావు తదితరులు పాల్గొన్నారు.

నేటి నుంచి విఐటీలో విటోపియా-2019

2కే రన్‌తో జోష్ నింపిన విద్యార్థులు



విశాలాంధ్ర బ్యూరో-అమరావతి: విఐటీ-ఏపీ అమరావతి వర్సిటీలో విటోపియా-2019 అంతర్జాతీయ క్రీడా సాంస్కృతిక ఉత్సవాలు శనివారం నుంచి రెండురోజులపాటు కొనసాగుతాయి. తొలిరోజు ఉత్సవాలను ద్రోణాచార్య అవార్డు-2011 గ్రహీత ఐ.వెంకటేశ్వరరావు ప్రారంభిస్తారు. ముగింపురోజు ఉత్సవానికి ఆంధ్రప్రదేశ్ హైకోర్టు జడ్జి టి.రజనీ, ప్రముఖ సినీ హీరోయిన్ లావణ్య త్రిపాఠి విచ్చేస్తారు. విటోపియా-2019ని పురస్కరించుకుని..విఐటీ విద్యార్థులు రాజధాని అమరావతిలో ఉత్సాహంగా 2కే రన్ చేపట్టారు. ఈ కార్యక్రమంలో వర్సిటీ వైస్ ప్రెసిడెంట్ శంకర్, వైస్ చాన్సలర్ డాక్టర్ డి.శుభకర్, రిజిస్ట్రార్ డాక్టర్ సిఎల్వీ శివకుమార్, డిస్కస్‌త్రో నేషనల్స్‌లో రజతపతకం విజేత కొల్లి అనితాదేవి, అండర్-18 వరల్డ్ యూత్ అథ్లెటిక్స్ విజేత దండి జ్యోతిక, విద్యార్థులు పాల్గొన్నారు. ఈ క్రీడా సాంస్కృతిక ఉత్సవాలకు వివిధ రాష్ట్రాల నుంచి 50 టీమ్‌లు హాజరవుతాయి.

జ్యుడీషియల్ కాంప్లెక్స్ పనులు పరిశీలించిన శ్రీధర్



విశాలాంధ్ర బ్యూరో - అమరావతి: అమరావతి రాజధాని నగరంలో నిర్మాణంలో ఉన్న జ్యుడీషియల్ కాంప్లెక్స్ పనులు, సీఆర్‌డీఏ ప్రాజెక్టు కార్యాలయ పనులను సీఆర్‌డీఏ కమిషనర్ డాక్టర్ చెరుకూరి శ్రీధర్ శుక్రవారం పరిశీలించారు. జ్యుడీషియల్ కాంప్లెక్స్ పనులు చేస్తున్న ఎల్ అండ్ టీ ప్రతినిధులకు పలు సూచనలు, సలహాలు ఇచ్చారు. ఈ నెల మూడో వారం నాటికి పూర్తి చేసే విధంగా చర్యలు చేపట్టాలని ఆదేశించారు. ఈస్ట్‌పార్క్ రోడ్డు నుంచి జ్యుడీషియల్ కాంపెక్స్ వరకూ నిర్మించిన బీటీ రోడ్డును కూడా ఆయన పరిశీలించారు. రోడ్డుకు సంబంధించిన ఫుట్‌పాత్, గ్రీనరీ పనులపై అధికారులతో సమీక్షించారు. ఐకానిక్ హైకోర్టు భవనం ఎర్త్ వర్క్ వివరాలను అడిగి తెలుసుకున్నారు. ఇక సీఆర్‌డీఏ ప్రాజెక్టు కార్యాలయ పనులను నెలాఖరు నాటికి పూర్తి చేయాలని ఆయన కాంట్రాక్టు సంస్థ ప్రికా ప్రతినిధులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో సీఆర్‌డీఏ సీఈ జక్రయ్య, ఎస్ఈ సి.హెచ్.ధనుంజయ తదితరులు పాల్గొన్నారు.

పెట్టుబడులపై పర్యాటక సంస్థ రాష్ట్ర సదస్సు

విశాలాంధ్ర - అమరావతి : రాష్ట్ర అతిథ్య రంగంలో పెట్టుబడుల అవకాశాలపై అవగాహన కల్పించటమే లక్ష్యంగా రాష్ట్ర సదస్సు నిర్వహించనున్నట్లు రాష్ట్ర పర్యాటక ప్రాధికార సంస్థ ముఖ్య కార్యనిర్వహణాధికారి హిమాన్షు శుక్లా తెలిపారు. ఈ మేరకు శుక్రవారం ఒక ప్రకటన విడుదల చేశారు. విజయవాడలోని బెరం పార్కు వేదికగా జనవరి 10వ తేదీ గురువారం ఉదయం ఈ సదస్సు జరుగుతుందని చెప్పారు. రెండు సెషన్లుగా సదస్సును విభజించామని, హోటల్ పరిశ్రమకు చెందిన వారందరికీ స్వాగతం పలుకుతున్నామని పేర్కొన్నారు. అనుభవజ్ఞులు అమూల్యమైన సూచనలు అందించి పర్యాటక రంగంలో పెట్టుబడి అవకాశాలపై అవగాహన కల్పిస్తారని తెలిపారు.

డిగ్రీ కార్మికులకు ఉపకారవేతనాలకు దరఖాస్తుల స్వీకరణ

విశాలాంధ్ర బ్యూరో- అమరావతి : వాణిజ్య సంస్థలు, కర్మాగారాలు, దుకాణాలు, మోటారు రవాణా, ధార్మిక సంస్థలు, ట్రస్టుల్లో పని చేస్తున్న కార్మికులుగానీ, వారి పిల్లలుగానీ 2017-18 సంవత్సరాల్లో పలు కోర్సుల్లో ఉత్తీర్ణులైన వారు ఉపకార వేతనాల కోసం దరఖాస్తు చేసుకోవాలని కార్మిక సంక్షేమ మండలి కమిషనర్ ఎ.రాణి ఒక ప్రకటనలో తెలిపారు. పాలిటెక్నిక్, ఇంజనీరింగ్, మెడిసిన్, లా, బీఎస్సీలో వెటర్నరీ, నర్సింగ్, హార్టికల్చర్, బీసీఏ, ఎంసీఏ, బీఫార్మసీ, ఎంఫార్మసీ, బీబీఏ, డిప్లొమో, పీజీ డిప్లొమో, ఇన్‌ల్యాబ్ టెక్నాలజీ కోర్సులు 2017-18లో ఉత్తీర్ణులైన వారు ఉపకార వేతనాల కోసం దరఖాస్తు చేసుకోవచ్చని పేర్కొన్నారు. ప్రతిభ, మార్కుల ఆధారంగా ఉపకార వేతనాలకు ఎంపిక చేస్తామని పేర్కొన్నారు. దరఖాస్తు ఫారాలను సహాయ కార్మిక కమిషనర్ కార్యాలయం నుండి పొంది ఫిబ్రవరి 5వ తేదీలోగా సంబంధిత కార్మిక శాఖ కార్యాలయంలో అందజేయాలని కోరారు. గడువు తరువాత అందిన దరఖాస్తులు తిరస్కరించబడతాయని వివరించారు. కార్మిక సంక్షేమంలో భాగంగా ఎంపికైన అభ్యర్థులకు రూ.10 వేలు ఉపకార వేతనంగా వారి ఖాతాలో మేడే నాటికి జమ చేస్తామని కమిషనర్ రాణి ఆ ప్రకటనలో తెలిపారు.

'జన్మభూమి' ఫిర్యాదులను సత్వరం పరిష్కరించాలి

సీఎస్ పునేఠ ఆదేశం

విశాలాంధ్ర - అమరావతి : జన్మభూమి కార్యక్రమంలో ప్రజల నుంచి వస్తున్న సమస్యలను వెంటనే పరిష్కరించాలని సీఎస్ అనిల్ చంద్ర పునేఠా అధికారులను ఆదేశించారు. శుక్రవారం సచివాలయంలో 6వ విడత జన్మభూమి -మా ఊరు కార్యక్రమంపై సమీక్ష నిర్వహించారు. ఇప్పటి వరకు 6 వ విడత జన్మభూమిలో 59,724 దరఖాస్తులు వచ్చాయని ఆర్టీజీఎస్ సీఈఓ అహ్మద్ బాబు, సీఎస్ పునేఠాకు వివరించారు. ఈ సందర్భంగా సీఎస్ మాట్లాడుతూ ప్రజల సమస్యల పరిష్కారం కోసమే ప్రభుత్వం అహర్నిశలు కృషి చేస్తోందన్నారు. మహిళలు, పిల్లల్లో రక్తహీనత లేకుండా చూసేందుకు అవసరమైన ప్రచారం నిర్వహించేందుకు కేంద్ర ప్రభుత్వం 80 శాతం, రాష్ట్రం ప్రభుత్వం 20 శాతం నిధులతో అమలవుతోన్న పోషన్ అభియాన్ కార్యక్రమం అమలుపై కేంద్ర ప్రభుత్వ ఉన్నతాధికారులు, రాష్ట్ర అధికారులతో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్షించారు. ముఖ్యంగా గిరిజన ప్రాంతాల్లో పోషకాహార ఆవశ్యకతపై అవగాహన కల్పించేందుకు పోషన్ అభియాన్ ద్వారా ప్రచారం నిర్వహించనున్నట్లు చెప్పారు. పుస్తకాలు, కరపత్రాలు, రేడియో, టీవీలు, గోడ పత్రికలు, అంగన్ వాడీలకు శిక్షణ వంటి కార్యక్రమాల అమలు తీరును కేంద్ర అధికారులకు వివరించారు. ఈ పథకాన్ని విజయవంతంగా అమలు చేసి రాష్ట్రంలో రక్తహీనత అనేది లేకుండా చూడాలని సీఎస్ అధికారులను ఆదేశించారు.

లోక్‌పాల్ సెర్చ్ కమిటీపై ఏంచేశారు?



- అఫిడవిట్ దాఖలు చేయండి
- కేంద్రానికి సుప్రీంకోర్టు ఆదేశం

న్యూఢిల్లీ : లోక్‌పాల్‌కు ఒక సెర్చ్ కమిటీ ఏర్పాటుకు గత ఏడాది సెప్టెంబరు నుంచి తీసుకున్న చర్యలపై అఫిడవిట్ దాఖలు చేయాలని కేంద్ర ప్రభుత్వాన్ని సుప్రీంకోర్టు శుక్రవారం ఆదేశించింది. జనవరి 17 నాటికి ఈ అంశంపై అఫిడవిట్ దాఖలు చేయాల్సిందిగా అటార్నీ జనరల్ కె.కె.వేణుగోపాల్‌ను దేశ అత్యున్నత న్యాయస్థానం ఆదేశించింది. 'లోక్‌పాల్‌కు సెర్చ్ కమిటీ ఏర్పాటు అంశంపై మీరు తీసుకున్న చర్యలను అఫిడవిట్‌లో వివరించండి' అని ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ రంజన్ గొగోయ్, జస్టిస్ ఎస్.కె.కౌల్‌లతో కూడిన బెంచ్ పేర్కొంది. 2018, సెప్టెంబరులో చివరలో అనేక చర్యలు చేపట్టామని అటార్నీ జనరల్ చెప్పినపుడు, 'చాలా సమయం తీసుకున్నారు. ఆ తేదీ వరకు మీరు ఏం చేశార' అని బెంచ్ ప్రశ్నించింది. అనేక చర్యలు తీసుకున్నామని అటార్నీ జనరల్ మరోసారి పేర్కొనగా, 2018, సెప్టెంబరు వరకు మీరు ఏవైతే చర్యలు చేపట్టారో వాటి రికార్డు అంతటినీ తీసుకురండి' అని బెంచ్ స్పష్టం చేసింది. ఎన్‌జీవో కామన్ కాజ్ తరపున హాజరైన న్యాయవాది ప్రశాంత్ భూషణ్ మాట్లాడుతూ వెబ్‌సైట్‌లో సెర్చ్ కమిటీ సభ్యుల పేర్లను కూడా ప్రభుత్వం బహిరంగ పరచలేదని తెలిపారు. లోక్‌పాల్ సెర్చ్ కమిటీ ఏర్పాటు అంశంపై కేంద్రం వాదనలన్నీ అసంతృప్తికరంగా ఉన్నాయంటూ గత ఏడాది జూలై 24న సుప్రీంకోర్టు తిరస్కరించింది. నాలుగు వారాల్లోగా మెరుగైన అఫిడవిట్ సమర్పించాలని ఆదేశం చింది. ఆ ఆదేశాలను అనుసరించి అటార్నీ జనరల్ ఒక అభ్యర్థన దాఖలు చేశారు. ప్రధాన మంత్రి నరేంద్ర మోడీ, అప్పటి సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి దీపక్ మిశ్రా, లోక్‌సభ స్పీకర్ సుమిత్రా మహాజన్, ప్రముఖ న్యాయవేత్త ముకుల్ రస్తోగిలతో కూడిన ఎంపిక కమిటీ గత ఏడాది జూలై 18న సమావేశమై సెర్చ్ కమిటీ సభ్యుల పేర్లపై సంప్రదింపులు జరిపిందని తెలిపారు. బీమా, బ్యాంకింగ్, చట్టం, నిర్వహణ తదితరాలతో సహా ఆర్థిక, విధాన నిర్ణయ, విజిలెన్స్, ప్రజాపరిపాలన, అవినీతి వ్యతిరేక విధానంలో అనుభవం కలిగిన కనీసం ఏడుగురు (చైర్‌పర్సన్‌తో సహా)తో కూడిన సెర్చ్ కమిటీని ఏర్పాటు చేయాలని ఎంపిక ప్యానెల్ భావించిందని వేణుగోపాల్ వివరించారు. దీంతోపాటు సెర్చ్ కమిటీకి చెందిన 50 శాతం మంది షెడ్యూల్డ్ కులాలు, షెడ్యూల్డ్ తెగలు, ఇతర వెనుకబడిన తరగతులు, మైనార్టీలు, మహిళలు ఉంటారని ఆయన తెలిపారు.

ఎన్డీఏను వీడకుంటే మనుగడ కష్టమే..

జేడీ(యూ)కు కాంగ్రెస్ సూచన

పాట్నా : బీజేపీ నేతృత్వంలోని ఎన్డీఏ కూటమి నుంచి నితీశ్‌కుమార్ నేతృత్వంలోని జేడీ(యూ) బయటకు రాకపోతే బీహార్‌లో పార్టీ మనుగడ కష్టమని కాంగ్రెస్ అభిప్రాయపడింది. ఈ నేపథ్యంలో ఎన్డీఏను వీడాలంటూ జేడీ(యూ)కు సూచించింది. ట్రిపుల్ తలాక్ బిల్లును జనతాదళ్ (యునైటెడ్) వ్యతిరేకిస్తున్న నేపథ్యంలో కాంగ్రెస్ స్పందించింది. కాంగ్రెస్ నేత సదానంద్ సింగ్ మాట్లాడుతూ 'బీజేపీ, జేడీ(యూ) సిద్ధాంతాలు వేరు. అయోధ్యలో రామమందిరం నిర్మాణం, ట్రిపుల్ తలాక్‌పై నిషేధం వంటి కీలక అంశాలపై ఈ రెండు పార్టీల మధ్య అభిప్రాయభేదం ఉంది. ఎన్డీఏను అంటిపెట్టుకొని ఉంటే బీహార్‌లో మనుగడ కష్టసాధ్యంగా మారుతుందన్న విషయాన్ని జేడీ(యూ) గ్రహించాలి. లేకపోతే ఆ పార్టీ క్రమంగా రాష్ట్రం నుంచి కనుమరగవుతుంది' అని అన్నారు. ట్రిపుల్ తలాక్‌పై ఆర్డినెన్స్‌ను కేంద్ర కేబినెట్ ఆమోదించినప్పుడు తమ వైఖరిని జేడీ(యూ) స్పష్టంచేసింది. రాజ్యసభలో జేడీ(యూ) నేత, పార్టీ ప్రధాన కార్యదర్శి రామచంద్ర ప్రసాద్ సింగ్ ఈ అంశంపై ఇతర పార్టీలతో ఏకీభవించారు. పార్లమెంటులో ఈ బిల్లును తీసుకొస్తే తమ అభిప్రాయాన్ని మరింత బిగ్గరగా వినిపిస్తామన్నారు.

ఆ బిల్లు రాజ్యసభకు వచ్చినప్పుడు దానికి జేడీ(యూ) మద్దతివ్వదని పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు, ఎగువసభ సభ్యుడు వశిష్ట నారాయణ్ సింగ్ స్పష్టంచేశారు. రాజ్యసభలో డిప్యూటీ చైర్మన్ హరివంశ్ సహా జేడీ(యూ)కు ఆరుగురు సభ్యులున్నారు. రాజ్యసభలో పాలక పక్షానికి మెజారిటీ లేదు. జేడీ(యూ) మద్దతు లేకపోతే ఈ వ్యవహారంలో ఎన్డీఏ మరింత బలహీనపడుతుంది.

వితంతువుల బిల్లుకు రాజ్యసభ తిరస్కరణ

ఆమోదానికి విపక్షాల డిమాండు

న్యూఢిల్లీ : దేశంలో వితంతువులకు సామాజిక భద్రత కల్పించేలా చట్టాన్ని తీసుకురావాలన్న తీర్మానాన్ని రాజ్యసభ తిరస్కరించింది. 2018, ఆగస్టు 10న డీఎంకే నేత తిరుచీ శివ ఈ తీర్మానాన్ని ప్రవేశపెట్టారు. ఈ అంశంపై శుక్రవారం ఎగువసభలో చర్చ జరిగింది. అయితే దీనికి మహిళా,శిశు సంక్షేమ శాఖ మంత్రి వీరేంద్ర కుమార్ ఇచ్చిన సమాధానంపై శివ అసంతృప్తి వ్యక్తంచేశారు. తన తీర్మానాన్ని వెనక్కుతీసుకునేందుకు నిరాకరించారు. దీంతో ఓటింగ్ జరిగింది. మూజువాణి ఓటుపై అసంతృప్తి వ్యక్తంచేస్తూ ఎలక్ట్రానిక్ పద్ధతిలో ఓటింగ్‌ను శివ కోరారు. మొత్తం 59 మంది సభ్యులు హాజరుకాగా 23 అనుకూల 35 వ్యతిరేక ఓట్లు వచ్చాయి. తీర్మానాన్ని ఉపసంహరించుకోవాలని పార్లమెంటరీ వ్యవహారాల మంత్రి విజయ్ గోయల్ కూడా శివను కోరారు. అయితే, ప్రస్తుత పరిస్థితుల్లో వితంతువులకు సామాజిక భద్రత ఎంతో అవసరమని శివ వాదించారు. ప్రస్తుతం ఉన్నవి సరిపోవని వారికి మరిన్ని సౌకర్యాలు కల్పించాలని సూచించారు. 'రోజుకు రూ.6 చొప్పున లభించే పింఛన్‌తో ఓ వింతువు ఎలా బతకుతుంది? భర్త చనిపోయిన స్త్రీని ఆమె కుటుంబం తిరస్కరిస్తుంది. ఆమె సమాజ తిరస్కరణకూ గురవుతుంది. అలాంటి పరిస్థితుల్లో బలమైన చట్టాలు లేకపోతే ఏ విధంగా మనుగడ సాగించగలుగుతుంది?' అని శివ ప్రశ్నించారు. దేశంలో సుమారు ఐదు కోట్ల మంది వితంతువులు ఉన్నారని, కులమతాలు, సామాజిక హోదాకు అతీతంగా వారికి సామాజిక భద్రత, న్యాయ సేవలను అందించాలని అన్నారు. దీనికి మంత్రి స్పందిస్తూ వితంతువుల కోసం బీజేపీ ప్రభుత్వం చేపట్టిన సంక్షేమ కార్యక్రమాలను వివరించారు. మంత్రి సమాధానంపై కాంగ్రెస్, సమాజ్‌వాదీ పార్టీ సహా ప్రతిపక్షాలు అసంతృప్తిని వ్యక్తంచేస్తూ ఈ తీర్మానాన్ని ఆమోదించాలని డిమాండు చేశాయి.

ముఠా నాయకుడిలా మోడీ

- జగన్‌ని కూడా మిత్రుడిని చేసుకోవటానికి సిద్ధం
- ఎంపీ జేసీ దివాకర్ రెడ్డి విమర్శ



విశాలాంధ్ర - అమరావతి : రాయలసీమలో ముఠా నాయకుడిలా మోడీ వ్యవహరిస్తున్నారని ఎంపీ జేసీ దివాకర్ రెడ్డి విమర్శించారు. ఉండవల్లిలోని ముఖ్యమంత్రి నివాసం దగ్గర మీడియాతో మాట్లాడుతూ ప్రత్యేక హోదా కోసం పోరాడుతున్న టీడీపీ ఎంపీల పట్ల మోడీ నిరంకుశ వైఖరితో ప్రవర్తిస్తున్నారని మండిపడ్డారు. ప్రజాభిప్రాయం గౌరవించకుండా సస్పెండ్ చేస్తే సరిపోతుందా అని ప్రశ్నించారు. ఏకంగా సభ ఎంత కాలం జరిగితే అంత కాలం సభకు రావద్దు అనటం సమంజసం కాదన్నారు. రాష్ట్రంపై ఎందుకు కక్ష కట్టారో తెలియటం లేదన్నారు. చంద్రబాబుపై అసత్య ఆరోపణలు చేస్తున్న ప్రధాని దమ్ముంటే ప్రాసిక్యూట్ చేయించాలని డిమాండు చేశారు. ప్రధానిగా ఉన్న వ్యక్తి అసత్యాలు మాట్లాడటానికి సిగ్గు లేదా అంటూ ఆగ్రహం వ్యక్తం చేశారు. దేశానికి మోడీ ఓ అసమర్థ ప్రధాని అని ఎద్దేవా చేశారు. కాంగ్రెస్ ఆనాడు రాష్ట్రానికి దుష్ట శక్తి అయితే, ఈనాడు బీజేపీ దేశం మొత్తానికి దుష్ట శక్తి అని వ్యాఖ్యానించారు. చంద్రబాబు ఎవరినీ కలిసి రావాలని ఆహ్వానించ లేదని, రాజకీయాల్లో శాశ్వత మిత్రులు, శత్రువులు ఉండరన్నారు. జగన్‌ని కూడా మిత్రుడిని చేసుకోవటానికి సిద్ధంగా ఉన్నామని పేర్కొన్నారు. కోడి కత్తి చిన్న కేసు అని, గాయమైన సమయంలో మా వాడు జగన్ చిన్నగా వెళ్లిపోయాడని కొన్ని దుష్ట శక్తులు పబ్లిసిటీ కోసం ఇంత దూరం తీసుకొచ్చారని ఆరోపించారు.

రిజర్వుడుకూ 'జనరల్ కటాఫ్'

- మెయిన్స్ ఎంపికలో అందరూ సమానమే
- కేటగిరీ అభ్యర్థులు లేకుంటే మార్కులు కుదింపు
- నెలాఖరులోగా మరో 14 నోటిఫికేషన్లు
- ఇప్పటివరకూ 3,255 పోస్టులకు ప్రకటనలు
- సకాలంలో దరఖాస్తులు సమర్పించాలి
- ఏపీపీఎస్సీ చైర్మన్ పి.ఉదయ్ భాస్కర్



విశాలాంధ్ర బ్యూరో-అమరావతి: ఏపీపీఎస్సీ నిర్వహించే ప్రిలిమినరీ పరీక్షల్లో..రిజర్వుడు అభ్యర్థులను సైతం జనరల్‌కటాఫ్ ఆధారంగానే మెయిన్ పరీక్షలకు ఎంపిక చేస్తామని కమిషన్ చైర్మన్ పి.ఉదయ్‌భాస్కర్ వెల్లడించారు. విజయవాడ ఏపీపీఎస్సీ కార్యాలయంలో శుక్రవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఏపీపీఎస్సీ-2016 నోటిఫికేషన్‌లో అన్ని కేటగిరీ అభ్యర్థులను 1 : 50 ద్వారా స్క్రీనింగ్ టెస్టు నుంచి మెయిన్‌కు తీసుకున్నామని గుర్తుచేశారు. ఈ విడత పిలిమినరీ పరీక్షలో జనరల్ కటాఫ్ మార్కు ఆధారంగాను.. మెయిన్ పరీక్షలకు అన్ని కేటగిరీల అభ్యర్థులను ఎంపిక చేస్తామని వివరించారు. జనరల్ కటాఫ్‌లో ఆయా రిజర్వుడు వర్గాలు లేకుంటే.. అవసరానికి అనుగుణంగా ఆయా కేటగిరీల నుంచి కటాఫ్ మార్కులు తగ్గిస్తామని పేర్కొన్నారు. నిరుద్యోగులందరికీ సమన్యాయం జరిగేలా కమిషన్ పనిచేస్తుందని, అన్ని పరీక్షలను ప్రకటించిన తేదీల్లో నిర్వహించేందుకు చర్యలు తీసుకుంటామని స్పష్టంచేశారు. రిజర్వుడు అభ్యర్థులను జనరల్ కటాఫ్‌లోకి ఎలా తీసుకుంటారని, దీనివల్ల వారికి అన్యాయం తలెత్తుతుందని, న్యాయపరమైన సమస్యలు వస్తాయని విలేకరులు అడిగిన ప్రశ్నలకు చైర్మన్ బదులిచ్చారు. ప్రభుత్వ ఆదేశాలతోనే ఈ విధానాన్ని అమలు చేస్తున్నామని వివరణిచ్చారు. ఏపీపీఎస్సీ నుంచి ఈ నెలాఖరులోగా మరో 14నోటిఫికేషన్ల (1500పోస్టులకుపైగా) భర్తీకి నోటిఫికేషన్లు విడుదల చేస్తామని, వాటికి ప్రభుత్వం నుంచి ఆర్డర్లు, సర్వీస్ రూల్స్, పోస్టుల ఖాళీలు, అర్హతలు ప్రభుత్వం నుంచి రావాల్సి ఉందని తెలిపారు. గత డిసెంబరు 31నాటికి 21 నోటిఫికేషన్ల ద్వారా 3,255 పోస్టుల భర్తీకి నోటిఫికేషన్లు విడుదల చేశామని వివరించారు. ఇప్పటికే ప్రకటించిన ఏఈఈ పోస్టులకు గడువు ముగిసిందని, వాటికి 47,001 మంది అభ్యర్థులు దరఖాస్తు చేసుకున్నారని, అసిస్టెంట్ మోటారు వెహికల్ ఇన్‌స్పెక్టర్ల (ఏఎంవీఐ) పోస్టులకు 5,411మంది దరఖాస్తు చేసుకున్నారని తెలిపారు. పంచాయతీ సెక్రటరీ పోస్టులకు గత నెల 27 నుంచి దరఖాస్తులు స్వీకరిస్తున్నామని, ఇప్పటివరకూ 56,621 మంది దరఖాస్తు చేసుకున్నారని పేర్కొన్నారు. ఈ నెల 19 వరకూ దరఖాస్తు చేసుకోవచ్చని తెలిపారు.

హెల్ప్‌లైన్లు

ఓటీపీఆర్‌లో తలెత్తే ఇబ్బందుల్ని పరిష్కరించేందుకుగాను కమిషన్ హెల్ప్‌లైన్ నంబర్లను అందుబాటులోకి తీసుకొచ్చిందని ఉదయ్‌భాస్కర్ పేర్కొన్నారు. ఓటీపీఆర్- 0866-2527819, రిక్రూట్‌మెంట్-0866-2527820, 0866-252821కు కేటాయించామని వివరిం చారు. ఈ సమావేశంలో ఏపీపీఎస్సీ కార్యదర్శి ఏకే మౌర్య, సభ్యులు ఎస్.రూప, జి.రంగ జనార్దన్, విజయ్‌కుమార్, జి.సుజాత, పద్మరాజు పాల్గొన్నారు.

సీబీఐపీ అవార్డు పోలవరం పనుల పురోగతికి నిదర్శనం

రాష్ట్ర జల వనరుల శాఖ మంత్రి దేవినేని ఉమా



విశాలాంధ్ర బ్యూరో - అమరావతి : దేశంలో ఎంతో ప్రతిష్ఠాత్మకమైన సెంట్రల్ బోర్డ్ అఫ్ ఇరిగేషన్, పవర్ (సీబీఐపీ) అవార్డు పోలవరం ప్రాజెక్టుకు దక్కడం పనుల పురోగతికి నిదర్శ నమని రాష్ట్ర జల వనరుల శాఖ మంత్రి దేవినేని ఉమా మహేశ్వరరావు అన్నారు. న్యూఢిల్లీలో శుక్రవారం జరిగిన కార్యక్రమంలో కేంద్ర విద్యుత్ శాఖ సహాయ మంత్రి ఆర్.కె.సింగ్ ఈ అవార్డును మంత్రితో పాటు ఈఎన్‌సీ ఎం.వెంకటేశ్వ రరావు, చీఫ్ ఇంజనీర్ శ్రీధర్‌కు అందచేశారు. ఈ సందర్భంగా మంత్రి ఉమా మాట్లాడుతూ పోలవరం ప్రాజెక్టు దేశంలోని 16 జాతీయ ప్రాజెక్టుల్లో శరవేగంగా నిర్మాణం జరుగు తున్న ఏకైక ప్రాజెక్టు అని తెలిపారు. ప్రణా ళిక, ఆచరణ పర్యవేక్షణలో అత్యున్నత ప్రమా ణాలతో నిర్మాణ మవుతున్న ఈ ప్రాజెక్టుకు 2019వ సంవత్సరానికి గాను అవార్డును ప్రకటించడం మరింత ప్రోత్సా హాన్నిస్తుం దన్నారు. ఈ ప్రాజెక్టు తెలుగు ప్రజలకు జీవనాడిగా మంత్రి పేర్కొన్నారు. ప్రాజెక్టు పనులను ఒక లక్ష్య సాధనలో పూర్తి చేసేందుకు ప్రతి సోమవారం సీఎం చంద్ర బాబు స్వయంగా పర్యవేక్షిస్తున్నారని పేర్కొ న్నారు. రాష్ట్ర ప్రభుత్వం ఈ ప్రాజెక్టు కోసం ఖర్చు చేసిన రూ.3,570 కోట్లను కేంద్ర ప్రభుత్వం మంజూరు చేయాల్సి ఉందన్నారు. తమ ప్రభుత్వం 2019 జూలై నాటికి గ్రావిటీతో నీటిని అందించేందుకు కృతనిశ్చయంతో పని చేస్తోందని మంత్రి వివరించారు.

అవార్డు పట్ల హర్షం : సెంట్రల్ బోర్డ్ అఫ్ ఇరిగేషన్, పవర్ (సీబీఐపీ) అవార్డును అందుకున్న మంత్రి దేవినేని ఉమామహేశ్వర రావు, పోలవరం ఈఎన్‌సీ ఎం.వెంకటేశ్వరరావు, చీఫ్ ఇంజనీర్ వి.శ్రీధర్‌కు కృష్ణాజిల్లా ఇరిగేషన్ డిపార్టుమెంట్ ఎన్జీవోల సంఘం అధ్యక్షుడు బత్తిన చిరంజీవి ఒక ప్రకటనలో అభినందనలు తెలిపారు. అవారు పట్ల ఇరిగేషన్ సర్కిల్ విజయవాడ అధ్యక్షుడు యలవర్తి లంకేశ్వర రావు, కార్యదర్శి సీహెచ్ సాయి కిషోర్, ఏపీఎన్జీ వోస్ విజయవాడ నగర యూనిట్ అధ్యక్షుడు ఎస్.కె.నజీరుద్దీన్ హర్షం వ్యక్తం చేశారు.

రేపటి నుంచి విజయవాడలో

ఏపీ రచయిత్రుల మహాసభలు

విశాలాంధ్ర బ్యూరో-అమరావతి : ఆంధ్రప్రదేశ్ రచయిత్రుల మహాసభలు జనవరి 6, 7 తేదీల్లో జరుగుతాయి. విజయవాడ పీబీ సిద్ధార్థ డిగ్రీ కళాశాల ఆడిటోరియంలో కృష్ణా జిల్లా రచయితల సంఘం సారథ్యంలో కార్యక్రమం నిర్వహించనున్నారు. 6న జరిగే ప్రారంభ సభలో కృష్ణా జిల్లా రచయితల సంఘం అధ్యక్షులు గుత్తికొండ సుబ్బారావు, ప్రధానకార్యదర్శి జీవీ పూర్ణచందు, కేంద్రసాహిత్య అకాడమీ పురస్కార గ్రహీత ఓల్గా, మహిళా కమిషన్ చైర్‌పర్సన్ నన్నపనేని రాజకుమారి, జడ్పీ చైర్‌పర్సన్ గద్దె అనురాధ పాల్గొంటారు. ఏపీ శాసనసభ ఉపసభాపతి మండలి బుద్ధప్రసాద్ మహిళ పరిశోధన వ్యాస సంపుటిని ఆవిష్కరిస్తారు. కేంద్రీయ హిందీ సమితి సభ్యులు ఆచార్య యార్లగడ్డ లక్ష్మీప్రసాద్ ఆంధ్ర రచయిత్రుల గ్రంథావిష్కరణ చేస్తారు. అనంతరం ప్రముఖ రచయిత్రులు అధరాపురపు తేజోవతి, ఆలూరు విజయలక్ష్మి, చలసాని వసుమతి, తమిరిశ జానకి, దివాకర్ల రాజేశ్వరి, సత్యవతి, పుట్టపర్తి నాగపద్మిని, పెళ్లకూరు జయప్రదలను సత్కరిస్తారు. మధ్యాహ్నం కార్యక్రమానికి పాటిబండ్ల రజని అధ్యక్షత వహిస్తారు. కేబీ లక్ష్మి, వెలివోలు నాగరాజ్యలక్ష్మి, కొంకేపూడి అనురాధ, కాపూరి సత్యవతి, గుడిపూడి రాధికారాణి వక్తలుగా వ్యవహ రిస్తారు. 7న జరిగే సదస్సుకు చిల్లర భవానీదేవి అధ్యక్షత వహిస్తారు. మందరపు హైమావతి, పీఎస్ఎం లక్ష్మి, కన్నెగంటి అనసూయ, దేవులపల్లి పద్మజ, లీలాసుష్మ గుమ్మా, కుమారి చలమలశెట్టి నిఖిల వక్తలుగా వ్యవహరిస్తారు. ప్రముఖ రచయిత్రులు సూరెడ్డి శాంతాదేవి, బళ్లారు ఉమాదేవి, ముంజులూరి కృష్ణకుమారి, సింహాద్రి పద్మ, ఏఎల్ఎం ప్రకాశ్ కుమారి, అమరజ్యోతిలను సత్కరిస్తారు. తర్వాతి సదస్సుకు తుర్లపాటి రాజేశ్వరి అధ్యక్షత వహిస్తారు. ప్రముఖ రచయిత్రులు యర్రమిల్లి విజయ లక్ష్మి, తమ్మిన పరమాత్మ, బులుసు సరోజినీదేవి, చివుకుల శ్రీలక్ష్మిలను సత్కరిస్తారు. మధ్యాహ్నం జరిగే సదస్సుకు తేళ్ల అరుణ అధ్యక్షత వహిస్తారు.

నిరసన జ్వాల

- వాడవాడలా మోడీ దిష్టిబొమ్మలు దహనం
- పలు జిల్లాల్లో సీపీఐ, సీపీఎం నేతల అరెస్టులు

ఏపీకి ప్రత్యేక హోదా, విభజన హామీలను అమలు చేయాలని ఢిల్లీలో ఆందోళన చేపట్టిన వామపక్షాలపై కేంద్రం దమనకాండ, అక్రమ అరెస్టులకు నిరసనగా.. రాష్ట్రంలో ఉభయ కమ్యూనిస్టులు ఆగ్రహం వ్యక్తం చేశారు. రాష్ట్రానికి దగా చేయటమే కాకుండా శాంతియుత ఆందోళనపై ఉక్కుపాదానికి ఉసిగొల్పిన ప్రధాని నరేంద్ర మోడీ దిష్టిబొమ్మలను దహనం చేయాలని సీపీఐ, సీపీఎం ఇచ్చిన పిలుపు మేరకు ఆంధ్రాలో 13 జిల్లాల్లోనూ పార్టీశ్రేణులు రోడ్డెక్కాయి. ప్రభుత్వ దమననీతిని ఎండగట్టారు. బీజేపీ సర్కారు తీరును నిశితంగా విమర్శించారు. ప్రధాని దిష్టిబొమ్మ దహనంతో నిరసన వ్యక్తం చేసిన సీపీఐ, సీపీఎం నేతలను పోలీసులు అరెస్టు చేయటంతో ఉద్రిక్త వాతావరణం నెలకొంది.



కాకినాడ కల్పన సెంటర్ వద్ద ప్రధాని దిష్టిబొమ్మను దహనం చేసిన కార్యక్రమంలో సీపీఐ జిల్లా కార్యదర్శి తాటిపాక మధు, సీపీఎం జిల్లా కార్యదర్శి కె.శ్రీనివాస్, జనసేన జిల్లా నాయకులు మత్స అప్పాజీ తదితరులు

విశాలాంధ్ర బ్యూరో- అమరావతి : ఏపీకి ప్రత్యేక హోదా, విభజన చట్ట హామీల అమలు సాధన కోసం ఢిల్లీలో గురువారం శాంతియుతంగా ఆందోళన చేస్తున్న సీపీఐ, సీపీఐ(ఎం),ఏపీ ప్రత్యేక హోదా విభజన హామీల సాధన సమితి, ప్రజాసంఘాల నాయకులు, కార్యకర్తలపై పోలీసులు అమానుషంగా లాఠీచార్జి చేసి అరెస్టులు చేయడాన్ని నిరసిస్తూ వామపక్షాల ఆధ్వర్యంలో శుక్రవారం రాష్ట్ర వ్యాప్తంగా నిరసనలు వెల్లువెత్తాయి. సీపీఐ, సీపీఎం ఆధ్వర్యాన ప్రజలు పెద్దసంఖ్యలో రోడ్లపైకి వచ్చి కేంద్రవైఖరిని తప్పుబడుతూ నిరసన ప్రదర్శనలు చేపట్టారు. ప్రధాని నరేంద్ర మోడీ దిష్టిబొమ్మలను దహనం చేశారు. మోడీ నియంతృత్వ విధానాలు వీడకపోతే ఘోరీ కడతామని హెచ్చరించారు. మోడీ దిష్టిబొమ్మల దహనం కార్యక్రమాల సందర్భంగా పలుచోట్ల సీపీఐ, సీపీఎం నాయకులు, కార్యకర్తలను పోలీసులు అరెస్టులు చేశారు.

విశాఖపట్నంలో జరిగిన నిరసన కార్యక్రమంలో సీపీఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి జేవీ సత్యనారాయణమూర్తి, నగర కార్యదర్శి మరుపిళ్ల పైడిరాజు, సీపీఎం నగర కార్యదర్శివర్గసభ్యులు ఆర్.కె.ఎస్.వి.కుమార్ పాల్గొన్నారు. నర్సీపట్నంలో సీపీఐ విశాఖ జిల్లా కార్యదర్శి బాలేపల్లి వెంకట రమణ, సీపీఎం నాయకులు సత్తిబాబు తదితరులు పాల్గొన్నారు. విజయవాడలో జరిగిన కార్యక్రమంలో సీపీఐ విజయవాడ నగర కార్యదర్శి దోనేపూడి శంకర్, సీపీఎం కేంద్ర కమిటీసభ్యులు వి.శ్రీనివాసరావు, రాష్ట్ర కార్యదర్శివర్గసభ్యులు వై.వెంకటేశ్వరరావు, జనసేన నాయకులు పోతిన మహేష్ పాల్గొన్నారు. కడప జిల్లా జమ్మలమడుగులో సీపీఐ రాష్ట్ర కార్యదర్శివర్గసభ్యులు జి.ఈశ్వరయ్య, జిల్లా నాయకులు యం.వి.సుబ్బారెడ్డి పాల్గొన్నారు. గుంటూరులో జిల్లా పార్టీ కార్యదర్శి జంగాల అజయ్‌కుమార్, సీపీఎం జిల్లా నాయకులు భావన్నారాయణ పాల్గొనగా, తిరుపతిలో సీపీఐ చిత్తూరు జిల్లా కార్యదర్శి ఎ.రామానాయుడు, సీపీఎం నాయకులు పుల్లయ్య తదితరులు అరెస్టయ్యారు. విజయనగరం జిల్లా ఎస్.కోటలో జరిగిన కార్యక్రమంలో సీపీఐ రాష్ట్ర కార్యవర్గసభ్యులు పి.కామేశ్వరరావు, విజయనగరంలో జిల్లా సీపీఐ కార్యదర్శి ఒమ్మి రమణ, సహాయ కార్యదర్శి బుగత అశోక్, సీపీఎం జిల్లా కార్యదర్శి తమ్మినేని సూర్యనారాయణ పాల్గొనగా పోలీసులు అరెస్టు చేశారు. తూర్పు గోదావరి జిల్లా కాకినాడలో సీపీఐ, సీపీఎం జిల్లా కార్యదర్శులు తాటిపాక మధు, కె.శ్రీనివాస్, జనసేన నాయకులు మత్స అప్పాజీ పాల్గొన్నారు. ప్రకాశం జిల్లా ఒంగోలులో సీపీఐ, సీపీఎం జిల్లా కార్యదర్శులు ఎం.ఎల్.నారాయణ, పూనాటి ఆంజనేయులు పాల్గొన్నారు. నెల్లూరులో జిల్లా సీపీఐ కార్యదర్శి సీహెచ్ ప్రభాకరరావు, సీపీఎం నెల్లూరు నగర కార్యదర్శి మూలం రమేష్ తదితరులు పాల్గొన్నారు. శ్రీకాకుళంలో జిల్లా సీపీఐ కార్యదర్శి ఎస్.నర్సింహులు, సీపీఎం రాష్ట్ర నాయకులు దడాల సుబ్బారావు పాల్గొన్నారు. కర్నూలులో జరిగిన కార్యక్రమంలో సీపీఐ రాష్ట్ర కార్యవర్గసభ్యులు కె.రామాంజనేయులు పాల్గొనగా పోలీసులు అరెస్టు చేశారు. అనంతపురం, కృష్ణాజిల్లా, పశ్చిమ గోదావరి జిల్లాలోని వివిధ ప్రాంతాల్లో మోడీ దిష్టిబొమ్మలు దహనం చేశారు.

భారత్‌తో వన్డే సిరీస్‌కు ఆసిస్ జట్టు ఇదే..



సిడ్నీ: భారత్‌తో జరుగుతున్న నాలుగు టెస్టు మ్యాచ్‌ల సిరీస్‌లో ఆతిథ్య ఆస్ట్రేలియా గడ్డు పరిస్థితిలో ఉంది. ఈ నేపథ్యంలో వన్డే సిరీస్‌లోనైనా పరువు దక్కించుకోవాలనే ఉద్దేశంతో భారీ మార్పులకు క్రికెట్ ఆస్ట్రేలియా శ్రీకారం చుట్టింది. ఇందులో భాగంగా పలువురు కీలక ఆటగాళ్లపై వేటు వేసింది. జనవరి 12 నుంచి టీమిండియాతో ప్రారంభంకానున్న మూడు వన్డేల సిరీస్‌కు క్రికెట్ ఆస్ట్రేలియా శుక్రవారం 14 మందితో కూడిన వన్డే జట్టుని ప్రకటించింది. సుమారు రెండేళ్ల తర్వాత మళ్లీ ఉస్మాన్ ఖవాజాకు సెలక్టర్ల నుంచి పిలుపు వచ్చింది. ప్రస్తుతం టెస్టు సిరీస్‌లో రాణిస్తోన్న స్పిన్నర్ నాథన్ లియాన్‌కు సెలక్టర్లు అవకాశమిచ్చారు. కొంతకాలంగా పేలవ ప్రదర్శన చేస్తోన్న క్రిస్ లిన్, ట్రావిస్ హెడ్, డార్సీ షార్ట్, బెన్ మెక్ డోర్మెట్, ఆల్ రౌండర్ ఆస్టన్ ఆగర్‌పై సెలక్టర్లు వేటు వేశారు. భారత పర్యటన అనంతరం ఆస్ట్రేలియా జట్టు శ్రీలంకతో రెండు టెస్టు మ్యాచ్‌ల సిరీస్ ఆడనుంది. దీనిని దృష్టిలో పెట్టుకుని ఆసీస్ స్టార్ పేసర్లు మిచెల్ స్టార్క్, జోష్ హాజెల్ ఉడ్, కమ్మిన్స్‌కు సెలక్టర్లు విశ్రాంతినిచ్చారు. 14 మందితో కూడిన జట్టులో పీటర్ సిడ్డిల్‌కు చోటు దక్కడం అందరినీ ఆశ్చర్యానికి గురి చేసింది. పీటర్ సిడ్డిల్ చివరగా ఆస్ట్రేలియా తరపున నవంబర్ 2010లో ఆడాడు. అయితే, ఆసీస్ టాప్ పేసర్లకు విశ్రాంతి కల్పించిన నేపథ్యంలో పీటర్ సిడ్డిల్‌కు అవకాశమిచ్చినట్లు జాతీయ సెలక్టర్ ట్రెవర్ హోన్స్ తెలిపారు. రిచర్డ్‌సన్, జాసన్ బెహ్రెన్‌డార్ఫ్, బిల్లీ స్టాన్‌లేక్ పేసర్ల బృందానికి పీటర్ సిడ్డిల్ సారథ్యం వహించనున్నాడు. పరిమిత ఓవర్ల ఫార్మాట్‌లో ఆస్ట్రేలియా జట్టుకు ఆరోన్ ఫించ్ నాయకత్వం వహిస్తోన్న సంగతి తెలిసిందే. మూడు వన్డేల సిరీస్‌లో భాగంగా తొలి వన్డే జనవరి 12న సిడ్నీ వేదికగా జరగనుంది. రెండో వన్డే అడిలైడ్‌లో, మెల్ బోర్న్‌లో మూడో వన్డే జరగనుంది.

ఆసీస్ జట్టు:

ఆరోన్ ఫించ్ (కెప్టెన్), ఉస్మాన్ ఖవాజా, షాన్ మార్ష్, పీటర్ హ్యాండ్స్‌కోంబ్, గ్లెన్ మ్యాక్స్‌వెల్, మార్కస్ స్టోయినిస్, మిచెల్ మార్ష్(వైస్ కెప్టెన్), అలెక్స్ క్యారీ(వైస్ కెప్టెన్), రిచర్డ్‌సన్, బిల్లీ స్టాన్‌లేక్, జాసన్ బెహ్రెన్‌డార్ఫ్, పీటర్ సిడ్డిల్, నాథన్ లియాన్, ఆడమ్ జంపా

ఆ కార్యక్రమాలను సచిన్ బహిష్కరించాలి

ఆచ్రేకర్ అంత్యక్రియల తీరుపై మండిపడిన శివసేన



ముంబై: క్రికెట్ దిగ్గజం సచిన్ టెండూల్కర్ గురువు, ద్రోణాచార్య పురస్కార గ్రహీత రమాకాంత్ ఆచ్రేకర్ అంత్యక్రియలను ప్రభుత్వ లాంఛనాలతో నిర్వహించలేదని శివసేన పార్టీ మహారాష్ట్ర ప్రభుత్వంపై మండిపడింది. ఇకనుంచి మహారాష్ట్ర ప్రభుత్వం నిర్వహించే కార్యక్రమాల్లో పాల్గొనకుండా బహిష్కరించాలని సచిన్‌ను కోరింది. వృద్ధాప్య సమస్యలతో బుధవారం సాయంత్రం ముంబైలోని తన స్వగృహంలో ఆచ్రేకర్ కన్నుమూశారు. ప్రపంచానికి సచిన్ లాంటి దిగ్గజాన్ని అందించిన గురువుగా ఆయన అందరికీ సుపరిచితం. 'పద్మశ్రీ, ద్రోణాచార్య అవార్డు గ్రహీత అయిన రమాకాంత్ ఆచ్రేకర్‌కు ఎందుకు ప్రభుత్వ లాంఛనాలతో అంత్యక్రియలు నిర్వహించలేదు? మహారాష్ట్ర ప్రభుత్వం ఆయన్ను నిర్లక్ష్యం చేసింది. దీనికి నిరసనగా ప్రభుత్వ కార్యక్రమాల్లో పాల్గొనకుండా సచిన్ వాటిని బహిష్కరించాలి' అని ఆ పార్టీ సీనియర్ నాయకుడు సంజయ్ రౌత్ అన్నారు. సేన పార్టీ పత్రిక సామ్నాలో ఆచ్రేకర్ సేవలను కొనియాడుతూ ఓ కథనాన్ని ప్రచురించింది. అలాగే ఆయన అంత్యక్రియలు నిర్వహించిన తీరుపై విమర్శలు చేసింది. ఇది క్రికెట్‌కు ఆయన చేసిన సేవలను తక్కువ చేయడమే కాకుండా, ప్రభుత్వ అసమర్థతను వెల్లడిస్తుందని మండిపడింది.

పంతాస్టిక్.. శభాష్ వాల్..!



- పటిష్ఠ స్థితిలో టీమిండియా
- సెంచరీల మోత, పుజారా 'డబుల్' మిస్
- మొదటి ఇన్నింగ్స్‌లో 622/7డిక్లేర్డ్
- రాణించిన విహారి, జడేజా

సిడ్నీ: భారత్-ఆస్ట్రేలియాల మధ్య జరుగుతున్న చివరి టెస్టు తొలి ఇన్నింగ్స్‌లో టీమిండియా బ్యాట్స్‌మెన్ అదరగొట్టారు. దీంతో తొలి ఇన్నింగ్స్‌ను కోహ్లిసేన 622/7 వద్ద డిక్లేర్ చేసింది. 168వ ఓవర్లో జడేజా (81) పెవిలియన్ చేరిన అనంతరం టీమిండియా సారథి విరాట్ కోహ్లి ఇన్నింగ్స్‌ను డిక్లేర్ చేస్తున్నట్లు ప్రకటించాడు. చివరి టెస్టు రెండో రోజు ఆటలో భాగంగా 303/4 ఓవర్‌నైట్ స్కోరుతో మ్యాచ్ ప్రారంభించిన కోహ్లిసేన మరో 319 పరుగులు జోడించింది. పుజారా(193), రిషబ్ పంత్(159, నాటౌట్) రాణించడంతో ఆసీస్ ముందు టీమిండియా భారీ స్కోరును నిలిపింది. రిషబ్ పంత్ ఈ ఫీట్ సాధించడంతో ఉపఖండం అవల అత్యధిక పరుగులు చేసిన వికెట్ కీపర్‌గా రికార్డు సృష్టించాడు. ఇన్నింగ్స్‌లో నాథన్ నాలుగు వికెట్లు తీయగా.. హేజిల్‌వుడ్ రెండు, మిచెల్ స్టార్క్ ఒక వికెట్ పడగొట్టాడు. ఆస్ట్రేలియా గడ్డపై భారత్ చేసిన రెండో భారీ స్కోరు ఇది. 2004లో సిడ్నీ స్టేడియంలోనే భారత్ 7 వికెట్ల నష్టానికి 705 పరుగులు చేసింది.

విహారి ఔట్..

తొలుత 303/4 ఓవర్‌నైట్ స్కోర్‌తో బ్యాటింగ్ మొదలు పెట్టిన టీమిండియాకు ఆదిలోనే ఎదురు దెబ్బ తగిలింది. తొలి పది ఓవర్లలోనే కోహ్లిసేన ఐదో వికెట్ చేజార్చుకుంది. హనుమ విహారి (42)ని నాథన్ లైయన్ పెవిలియన్ చేర్చాడు. పుజారాతో కలిసి విహారి 101 పరుగుల భాగస్వామ్యాన్ని జోడించాడు.

ఈ ఇన్నింగ్స్ పుజారాదే..

టీమిండియా మాజీ క్రికెటర్ సంజయ్ మంజ్రేకర్ చెప్పినట్లు.. కొన్నాళ్ల తర్వాత ఈ సిరీస్‌ను గుర్తు చేసుకుంటే ముందు పుజారా పేరే స్ఫురిస్తుందేమో. నాలుగో టెస్టు తొలి ఇన్నింగ్స్ టీమిండియా నయావాల్‌దే అనడంలో సందేహమే లేదు. తొలిరోజు నుంచి ఆసీస్ బౌలర్లకు చుక్కలు చూపించిన పుజారా తొలిరోజే రికార్డు శతకం నమోదు చేసుకున్నాడు. మొదటిరోజు 130 పరుగులు చేసి రెండో రోజూ అదే జోరు కొనసాగించాడు. 193 పరుగులు చేసి ద్విశతకానికి దగ్గరగా వచ్చిన పుజా రాను లైయన్ అడ్డుకున్నాడు. తొలి ఇన్నింగ్స్‌లో నయావాల్ మొత్తంగా 22 బౌండరీలు బాదాడు.130 ఓవర్లో లైయన్ వేసిన ఆఖరు బంతిని అంచనా వేయలేకపోయిన పుజారా.. అతడికే క్యాచ్ ఇచ్చి వెను దిరిగాడు. దీంతో ద్విశతకం చేయాలన్న పుజారా కల చెదిరింది. అప్పటికి టీమిండియా 420 పరుగులు చేసింది.

పంత్ శతకం..

తొలి ఇన్నింగ్స్‌లో బ్యాటింగ్‌కు దిగిన పంత్ దుమ్ములేపాడు. పైన్ సేన ముందు భారీ లక్ష్యాన్ని ఉంచడంలో కీలక పాత్ర పోషించాడు. ఎడాపెడా బౌండరీలు బాదుతూ 137 బంతుల్లో టెస్టు కెరీర్‌లో రెండో శతకాన్ని పూర్తి చేసుకున్నాడు. మరో ఎండ్‌లో ఉన్న జడేజా సైతం పంత్‌కు సహకరిస్తూ టెస్టు కెరీర్‌లో పదో అర్ధశతకాన్ని పూర్తి చేసుకున్నాడు. తర్వాత దూకుడు పెంచిన పంత్-జడేజా జోడీ స్కోరు బోర్డును 600 దాటించింది. దీంతోపాటు 204 కీలక భాగస్వామ్య పరుగులను అందించింది. ఒకానొక దశలో పంత్ ద్విశతకం, జడేజా శతకం చేసేలా కనిపించారు. బౌండరీలు బాదుతూ స్టేడియాన్ని కాసేపు హోరెత్తించారు. దూసుకుపోతున్న ఈ జంటను నాథన్ లైయన్ విడదీశాడు. 168వఓవర్లో నాథన్ వేసిన బంతికి జడేజా 81 పరుగుల వ్యక్తిగత స్కోర్ వద్ద బౌల్డ్ అయ్యాడు. అప్పటికే జట్టు స్కోరు 600 దాటింది. దీంతో టీమిండియా సారథి విరాట్ కోహ్లి 622/7 వద్ద ఇన్నింగ్స్ డిక్లేర్ చేస్తున్నట్లు ప్రకటించాడు. రెండో రోజు ఆట ముగిసే సమయానికి ఆసీస్ తొలి ఇన్నింగ్స్‌లో వికెట్లు కోల్పోకుండా 24 పరుగులు చేసింది.

ఈసారి జడ్డూ వల్లే సెంచరీ : పంత్

ఆస్ట్రేలియాతో జరుగుతున్న నాలుగో టెస్టు తొలి ఇన్నింగ్స్‌లో టీమిండియా యువ వికెట్ కీపర్ రిషబ్ పంత్ అద్భుత శతకం బాదేశాడు. 189 బంతులాడి 159 పరుగులతో అజేయంగా నిలిచాడు. గతంలో అతడు రెండు సార్లు 92 వద్ద ఔటయ్యాడు. ఈసారి మాత్రం 'నర్వస్ 90 సిండ్రోమ్'ను తప్పించుకున్నాడు. అవతలి ఎండ్‌లో మంచి బ్యాట్స్‌మన్ (రవీంద్ర జడేజా)తో కలిసి ఆడటం వల్లే ఇది సాధ్యమైందని తెలిపాడు. జడ్డూ (81)తో కలిపి ఏడో వికెట్‌కు అతడు 204 పరుగుల భాగస్వామ్యం నెలకొల్పాడు. గతంలో 20, 30ల వద్ద ఔటయ్యే వాడివి కదా ఆట తీరులో మార్పులేవైనా చోటు చేసుకున్నాయా అన్న ప్రశ్నకు జవాబు ఇచ్చాడు. 'నా ఆటలో ఎలాంటి మార్పు లేదు. ఈసారి అవతలి ఎండ్‌లో మంచి బ్యాట్స్‌మన్ ఉన్నాడు. చాలాసార్లు నేను క్రీజులోకి వచ్చినప్పుడు టెయిలెండర్లు ఉంటారు. అలాంటి సమయంలో ఆలోచన వేరేలా ఉంటుంది. బ్యాట్స్ మన్‌తో కలిసి ఆడుతున్నప్పుడు ఆలోచనా విధానం మరోలా ఉంటుంది. స్వేచ్ఛగా ఆడేందుకు జట్టు యాజమాన్యం నాకు అవకాశమిచ్చింది. బ్యాటింగ్‌కు దిగిన ప్రతిసారీ ఆటను ఆస్వాదిస్తా. గతంలో వెస్టిండీస్‌పై రెండు సార్లు 92 వద్ద ఔటయ్యాను. ఇప్పుడది నన్ను కంగారు పెట్టింది. కానీ ఆ దశను త్వరగా దాటేశా. అంతర్జాతీయ క్రికెట్‌లో సాధించే ప్రతి శతకం ప్రత్యేకం. ఇప్పుడే నా కెరీర్ మొదలైంది. శతకాల గురించి నేను ఆలోచించను. జట్టు అవసరమేంటో ఆలోచిస్తా. క్రికెట్‌లో నిరంతరం నేర్చుకోవాలి. అప్పుడే గడ్డు దశలను సులభంగా దాటేస్తాం' అని పంత్ అన్నాడు.

13 తర్వాత ఎప్పుడైనా సమ్మె!

ఈయూ నిర్ణయానికి కార్మిక సంఘాల మద్దతు



విశాలాంధ్ర బ్యూరో - అమరావతి: ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర రోడ్డు రవాణా సంస్థ (ఏపీఎస్ఆర్టీసీ) ఉద్యోగుల సమస్యలను పరిష్కరించని పక్షంలో జనవరి 13వ తేదీ తర్వాత ఎప్పుడైనా సమ్మెకు సిద్ధపడాలని ఎంప్లాయీస్ యూనియన్ (ఈయూ) నిర్ణయించింది. దీనికి నేషనల్ మజ్దూర్ యూనియన్ (ఎన్ఎంయూ) మినహా మిగిలిన అన్ని కార్మిక సంఘాలు మద్దతు తెలిపాయి. నష్టాల్లో ఉన్న ఆర్టీసీని ప్రభుత్వం ఆర్థికంగా ఆదుకోవాలని, సిబ్బందికి మెరుగైన వేతనాలను చెల్లించాలనే పలు డిమాండ్లను సాధించేందుకు జాయింట్ యాక్షన్ కమిటీ (జేఏసీ) ఏర్పాటుకు అన్ని సంఘాలు నిర్ణయించాయి. విజయవాడలోని పండిట్‌నెహ్రూ బస్టేషన్ (పీఎన్‌బీఎస్)లోని ఈయూ రాష్ట్ర కార్యాలయంలో శుక్రవారం యూనియన్ రాష్ట్ర అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు వై.వి.రావు, పలిశెట్టి దామోదరరావు ఇతర కార్మిక సంఘాల నేతలతో సమావేశమయ్యారు. ఉద్యోగులకు 50 శాతం ఫిట్‌మెంట్‌తో కూడిన వేతనాలు సహా 91 డిమాండ్లను పరిష్కరించాలని, లేకుంటే సమ్మె అనివార్యమని ఇటీవల యాజమాన్యానికి జారీ చేసిన నోటీసుపై చర్చించారు. యాజమాన్యం ప్రతిపాదించిన 15 శాతం ఫిట్‌మెంట్‌ను ఎట్టి పరిస్థితుల్లో ఆమోదించేది లేదని, ఉద్యోగులు కోరుతున్న నిజవేతనాలు 50 శాతం ఫిట్‌మెంట్‌ను ఇవ్వాల్సిందేనని మరోసారి నేతలు స్పష్టం చేశారు. సమావేశంలో తీసుకున్న నిర్ణ యాలను ఎన్ఎంయూతోపాటు మిగిలిన అన్ని సంఘాలకు లేఖల ద్వారా తెలియచేయాలని నిర్ణయించారు. ఎన్ఎంయూ కూడా కలసివస్తే ఆ యూనియన్‌ను కలుపుకుని జేఏసీ ద్వారా సీఎం చంద్రబాబు, రవాణాశాఖమంత్రి అచ్చెన్నాయుడు, సంస్థ ఎండీ ఎన్.వి.సరేంద్రబాబును కలవాలని నిర్ణయించారు. దేశవ్యాప్తంగా ఈనెల 8,9వ తేదీల్లో జరగనున్న సమ్మెకు ఈయూ ఇప్పటికే మద్దతు ప్రకటించిందని, ఎన్ఎంయూ కూడా ధర్నాలు చేపట్టాలని నిర్ణయించడం పట్ల ఈయూ నాయకులు హర్షం వ్యక్తం చేశారు. ఈ సమావేశంలో ఎస్‌డబ్ల్యూ ప్రతినిధి సి.హెచ్. సుందరయ్య, కార్మిక పరిషత్ ప్రతినిధి వి.వరహాల నాయుడు, వైసీపీ నుంచి సి.బి.ఎస్.రెడ్డి, యునైటెడ్ వర్కర్స్ నుంచి ప్రకాష్, బహుజన వర్కర్స్ నుంచి పాల్, వర్కర్స్ యూనియన్ నుంచి జి.శ్రీనివాసరాజు, ఓస్వా ప్రతినిధి ఎం.వి.కొండా రెడ్డి, ఈయూ రాష్ట్ర నాయకులు ఎం.హనుమంత రావు, అవుల ప్రభాకర్, జి.వి.నరసయ్య తదితరులు పాల్గొన్నారు.

దూదేకుల అభివృద్ధికి చేయూతనివ్వాలి

విశాలాంధ్ర - అమరావతి : దూదేకుల సామాజిక వర్గం అభివృద్ధికి ప్రభుత్వం మరింత చేయుతను ఇవ్వాలని ఆంధ్రప్రదేశ్ ముస్లిం దూదేకుల పోలిటికల్ జేఏసీ రాష్ట్ర అధ్యక్షుడు దస్తగిరి కోరారు. దూదేకుల సంక్షేమాన్ని కాంక్షిస్తూ నిధులు మంజూరు చేయడం పట్ల హర్షాన్ని వ్యక్తం చేస్తూ సీఎం చంద్రబాబును కలిసి జేఏసీ రాష్ట్ర అధ్యక్షుడు దస్తగిరి ధన్యవాదాలు తెలియచేశారు. రాష్ట్రవ్యాప్తంగా 25 లక్షల మంది దూదేకుల కులస్తులు ఉన్నామని నేటికి దూదేకుల ఆర్థిక కష్టాల నడుమ జీవనం సాగిస్తున్నారని దస్తగిరి ఆవేదన వ్యక్తం చేశారు. తమ కష్టాలను చంద్రబాబుకు వివరించగా సానుకూలంగా విన్నారన్నారు. కేవలం ఓటు బ్యాంకు మాదిరిగా కాకుండా అన్ని విధాలా తమ సామాజిక వర్గం అభివృద్ధికి చేయూతను ఇవ్వాలని విజ్ఞప్తి చేశారు. రాజకీయంగా సైతం తమ ఎదుగుదలకు అవకాశం ఇవ్వాలని కోరామని చెప్పారు. దీనికి సీఎం సానుకూలంగా స్పందించి దూదేకులు సంక్షేమానికి కృషి చేస్తానని హామీ ఇచ్చారని దస్తగిరి వెల్లడించారు. ముఖ్యమంత్రిని కలిసిన వారిలో జేఏసీ ప్రధాన కార్యదర్శి గోనుగుంట్ల మహబూబ్ బాషా, జేఏసీ ఉపాధ్యక్షుడు దత్తేశ్వర్, విక్టరీ సుభాని, మస్తాన్ వలి తదితరులు ఉన్నారు.

రాజకీయాల్లోకి రాగానే ఎంపీ, ఎమ్మెల్యేలు కాలేరు

నెల్లూరు, తూర్పుగోదావరి సమీక్షలలో పవన్‌కల్యాణ్



విశాలాంధ్ర బ్యూరో-అమరావతి: రాజకీయాల్లోకి వచ్చిన వెంటనే ఎమ్మెల్యేలు, ఎంపీలు అయిపోదాం అనుకుంటే సాధ్యపడే పనికాదని జనసేనపార్టీ అధ్యక్షులు పవన్‌కల్యాణ్ అన్నారు. విజయవాడ జనసేన పార్టీ రాష్ట్ర కార్యాలయంలో శుక్రవారం నెల్లూరు, తూర్పు గోదావరి జిల్లా నాయకులు, కార్యకర్తలతో ప్రత్యేకంగా సమీక్ష నిర్వహించారు. జనసేన కోసం పనిచేసే వారికి తప్పకుండా గుర్తింపు లభిస్తోందని పవన్ అన్నారు. పదవులంటే ఎమ్మెల్యే, ఎంపీలే కాదని పార్టీ అధికారంలోకి వస్తే నామినేటెడ్ పదవులు సైతం ఇస్తామన్నారు. సమాజం కోసం పని చేయాలన్న తపన, ఓపిక, సహనం ఉన్నవారే రాజకీయాల్లో రాణిస్తారని పేర్కొన్నారు. ఈ లక్షణాలన్నీ చిన్ననాటి నుంచే అలవర్చుకుని రాజకీయాల్లోకి వచ్చానని స్పష్టం చేశానన్నారు. కేవలం ఒకటి, రెండు కులాలను అడ్డుపెట్టుకుని రాజకీయాల్లో విజయం సాధించలేమన్నారు. జనసేనపార్టీ ద్వారా ప్రజలకి సేవ చేయడానికి నిబద్ధతతో పనిచేస్తున్నామన్నారు. వ్యక్తిగతంగా రాణిస్తూ కనీసం పది వేల ఓట్లు సాధించుకునే సామర్థ్యం ఉన్నవారిని పార్టీ అక్కున చేర్చుకుంటుందని పేర్కొన్నారు. 9వతేదీ తర్వాత స్వల్ప కాలిక జిల్లా కమిటీలను నియమిస్తామని వెల్లడించారు. నెల్లూరు జిల్లా రాజకీయాల్లోకి కొత్త తరాన్ని తీసుకురాకుంటే ఆ జిల్లాకి అన్యాయం చేసిన వారమవుతామన్నారు. నెల్లూరు జిల్లా బలమైన రాజకీయ చైతన్యం ఉన్న జిల్లా అని స్పష్టం చేశారు. రాజకీయ ఉద్దండులు పుట్టిన జిల్లా అనీ, అయితే రాజకీయం అంతా ప్రస్తుతం పది కుటుంబాల చేతుల్లో చిక్కుకుపోయిందన్నారు. తూర్పుగోదావరిజిల్లాలో కూడా రాజకీయ చైతన్యం బాగుందన్నారు. జనసేనపార్టీ ద్వారా ప్రజలకు సేవ చేయడానికి సిద్ధంగా ఉండాలని తూర్పుగోదావరి జిల్లా శ్రేణులకు దిశానిర్దేశం చేశారు. జనసేనపార్టీ నాయకులు నాదెండ్ల మనోహర్, రావెల కిషోర్‌బాబు, చంద్రశేఖర్‌రావు తదితరులు పాల్గొన్నారు.

Printed & published by Edupuganti Nageswara Rao on behalf of Visalaandhra Vignana Samithi, Printed at Visalaandhra Press, Chandram Buildings, Machavaram, Vijayawada, Andhra Pradesh. Published at Visalaandhra Vignana Samithi, 33-22-2, Visalaandhra Road, Chuttugunta, Vijayawada - 520004, Andhra Pradesh. EDITOR : MUTYALA PRASAD. RNI No. 1138/57, Postal: Regd. No.VJA: VJ/042/2018-20, Phones : Editorial :2430220, Manager : 2431301, Fax No. 0866 2431780, E-Mail : ap.visalaandhra@gmail.com.